epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No: APTEL/26/A6182

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 04-08- 2026 | సంపుటి: 01, సంచిక: 10, గుంటూరు. | పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

జంతర్ మంతర్ నిరసనలకు సరైన ప్రదేశం కాదా ?

జంతర్ మంతర్ పై సుప్రీంకోర్టులో పిటిషన్ –కేంద్రం వివరణ కోరిన సుప్రీంకోర్టు

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు – శాంతిభద్రతలు పోలీసుల బాధ్యత – ఢిల్లీ నిరసనలపై ముందస్తు ఆదేశాలకు నిరాకరణ

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు నిరసనల, ప్రదర్శనల కోసం ప్రత్యామ్నాయాన్ని కనుగొనడంపై స్పందన కోరుతూ సుప్రీంకోర్టు సోమవారం కేంద్రానికి నోటీసు జారీ చేసింది. రాజధానిలోని జంతర్ మంతర్ ఇకపై నిరసనలకు అనువైన వేదిక కాదని, అటువంటి సమావేశాలు నివాసితులకు అసౌకర్యం కలిగిస్తాయని, నిత్యావసర సేవలకు అంతరాయం కలిగిస్తాయని వాదిస్తూ సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్‌లు జయమల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పార్లమెంట్, సెంట్రల్ విస్టా, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు జంతర్ మంతర్ అత్యంత సమీపంలో ఉన్నందున, రామ్‌లీలా మైదానాన్ని లేదా తగినంత విశాలమైన, సురక్షితమైన మరో మైదానాన్ని ప్రధాన నిరసన వేదికగా నిర్ణయించాలని పిటిషనర్ సూచించారు. కేంద్రం సూచనలు తీసుకురావాలని ఎస్ జీకి ఆదేశించింది. ఢిల్లీలో నిరసనలపై ముందస్తు ఆదేశాలకు నిరాకరించింది. శాంతిభద్రతలు పోలీసుల బాధ్యతని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఊహాజనిత ఘటనపై వ్యాఖ్యానించలేమని తేల్చిచెప్పింది. పోలీసులు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కుంటారని సూచించింది. తప్పు జరిగితే చట్టం తనపని చేస్తోందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడే మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేమని ప్రకటించింది. నీట్ యూజీ పేపర్ లీక్‌పై కాక్రోచ్ పార్టీ కేంద్రప్రభుత్వం, ధర్మేంద్ర ప్రధాన్ కు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే.

డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి: సీఎం చంద్రబాబు

అమరావతి ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. Data Driven Decision Makingపై అధికారులకు సీఎం మార్గనిర్దేశం చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్‌టీజీ ద్వారా పాలన మరింత సమర్థవం తంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

అభివృద్ధి కార్యక్రమాలు

జగన్‌కు నచ్చవు

: ఎంపీ కలిశెట్టి

ఢిల్లీ, ఆగస్టు 3 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే జగన్‌కు నచ్చవని విమర్శించారు. ప్రజల్లో జగన్‌పై చర్చ జరుగుతుందని తెలిపారు. సోమవారం ఢిల్లీ వేదికగా మీడియాతో ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. జగన్ తన మీడియాలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను తాను సాధించానని చెప్పుకుంటున్నారని అన్నారు. ఈ విమానాశ్రయం ప్రారంభానికి కొన్ని గంటల ముందే ఉత్తరాంధ్ర పర్యటన చేపట్టి జగన్ సమస్యలు సృష్టించే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. జగన్ ఉత్తరాంధ్ర పర్యటన చేసి సాధించింది ఏమిటి.? అని ప్రశ్నించారు.

గడువు ముందే భోగాపురం విమానాశ్రయం పూర్తి చేశాం..

ప్రధానమంత్రి నరేంద్రమోదీ భోగాపురం పర్యటనను సైతం జగన్ రెడ్డి డిస్టర్బ్ చేశారని ఎంపీ కలిశెట్టి ఆగ్రహించారు. భోగాపురం ఇంటర్నేషనల్ విమానాశ్రయం ప్రధానమంత్రి చేతుల మీదుగా ఆగస్టు ఒకటో తేదీన ప్రారంభించారని ప్రస్తావించారు. ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ ఎయిర్‌పోర్ట్‌ను మూడు లక్షల మంది ప్రజల సమక్షంలో జాతికి అంకితం చేశారని చెప్పుకొచ్చారు. గడువు ముందే భోగాపురం విమానాశ్రయం పూర్తి చేశామని తెలిపారు.

ఉత్తరాంధ్రకు గేమ్ చేంజర్‌గా భోగాపురం ఎయిర్‌పోర్ట్

ఉత్తరాంధ్రకు గేమ్ చేంజర్‌గా భోగాపురం ఎయిర్‌పోర్ట్ మారబోతుందని ఎంపీ కలిశెట్టి వివరించారు. సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను బాధ్యతగా పూర్తి చేస్తున్నారని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబు నాయకత్వంలో పరుగులు పెడుతుందని చెప్పుకొచ్చారు. ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో ఉపాధి కోసం ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారి వలసలు ఆగిపోయాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి చేయడంలో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

: సీఎం చంద్రబాబు

అమరావతి ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తాగునీటి ఎద్దడి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు కృష్ణా, గోదావరి నదుల నీటి పరిస్థితిని సీఎంకు వివరించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, ఇటీవల కృష్ణా నదిలో ప్రవాహాలు ప్రారంభమైనట్లు తెలిపారు. గోదావరిలోని వరద పరిస్థితిపైనా సీఎంకు వివరించారు.

కృష్ణా బేసిన్‌కు ఎగువ నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్షాభావం కారణంగా రానున్న రోజుల్లో వశుగ్రానం కొరత ఏర్పడే అవకాశమున్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తరువాయి 2వ పేజీలో...

పల్నాడు అభివృద్ధికి అండగా ఉంటామని ప్రధాని హామీ ఇచ్చారు: ఎంపీ కృష్ణదేవరాయలు..

ఢిల్లీ: పల్నాడు జిల్లా అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక సాధికారతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వివరిం చారు. ఢిల్లీలోని ప్రధాని అధికారిక నివా సంలో ఆయనను ఎంపీ మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా 'క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్' ప్రగతిపై సమగ్ర నివేది కను అందజేశారు. జిల్లాలో ఆర్థిక కార్యకలా పాలను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాల వివరాలను ప్రధానికి ఎంపీ వివరించారు. పల్నాడు జిల్లాలో 1.03 లక్షల మంది లబ్ధిదారులకు మొత్తం రూ.3,216 కోట్ల మేర రుణాలు పంపిణీ చేసినట్లు మోదీకి కృష్ణదేవరాయలు తెలిపారు. ఇందులో తొలి సారిగా 70 వేల మందికి పైగా లబ్ధిదారులకు రుణ సాయం అందించినట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ 83,365 మంది రైతులకు రూ. 2,286 కోట్ల మేర రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి వర్గాలకు ఆర్థిక అవకాశాలు పెంచేందుకు జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. పల్నాడు జిల్లాలో గ్రామీణ సాధికారత, ఆర్థిక పురోగతి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రధాని మోదీ అభినందనలు తెలిపినట్లు ఎంపీ తెలిపారు.

వైభవంగా ఆషాఢ సారె ఉత్సవాలు

- భారీగా తరలివస్తున్న భక్తులు..
- 20వ రోజు ఇంద్రకీలాద్రికి భారీగా తరలివచ్చిన సారె బృందాలు
- 48 బృందాల నుంచి 18,432 మంది భక్తుల రాక
- పసుపు, కుంకుమలు, చీరలు, గాజులతో అమ్మవారికి సారె సమర్పణ
- సారె బృందాలకు దేవస్థానం ఉచిత దర్శనం, ఆశీర్వచన ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి,
ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మను ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావించే మహిళా భక్తులు ఆషాఢ సారె ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. ఆషాఢ సారె ఉత్సవాల 20వ రోజైన సోమవారం అమ్మవారి సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది. పసుపు, కుంకుమలు, గాజులు, చీరలు, సారెలతో అలంకరించిన సారె కానుకలను సమర్పించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. మొత్తం 48 సారె బృందాలు అమ్మవారిని దర్శించుకోగా, ఆయా బృందాల ద్వారా 18,432 మంది భక్తులు సారె సమర్పణలో పాల్గొన్నారు. సారె సమర్పణకు వచ్చిన మహిళా భక్తులకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ఉచిత దర్శనం కల్పించడంతో పాటు వేదపండితుల ఆశీర్వచనాలు అందేలా చర్యలు చేపట్టింది.

భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆషాఢ మాసంలో ప్రతి ఏడాది నిర్వహించే సారె ఉత్సవాలు భక్తి వైభవాన్ని చాటుతు న్నాయని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

ఏజెన్సీలో ఏరియా

అక్రమ సామ్రాజ్యం

గిరిజన చట్టాలకు రక్షణ కరువు

అక్రమ కట్టడాలతో కోట్ల రూపాయల దందా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:
ఆగస్టు 03: (ప్రజా కలం న్యూస్)

"అభివృద్ధి" అనే ముసుగులో,ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను,ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ,కొందరు బిల్డర్లు,రియల్ ఎస్టేట్ దళారులు అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలతో కోట్ల రూపాయల దందా చేస్తున్నారు.బఫర్ జోన్, ఎఫ్ టి ఎల్,1/70, పీసా చట్టం,1996,1/59 రెగ్యులేషన్ అమల్లో ఉన్నప్పటికీ,వాటిని పట్టించుకోకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడుతుండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలం, విద్యా నగర్ కాలనీ గ్రామపంచాయతీ పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. అయిన ప్పటికీ,ఇక్కడ గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా బహుళ అంతస్తుల,కమర్షియల్ భవనాలు, వ్యాపార నముదాయాల నిర్మాణాలు చేవడుతు న్నారు.అక్రమంగా నిర్మిస్తున్న యజమానులతో, మాట్లాడుతూ "మీరు టెన్షన్ పడకండి. పైసలు కట్టండి.ఫ్లోర్ మీద ఫ్లోర్ కట్టిస్తాం.పంచాయతీ కార్యదర్శి, ఎమ్మార్వో కార్యాలయం నుంచి అధికారులు వచ్చినా, మేం చూసుకుంటాం" అంటూ అమాయక ప్రజల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరియు బిల్డర్లు లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తక్కువ ధరకు ఫ్లాట్ ఇస్తామంటూ,గిరిజనులు, మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేసి, "ఇది ప్రభుత్వ భూమి.బఫర్ జోన్ అయినా పర్వాలేదు. మేం అన్నీ సెటిల్ చేస్తాం" అంటూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంజనీర్ పర్యవేక్షణ లేకుండా, నాణ్యత లేని సిమెంట్, స్టీల్‌తో కడుతున్నారు. ఒక్కో అదనపు ఫ్లోర్‌కు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. ఏదైనా అధికారులు వస్తే, "మామూలుగా మాట్లాడుకుందాం" అని సెటిల్మెంట్ చేసుకుంటున్నారు. ఫిర్యాదు చేసినా, "విచారిస్తాం" అని ఫైల్‌ను పెండింగ్‌లో పెడుతున్నారు.ఏజెన్సీ ప్రాంతంలో, పీసా చట్టం 1996 ప్రకారం గ్రామసభ అనుమతి లేకుండా ఏ నిర్మాణం, భూ లావాదేవీ జరగకూడదు. కానీ, ఇక్కడ గ్రామసభకు తెలియకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయి.

తరువాయి 2వ పేజీలో...

తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి
: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి...

మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతపై తరచూ పరీక్షలు నిర్వహించి, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా రవాణా శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అనవసర నిబంధనల తొలగింపుపై అధికారులు సీఎంకు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం--5బీ వంటి పరీక్షలను తొలగించడం ద్వారా అవినీతిని తగ్గించి ప్రజలకు సులభతర సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ సంస్కరణలను దశలవారీగా అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించి ప్రజలకు మరింత సులభమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కైకలూరులో అభివృద్ధి
ఆశల జాతర!

- ఆగస్టు 10న కలిదిండి వేదికగా ముఖ్యమంత్రి పర్యటన
- 22ఏ పట్టాలు, కొత్త పాస్‌పుస్తకాల పంపిణీతో పాటు కీలక ప్రకటనలపై ఉత్కంఠ
- ఏలూరు జిల్లా దృష్టి అంతా కలిదిండి సభపైనే
- అధికార యంత్రాంగం అప్రమత్తం, రాజకీయంగా పెరిగిన సందడి

కలిదిండి, ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

ఆగస్టు 10న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిదిండి మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గంలో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. ముఖ్యమంత్రి పర్యటనతో కలిదిండి ప్రాంతం సందడిగా మారగా, ప్రజల్లోనూ భారీ అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 22ఏ పట్టాలు, కొత్త పాస్‌పుస్తకాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న భూ హక్కుల సమస్యలకు పరిష్కారం దొరకనున్న నేపథ్యంలో వేలాది కుటుంబాలు ఈ సభపై ఆశలు పెట్టుకున్నాయి. అంతేకాకుండా, కైకలూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. తాగునీరు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కొత్త హామీలు వెలువడతాయా అనే అంశం ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ ఆధ్వర్యంలో సభా ప్రాంగణం, భద్రత, ట్రాఫిక్, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఇక అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు సభను విజయవంతం చేసేందుకు విస్తృతంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

గ్రామాల్లో ప్రజలను సభకు తరలించే ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి పర్యటనతో కైకలూరు నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సభ ద్వారా ఏలూరు జిల్లా అభివృద్ధికి కొత్త దిశా నిర్దేశం లభిస్తుందా, కైకలూరుకు మరిన్ని అభివృద్ధి వరాలు ప్రకటిస్తారా అనే అంశాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఆగస్టు 10న జరిగే ఈ సభ జిల్లా రాజకీయ, అభివృద్ధి పరంగా కీలక మలుపుగా నిలుస్తుందని స్థానికులు భావిస్తున్నారు.



అనుమతుల్లేకుంటే ఆర్బిట్ జూనియర్ కళాశాల సీజ్ చేయాలి
జిల్లా అధికారులకు AIFDS వినతి

అనంతపురం, ఆగస్టు 3 (ప్రజా కలం న్యూస్):

అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డులో పశువుల సమీపంలో నిర్వహిస్తున్న ఆర్బిట్ బాలికల జూనియర్ కళాశాలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేలితే కళాశాలను వెంటనే సీజ్ చేసి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను AIFDS విద్యార్థి సంఘం కోరింది. ఈ మేరకు ప్రజా సమస్యల వేదికలో అధికారులకు వినతిపత్రం సమర్పించింది.

గతంలో చైతన్య డిగ్రీ కళాశాల నిర్వహించిన భవనంలో ప్రస్తుతం ఆర్బిట్ బాలికల జూనియర్ కళాశాల నడుస్తోందని, అయితే సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందకుండా అపార్ట్‌మెంట్ భవనంలో కళాశాలను నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుతోందని సంఘం పేర్కొంది.

విద్యార్థినుల భద్రత, మౌలిక సదుపాయాలు, అగ్నిమాపక భద్రత, తరగతి గదుల ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనల అమలు వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది.

విచారణలో కళాశాల అనుమతులు లేకుండా లేదా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేలితే కళాశాలను సీజ్ చేయడంతో పాటు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. అదే సమయంలో అక్కడ చదువుతున్న విద్యార్థినుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేసింది.

ఈ అంశంపై జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల హక్కులు, భద్రత పరిరక్షణ కోసం AIFDS విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సంఘం హెచ్చరించింది.

ముప్పు తిప్పలు పెడుతున్న బెంగాల్ టైగర్
పులి వేట కోసం అధికారుల మాటు..
రిస్క్యూ టీమ్‌తో అప్రమత్తంగా నిరీక్షణ

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

అటవీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతంలోకి వచ్చిన బెంగాల్ టైగర్‌ను సురక్షితంగా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు, కర్ణాటక రిస్క్యూ టీమ్ ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గత మూడు రోజులుగా బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మండలాల పరిధిలోని తోటల్లో సంచరిస్తూ అధికారులకు ముప్పు తిప్పలు పెడుతున్న ఈ పెద్దపులి సోమవారం జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం శివారులోని జల్లేరు వాగు సమీపంలోని పామాయిల్ తోటలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. పులి అక్కడే ఉండటంతో రోజంతా అధికారులు అప్రమత్తంగా కాపలా కాశారు. మరోవైపు పులిని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తుండటంతో వారిని అదుపు చేయడంలో పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు.

పులికి ఎలాంటి హాని జరగకుండా చర్యలు..

వన్యప్రాణి అయిన పులికి ఎట్టి పరిస్థితుల్లోనూ హాని జరగకుండా సురక్షితంగా బంధించాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పులి జాడ తెలిసినప్పటికీ దానికి ఎలాంటి నష్టం కలగకుండా మత్తు ఇంజక్షన్‌తో అదుపులోకి తీసుకుని తిరిగి పాపికొండల అభయారణ్యంలో విడిచిపెట్టడమే అటవీ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు.

గతంలో రాజమండ్రి సమీపంలో పట్టుబడిన ఇదే పులిని ట్రాకర్ కాలర్ అమర్చి పాపికొండల అడవిలో వదిలిపెట్టిన విషయం తెలిసిందే. ఆ ట్రాకర్ ద్వారానే ప్రస్తుతం పులి కదలికలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నారు. మూడు నెలలపాటు అధికారులకు ముప్పు తిప్పలు పెట్టిన తర్వాత పట్టుబడిన ఈ పులి, ట్రాకర్ అమర్చిన అనంతరం తిరిగి అదే మార్గంలో పోలవరం ప్రాంతానికి చేరుకుని, గత వారం రోజులుగా రిస్క్యూ బృందానికి సవాల్ విసురుతోంది.పోలవరం ప్రాంతం నుంచి సుమారు 70 కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రాంతానికి చేరుకున్న పులి, శనివారం మర్లగూడెం అడవి నుంచి దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణించి జంగారెడ్డిగూడెం పరిసర తోటల్లో సంచరిస్తోంది.

డ్రోన్లు, ట్రాకర్‌తో గాలింపు..

ట్రాకర్ సంకేతాల ఆధారంగా పులి కదలికలను గమనిస్తున్న అధికారులు, అది సమీపానికి వస్తే మత్తు ఇంజక్షన్‌తో అదుపులోకి తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకోసం ప్రత్యేక గన్‌లను సిద్ధం చేశారు. అలాగే బోనును ఏర్పాటు చేసి సరైన అవకాశంకోసం వేచి చూస్తున్నారు. డ్రోన్ల సహాయంతో కాలువలు, గట్లు, తోటల పరిసరాల్లో విస్తృతంగా గాలింపు కొనసాగిస్తున్నారు.

ఫీల్డ్‌లోనే ఉన్నతాధికారులు..

జంగారెడ్డిగూడెం రూరల్ మండలం మైసన్నగూడెం శివారులోని జల్లేరు వాగు సమీపంలో రోజంతా రాజమహేంద్రవరం అటవీ కన్జర్వేటర్ జ్యోతి, ఏలూరు డీఎఫ్‌వో సందీప్ రెడ్డి, స్థానిక ఎఫ్‌ఆర్‌వో దుర్గాకుమార్ బాబు తదితర అధికారులు పర్యవేక్షించారు. వారితో పాటు కర్ణాటక రిస్క్యూ టీమ్ సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది కలిపి సుమారు 50 మంది అక్కడే మకాం వేశారు. మత్తు ఇంజక్షన్ గన్‌లు, ట్రాకర్ రిసీవర్లు, ఇతర అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచిన అధికారులు, పులిని సురక్షితంగా బంధించి తిరిగి అడవిలో విడిచిపెడతామని తెలిపారు. కాగా, ఆదివారం రాత్రి కూడా పులి ఓ పశువును చంపినట్లు సమాచారం.

ఏజెన్సీలో ఏరియా
అక్రమ సామ్రాజ్యం

మొదటి పేజీ తరువాయి...

1/59 రెగ్యులేషన్ ప్రకారం, ఏజెన్సీలో గిరిజనేతరులు భూమి కొనడం, ఇల్లు కట్టడం నిషేధం. కానీ, గిరిజనేతర బిల్డర్లే ఈ దందాను నడుపుతున్నారు. 1/70 చట్టం, ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను నిషేధిస్తుంది. ఎఫ్ టి ఎల్ మరియు బఫర్ జోన్ నిబంధనలు, నీటి వనరుల చుట్టూ 30 మీటర్ల నుండి 100 మీటర్ల వరకు నిర్మాణాలు చేయవద్దని స్పష్టంగా పేర్కొంటున్నాయి. వీటన్నింటినీ గాలికి కొట్టేసి, చెరువులు, కుంటల ఆక్రమణ కూడా జరుగుతోంది. పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 53 ప్రకారం,కఠినంగా చట్టాలు ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శి ప్రోత్సహిస్తున్నట్లు ఉంది.ఈ అక్రమ భవనాల్లో ఫైర్ సేఫ్టీ సిస్టం లేదు. పార్కింగ్, డ్రైనేజీ సౌకర్యాలు లేవు. నాణ్యత లేని మెటీరియల్‌తో కడుతుండటంతో, భూకంపం లేదా అగ్నిప్రమాదం జరిగితే వందల మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఈ అక్రమాలను అరికట్టేందుకు, స్థానిక ప్రజలు,గిరిజన సంఘాలు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, ఐటీడీఏ పీవో,జిల్లా కలెక్టర్‌లు వెంటనే జోక్యం చేసుకుని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలో,గిరిజన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అధికారులు వెంటనే స్పందించకపోతే, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ముందు పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేస్తామని, గిరిజన సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా : ఈ అక్రమ నిర్మాణాలపై, పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ,"బహుళ అంతస్తుల నిర్మాణాలకు మేము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన యజమానులకు నోటీసులు ఇచ్చాము.ఈ అంశంపై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించడం జరిగింది" అని తెలియజేశారు.

జగన్‌పై అచ్చెన్నాఫైర్!
వైసీపీ రైతులను మార్కెట్‌కు వదిలేసింది..
కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది

అమరావతి ఆగస్టు 3 (ప్రజా కలం ప్రతినిధి)

రైతుల సంక్షేమం విషయంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు రైతులపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడే నైతిక హక్కు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రభుత్వం ప్రేక్షకపాత్రకే పరిమితమైందన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు చేసి రైతులను మార్కెట్ కరుణకు వదిలేసిందని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొగాకు రైతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని చర్యలు ప్రారంభించిందని తెలిపారు. గత ఏడాది 25 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.270 కోట్ల విలువతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని చెప్పారు. ఎఫ్‌సీవీ (వర్జీనియా) పొగాకు రైతులకు లో, ఆఫ్ స్టైల్ రకాల పొగాకుపై కిలోకు రూ.10 ప్రోత్సాహకం అందిస్తున్నామని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.100 కోట్లు కేటాయించిందన్నారు. అలాగే 100 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు లక్ష్యంగా చర్యలు చేపట్టామని, ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

ఆగస్టు 15 వరకు పంటల బీమా గడువు

రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఖరీఫ్-2026 పంటల బీమా నమోదు, ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను కేంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నిర్ణయం సాధ్యమైందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో పంటల బీమా రైతులకు కీలక రక్షణగా నిలుస్తుందని పేర్కొంటూ, రుణగ్రహీతలు, రుణేతర రైతులు అనే తేడా లేకుండా ప్రతి అర్హ రైతు బీమా పథకంలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాటలతో కాదు.. చేతలతో రైతులకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

టీడీపీలో తమ్ముళ్ల తగాదాలు

నెల్లూరు : నెల్లూరు జిల్లా ఉదయగిరి టిడిపిలో ఇంటర్నల్‌గా రీ సౌండ్స్ వస్తున్నాయట. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం రీ యూనియన్ అవుతున్నట్లు తెలుస్తోంది. పాత తరం పార్టీ నేతలకు, ఎమ్మెల్యేకి మధ్య బాగా గ్యాప్ పెరిగిపోతున్నట్లు చెప్పుకుంటున్నారు. వరుస భూ వివాదాలు కాకర్ల మెడకు చుట్టుకుంటున్నాయట. అనుచరులు చేసే తప్పులకు కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడం ఎమ్మెల్యేకి తలనొప్పిగా మారుతోందంటున్నారు. ఆయన వ్యవహార శైలి నచ్చని పాత తరం టిడిపి నేతలందరూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకి టచ్‌లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. మండలాల్లో తమకేం పనులు జరగడంలేదని.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం ఎమ్మెల్యే మనుషులు చెప్పినట్టే పనిచేస్తున్నారంటూ సీనియర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. 2024 ఎన్నికలకు ముందు ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా బొల్లినేని రామారావు ఉన్నారు. అయితే ఫైనల్‌గా ఆయన్ని కాదని టీడీపీ అధిష్ఠానం ఎన్నారై కాకర్ల సురేష్‌కు మొదటి లిస్ట్‌లోనే అవకాశం కల్పించింది. అప్పటి వరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేసిన సురేష్.. అన్ని వర్గాలను కలుపుకొని జనంలోకి వెళ్ళి ఫస్ట్ అటెంప్ట్‌లోనే విజయం సాధించారు. కానీ? గెలిచాక వైఖరి మారిందన్నది స్థానికంగా వినిపిస్తున్న మాట. వరుస వివాదాలు చుట్టు ముడుతుండగా? అటు బొల్లినేని వర్గాన్ని సైతం దూరం పెట్టేశారన్నది కేడర్ చెబుతున్న మాట. తన వర్గాన్ని దూరం పెట్టినా? బొల్లినేని రామారావు పెద్దగా రియాక్ట్ అవకుండా, నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టకుండా.. నెలకోసారి తన వాళ్ళని కలుస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ చర్చ ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక వివాహానికి మాజీ ఎమ్మెల్యే వెళ్ళగా.. అదే పెళ్ళికి ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పాతతరం టీడీపీ నేతలు, పలువురు మండలాధ్యక్షులు హాజరయ్యారు. వాళ్ళంతా కలిసి అప్పుడు ఎమ్మెల్యే మీదున్న అసంతృప్తిని బొల్లినేని దగ్గర వెళ్ళగక్కినట్టు తెలిసింది. కాకర్ల తమను పట్టించుకోవడంలేదని, ఒక సిఐ తో పాటు పలువురు అధికారులను మార్చాలని కోరినా.. చేద్దాం చూద్దామనే మాటలే తప్ప పని జరగడం లేదని వాపోయారట. పోలీస్ స్టేషన్లతో పాటు మండల కార్యాలయాల్లో కూడా తమకు పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. అలాగే ప్రజలకు, ఎమ్మెల్యేకి మధ్య గ్యాప్ పెరిగిపోవడం వల్లే.. పార్టీకి మైలేజ్ రావడం లేదని అంతర్గతంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరిలో ఎమ్మెల్యే పేరు చెప్పుకొని గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోందని, పార్టీకి అది పెద్ద డ్యామేజ్ అంటూ చెప్పుకొచ్చారట. ఓ సీఐ వ్యవహార శైలి కూడా ఎమ్మెల్యే కాకర్లకు చెడ్డ పేరు తీసుకొచ్చేలా ఉందన్నది సీనియర్స్ వాయిస్. నక్కలగండి రిజర్వాయర్ లో ఉండే మత్స్య సంపదను ప్రైవేట్ వ్యక్తులు కాజేస్తుంటే ఎమ్మెల్యే కనీసం పట్టించుకోలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ పోలీస్ అధికారి పర్యవేక్షణలో ఈ చేపల దందా సాగుతోందట. ఈ వ్యవహారం ఎమ్మెల్యే కి తెలుసా లేదా అనే అనుమానాలను స్థానిక టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడసలు నియోజకవర్గంలో ప్రతిపక్షం బలంగా ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్న చర్చ కూడా నేతల మధ్య జరిగిందట. ఈ పరిస్థితుల్లో ఉదయగిరి నియోజకవర్గంలో మళ్లీ యాక్టివ్ అవ్వాలని బొల్లినేని రామారావును పాత తరం టీడీపీ నేతలు కోరినట్టు తెలిసింది. ప్రస్తుతం పార్టీ సెంట్రల్ ఆఫీసులోని గ్రీవెన్స్ సెల్‌లో జాతీయ ఉపాధ్యక్షుడి హోదాలో పని చేస్తున్నారు బొల్లినేని రామారావు. ఇక నుంచి ఉదయగిరి నియోజకవర్గ రాజకీయాలపై కూడా దృష్టి పెట్టాలని కోరారట స్థానిక నేతలు. మరోవైపు ఎమ్మెల్యే కాకర్ల సురేష్? ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో సన్నిహితంగా ఉండే వాళ్ళని కూడా దూరం పెడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ జిల్లా అధ్యక్షులకు చెప్పలేక, దూరం పెడుతున్న ఎమ్మెల్యేకి దగ్గర అవ్వలేక కొందరు టీడీపీ సీనియర్స్ సతమతమవుతున్నారట. గతంలో ఎమ్మెల్యేకి దగ్గరగా ఉన్న ఒకరిద్దరు నేతలు కూడా ఇప్పుడు బొల్లినేనికి టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సీఎం చంద్రబాబు హెచ్చరికల తర్వాత ఎమ్మెల్యేలో మార్పు వస్తుందని అందరూ భావించారని, కానీ ప్రస్తుతం అలాంటిదేమీ కనిపించడం లేదని సొంత నేతలే చెబుతున్నారు. వైసీపీ నుంచి వచ్చిన ఒకరిద్దరు నేతలకి ప్రాధాన్యం ఇస్తున్నారని.. తమను పట్టించుకోవడంలేదని పాత తరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రాబోయే రోజుల్లో మెట్ట ప్రాంత నియోజకవర్గ రాజకీయం రసకందాయంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం.

విద్యుత్ వైర్లు కట్ చేస్తున్న గంజాయి బ్యాచ్

గుంటూరు : గుంటూరు నగరంలోని ముస్లిం కాలేజ్ ప్రాంతం.. 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో స్థానికుల నుండి వరుస ఫోన్లు వచ్చాయి. అర్ధరాత్రి సమయంలో పెదకాకాని పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో వరుసగా ఫోన్లు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు సిబ్బంది హుటాహుటిన ఆ సబ్ స్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్య వచ్చింది చూసి వెంటనే పరిష్కరించారు. ఇదే తరహాలో వారం రోజుల క్రితం రామిరెడ్డి తోట పరిధిలో కూడా అర్ధరాత్రి సమయంలో పవర్ నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇలా వరుసగా జరగటంతో విద్యుత్ శాఖాధికారులు ఆలోచనలో పడ్డారు. అసలు ఏంజరిగి ఉంటుందా అని లైన్లు పరిశీలించారు. వర్షం లేదు, ఈదురు గాలులు లేవు అయినా ఎందుకు అంతరాయం వస్తుందో పరిశీలించిన అధికారులకు ఆశ్చర్యపోయే పరికరాలు కొన్ని కనిపించాయి. పొడవాటి తీగలకు రాళ్లు లేదా ఇతర వస్తువులను కట్టిన గంజాయి బ్యాచ్ లు అర్ధరాత్రి సమయంలో వాటిని విద్యుత్ లైన్ల పైకి విసురుతున్నట్లు గుర్తించారు. ఐరన్ తీగలకు రాళ్లు కట్టి విసరడంతో అవి సులభంగా విద్యుత్ వైర్లపై పడుతున్నాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. విద్యుత్ లైన్ల పై గంజాయి బ్యాచ్ లు ఆ విధంగా విసిరిన ఐరన్ తీగలను గుర్తించిన విద్యుత్ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకున్నారు. వరుసగా ఈ తరహా ఘటనలు జరగడంపై విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఎస్ ఈ చల్లా రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటువంటి ఘటనలతో ఆర్థిక నష్టంతో పాటు ప్రజల భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రమేష్ తెలిపారు.

శత్రువులుగా మిత్రపార్టీలు

ఏలూరు : కాపు కులం కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణాలు ఆయన్ని ఇరకాటంలో పడేస్తున్నాయంటున్నారు. ఇటీవల వైసీపీ కాపు నేతలంతా కలిసి మీటింగ్ పెట్టుకున్నాక జరుగుతున్న పరిణామాల మీద, పార్టీ తరపున కౌంటర్స్ వేసేందుకు ముందుండమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేని ఆదేశించిందట జనసేన అధిష్ఠానం. అందుకు తగ్గట్టే ప్రత్యర్థుల్ని అదీకూడా సొంత సామాజికవర్గానికి చెందిన వాళ్ళని గట్టిగానే టార్గెట్ చేస్తున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అలాగే? ఆయన ఏం మాట్లాడినా వెంటనే వైసీపీ కాపు నేతల వైపునుంచి రివర్స్ పంచ్‌లు కూడా స్ట్రాంగ్‌గా పడుతున్నాయి. దీంతో బొలిశెట్టి బాగా ఫీలవుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో చాలామంది జనసేన నాయకులు ఉన్నప్పటికీ? ప్రతిపక్ష నేతల్ని, ప్రత్యేకించి కాపు సామాజిక వర్గ నేతలను ఎదుర్కోవడం ఓ రకంగా ఇబ్బందికరమేనని భావిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యే అయ్యానన్న ఆనందంకంటే ఇదెక్కడి పొలిటికల్ కులగోల అన్న అసహనమే పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు సొంత నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనతో కలిసి పని చేయడానికి ముందుకు రాకపోగా ఇమేజ్‌ని డామేజ్ చేయడానికి చేస్తున్నారట. అందుకే శత్రువులుగా మారిన మిత్ర పార్టీ నేతలతో పోరాడడానికే రెండేళ్లు సరిపోయిందంటూ ఏ వేదికల మీద బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారాయన. కలిసి పని చేయండని రెండు పార్టీల అధిష్టానాలు ఆదేశిస్తున్నాతాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులు మాత్రం జనసేనతో కలిసి ముందుకెళ్లేందుకుససేమిరా అంటున్నారన్నది ఎమ్మెల్యే మాట. పైగా ఎమ్మెల్యే ఎంతో మేమూ అంతేనన్నట్టుగా టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జీ వ్యవహరిస్తున్నారన్నది బొలిశెట్టి వర్గం కంప్లయింట్.

ఇలాంటి సమయంలో వైసీపీని ఏకిపారేయాల్సి రావడం అదనపు తలనొప్పిగా మారిందన్నది ఆయన సన్నిహితుల మాట. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మాటల తూటాలు సరిగ్గా టార్గెట్ చేరితే సరే.. ఎక్కడైనా రివర్స్ అయిందంటే అసలుకే ఎసరు వచ్చి సొంత కులం వాళ్ళకే తాను టార్గెట్ అవుతానన్న భయం కూడా బొలిశెట్టిని వెంటాడుతోందట. దాంతో అధిష్ఠానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూనే.. కాపు కులానికి చెందిన ప్రత్యర్థుల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోందని, ఫైనల్‌గా అందరి టార్గెట్ నేనే అవుతానా అన్న అనుమానం సైతం ఆయన్ని వెంటాడుతోందట. మిత్ర పార్టీ నేతలతో ఇంట గెలిచేందుకు ఇప్పటికే నానా తంటాలు పడుతుంటే.. ఇప్పుడు రచ్చ గెలవాల్సిన అనివార్యత ఎదురవుతోంది. ఇదే విషయాన్ని చెబుతూ?. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తనను బాహుబలి అని ఎందుకు పిలిచారో ఇప్పుడు అర్థమవుతోందని సన్నిహితుల దగ్గర సెటైర్లు సైతం వేస్తున్నారట ఎమ్మెల్యే. రోజు రోజుకి కాక పెంచుతున్న జనసేన వర్సెస్ వైసీపీ రాజకీయం ఒకవైపు, తాడేపల్లిగూడెంలో టిడిపి వర్సెస్ జనసేన ఫైట్‌లో ఎవరు కట్టప్పలవుతారో అర్థం కాని అయోమయం మరోవైపు కలగలిసి తీవ్ర గందరగోళంలో ఉన్నారట శ్రీనివాస్. దీంతో కూటమిలోని ఇబ్బందులేంటో తన దాకా వస్తేగానీ? ఎమ్మెల్యేకి తెలియడం లేదా? ఇప్పటికైనా మా బాధలేంటో అర్థం చేసుకోండని కింది స్థాయి నాయకులు సూటిపోటి మాటలు అంటున్నారట. అలా మొత్తం మీద మా ఎమ్మెల్యే గట్టిగానే ఇరుక్కున్నారన్నది తాడేపల్లిగూడెం టాక్.

సింగపూర్ కు సముద్రమార్గంలో బంగినపల్లి

విజయవాడ : దేశీయ వ్యవసాయ రంగ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఒక కీలక మైలురాయి నమోదయ్యింది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను వాణిజ్యపరంగా తొలిసారి సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా పంపారు. దీంతో తక్కువ ఖర్చు, పర్యావరణ హితంగా తాజా పండ్లను ప్రపంచ మార్కెట్లకు చేర్చేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియను వ్యవసాయ, శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి పర్యవేక్షించింది. ఇందులో భాగంగా జూన్ 11న ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను ఎగుమతి చేయగా.. ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ చేరుకుంది. ఈ ఎగుమతి ప్రక్రియ విజయవంతం కావడం వెనుక లక్నోలోని ఐకార్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ కీలక పాత్ర పోషించింది. ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి సేకరించిన మామిడి పండ్లను.. కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి ద్వారా రైతులకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. స్థానిక మార్కెట్‌లో మామిడి కిలో రూ. 25-రూ. 26 పలుకుతోంది. కానీ, సింగ్‌పూర్‌కు ఎగుమతి చేయడం ద్వారా కిలోకు సుమారు రూ. 50 వరకు లభించింది. దీంతో రైతుల ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది. అలాగే, ఈ మామిడి పండ్లను దిగుమతి చేసుకున్న సింగూర్ సంస్థ ఈసీ-లింక్స్ లిమిటెడ్.. నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తియ్యదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ ప్రమాణాలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకోవడం హర్షణీయం. శాస్త్రీయ విధానాల్లో మామిడి కోత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సముద్ర రవాణాలో కోల్డ్-చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది. బంగినపల్లి మామిడి పండు తన బంగారు పసుపు వర్ణం, పీచులేని గుజ్జు, చక్కటి సువాసన, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఇక, జలమార్గం ద్వారా ఎగుమతి ఖర్చు వాయు మార్గంతో పోలిస్తే తక్కువకావడమే కాదు, పర్యావరణ హితమైందని, వాణిజ్యపరంగా లాభదాయకమైందని రుజువు చేసింది. అలాగే, శక్తిమంతమైన కోల్డ్-చైన్ మౌలిక సౌకర్యాలు, శాస్త్రీయ నిర్వహణ విధానాల సహకారంతో సముద్ర మార్గాల ద్వారా రవాణా భారత ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా తగినంత గుర్తింపు తీసుకురావడం అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను జల మార్గంలో ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది. ఒక సీనియర్ మహిళా అధికారిణిగా ఆమె సుదీర్ఘ కెరీర్ ముగింపు దశలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, సర్వీసులో ఉంటూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన వై. శ్రీలక్ష్మి.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఏపీకి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఏపీ కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆమెకు విపరీతమైన ప్రాధాన్యత దక్కింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె సచివాలయంలో చక్రం తిప్పారు. జగన్ హయాంలోనే ఆమెకు వరుస ప్రమోషన్లు లభించి బ్యూరోక్రసీలో టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు. ఐఏఎస్ వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ కెరీర్ ఎంత వైభవంగా సాగిందో.. దానికి రెట్టింపు స్థాయిలో పెను వివాదాలు, లీగల్ ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్దన్ రెడ్డికి అనుకూలంగా జీవోలు ఇచ్చారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, చంచల్‌గూడ జైల్లో సుదీర్ఘ కాలం రిమాండ్ ఖైదీగా జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సైతం ఆమె పేరు ప్రముఖంగా వినపడింది. ఆమెపై ఇప్పటికీ పలు కోర్టు కేసులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు నడుస్తున్నప్పటికీ.. వాటన్నింటినీ పక్కనబెట్టి, రిటైర్మెంట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఆమె సీనియారిటీని గౌరవించింది. సచివాలయంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అధికారుల బదిలీలను చూసే జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ద్వారా ఆమె ఐఏఎస్ కెరీర్‌కు ఒక సాఫీ ముగింపును ఇచ్చే ప్రయత్నం చంద్రబాబు సర్కార్ చేసింది.

అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు

విజయవాడ : ఏపీలో సంచలనంగా మారుతోంది సాయి కృష్ణ లాకప్ డెxత్ మిస్టరీ. ఇప్పటికే వైసీపీ నేతలు కుల రాజకీయం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా, రాజకీయంగా, కుల పరంగా టార్గెట్ చేశారు. అదృశ్యం తరహాలో కేసు విచారణ మొదలుపెట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇందుకు ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజును అదుపులోకి తీసుకుంది. అయితే సాయి కృష్ణ మిస్సింగ్ మిస్టరీ కాస్త లాకప్ డెxత్ గా బయటపడింది. సీఐ రిమాండ్ రిపోర్టులో అత్యా అని తేల్చేసింది సిట్. పోలీస్ కస్టడీలో తగిలిన గాయాల వల్లే సాయి కృష్ణ మరణం సంభవించిందని నిర్ధారించింది. దీంతో కుటుంబ సభ్యుల అనుమానాలు నిజమయ్యాయి. అయితే సాయి కృష్ణ మృతదేహాన్ని ఖననం చేశారా? లేకుంటే ఎక్కడైనా విడిచి పెట్టారా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని చంపేశారు అంటూ ఆది నుంచి ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఆనవాళ్లు, అనుమానాలు ఉండడంతో పాటు సంకేతాలు రావడంతోనే ఆమె ఆ తరహా ఆరోపణలు చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. సాయి కృష్ణ మే 6న మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ సిబ్బందికి పట్టుబడ్డారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడే నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు అర్థం అవుతుంది. మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పూర్తిగా మాయమైంది. అయితే ఇప్పటివరకు అదృశ్యం కేసు గానే ఉండేది. ఇప్పుడు లాకప్ డెxత్ అని తెలియడంతో దాని వెనుక జరిగిన పరిణామాలపై అసలు సిసలైన విచారణ మొదలుకానుంది. అసలు సాయి కృష్ణ పై మోపిన అభియోగాలు ఏంటి? ఏ కేసులో టాస్క్ ఫోర్స్ పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు? సీఐ నాగరాజుకు సరెండర్ చేసిన తర్వాత ఏం జరిగింది? అసలు లాకప్ డెxత్ చేయాల్సిన అవసరం సిఐ నాగరాజుకు ఎందుకు వచ్చింది? దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? లేకుంటే పెద్దల పాత్ర వుందా? ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచకుండా ఎందుకలా చేశారు? అన్నింటికీ మించి సాయి కృష్ణ మృతదేహం ఇప్పుడు ఎక్కడ ఉంది? ఖననం చేశారా? దహనం చేశారా? లేకుంటే ఎక్కడైనా పారవేశారా? అనేది ఇప్పుడు రెండో చార్జ్ షీట్లో తప్పకుండా వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే ఈ కేసు వెనుక ఏం జరిగిందనే దానిపై పోలీసు వర్గాలకు ఇప్పటికే ఒక స్పష్టత ఉంది. ఎందుకంటే మృతుడు సాయి కృష్ణకు నేరచరిత ఉంది. అయితే నేరస్తులంతా లాకప్ డెxత్ చేస్తామంటే కుదరదు. అయితే ఈ స్థాయికి పరిస్థితి వచ్చింది అంటే తెర వెనుక ఏం జరిగింది అనేది ఇప్పుడు కచ్చితంగా బయటపడుతుంది. అంతవరకు వేచి చూడాల్సిందే.

'రైతు భరోసా' నిధులు రిలీజ్

హైదరాబాద్ : తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఈసారి రైతుల ఖాతాల్లో ఒకేసారి జమ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిధులను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం అధికారికంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున, రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ. 12 వేల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. ఈ వానాకాలం సీజన్‌లో రైతుభరోసా లబ్ధి పొందడానికి ప్రభుత్వం కీలక విధివిధానాలను ఖరారు చేసింది. ఈ నెల 15వ తేదీ నాటికి 'భూభారతి' పోర్టల్‌లో భూమి వివరాలు నమోదై, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సీసీఎల్ఏ నుంచి అనుమతులు పొందిన రైతులకు మాత్రమే ఈ సాయం అందుతుంది. అలాగే, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన రైతులు కూడా ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ నుంచి అనుమతులు పొంది ఉండాలి.

భీమిలి నుంచి తేజస్విని

విశాఖపట్టణం : భీమిలీ నియోజకవర్గం విశాఖలో అతి ముఖ్యమైన సీటు. భీమిలీ స్వీట్ సీట్ అని కూడా అంటారు. టీడీపీకి కంచుకోట భీమిలీ. అత్యధిక సార్లు టీడీపీ అభ్యర్థులే గెలిచారు. ఇక ఇటీవల కాలంలో చూస్తే భీమిలీ ప్రాంతం అంతా మరో జూబ్లీ హిల్స్ గా మారిపోతోంది. అనేక ఐటీ పరిశ్రమలు రిసార్టులు హ్యాటెల్స్ వస్తున్నాయి. భీమిలీ నియోజకవర్గంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు అయింది. ఇన్ఫోసిస్ సహా కీలకమైన ఐటీ కంపెనీలు వస్తున్నాయి. దాంతో భీమిలీ మీద అందరికీ మోజు అయితే పెరిగిపోతోంది. భీమిలీ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరికి వారుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు అని కూటమిలో వినిపిస్తోంది. జనసేన అయితే వచ్చే ఎన్నికల్లో భీమిలీ నుంచి పోటీకి సిద్ధం అని ప్రచారం జరుగుతోంది. మరో వైపు చూస్తే మాజీ మంత్రి భీమిలీ నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరి భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా అంటున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తన రాజకీయ వారసుడిని భీమిలీ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి దించాలని చూస్తున్నారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో సడెన్ గా ఒక గాసిప్ అయితే గట్టిగా వినిపిస్తోంది. అదేంటి అంటే విశాఖ ఎంపీ శ్రీ భరత్ సతీమణి సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని భీమిలీ నుంచి 2029 ఎన్నికల బరిలో దిగుతుందని ఆ గాసిప్ సారాంశం. ఇది సాధ్యపడుతుందా అంటే ఎందుకు కాదని అనేవారు ఉన్నారు. భరత్ ఎంపీగా ఉన్నారు. ఆయన 2024లో బంపర్ మెజారిటీతో గెలిచారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారు అని అంటున్నారు. దాంతో తన ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే భీమిలీ నుంచి సతీమణిని పోటీ చేయించాలని శ్రీ భరత్ అనుకోవడంలో తప్పు లేదని అనే వారూ ఉన్నారు. భీమిలీ నుంచి ఎవరు టీడీపీ నుంచి పోటీ చేసినా గ్యారంటీగా విక్టరీ ఉంటుందని అంతా చెబుతారు. అదే నిజం కూడా. ఇక ఏకంగా బాలయ్య కుమార్తె పోటీ చేయాలనుకుంటే భీమిలీ సీటు టీడీపీ వశం అని కళ్ళు మూసుకునే చెప్పాల్సి ఉంటుందని అంటున్నారు. ఇంతకీ తేజస్వినికి రాజకీయాల మీద ఇంట్రెస్ట్ ఉందా లేదా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏంటి అంటే 1994 ఎన్నికల సందర్భంగా అన్న నందమూరి తారక రామారావు భీమిలీ నుంచి పోటీ చేయాలని అనుకున్నారని ప్రచారంలో ఉంది.

ప్రజా కలం

మంగళవారం, ఆగస్టు 04, 2026

సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది. విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం. 2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది. మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి. కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి. తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయిజంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి. రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుంటుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు" కార్యక్రమం - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

గోనెగండ్ల : ప్రజల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి శుక్రవారం"ఒక నెల–ఒక నియోజకవర్గం–నాలుగు పర్యటనలు" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. "ఒక నెల–ఒక నియోజకవర్గం–నాలుగు పర్యటనలు" లో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వరరెడ్డి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ…ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గోనెగండ్ల మండలంలో ఒక నెలపాటు ప్రతి శుక్రవారం 4 మార్లు నియోజకవర్గంలో పర్యటించి ప్రజల వినతులను స్వీకరించి వాటి పరిష్కారంపై ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు సమర్పించే వినతుల్లో అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం ఉన్న వాటిని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. మిగిలిన వినతులపై నిర్ణీత గడువులో చర్యలు చేపట్టి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రత్యేకత ఏమిటంటే, ప్రతి శుక్రవారం స్వీకరించిన వినతులపై తదుపరి శుక్రవారం సమగ్ర సమీక్ష నిర్వహించి, సమస్య పరిష్కారమైనదా, పెండింగ్‌లో ఉందా, పెండింగ్‌కు గల కారణాలు ఏమిటి, ఎప్పటిలోగా పరిష్కారం అందించగలమనే అంశాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు . ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు వచ్చే వినతుల్లో అత్యధికంగా 22–ఏ నిషేధిత జాబితా నుండి భూముల తొలగింపు, రీ–సర్వే అనంతరం తలెత్తిన భూ వివాదాలు, ఇనాం భూముల నమోదు, పట్టా భూముల సమస్యలు, భూ విస్తీర్ణ వ్యత్యాసాలు వంటి అంశాలపై ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా రహదారుల నిర్మాణం, బస్సు సౌకర్యం, బస్ హాల్ట్‌లు, రైల్వే హాల్ట్‌లు, వ్యవసాయ భూములకు దారి, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులు కూడా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు అవసరమైన భూ రికార్డులు, ఇతర పత్రాలతో సిద్ధంగా ఉండడం వల్ల ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి సాధ్యమైనంత మేరకు అక్కడికక్కడే పరిష్కారం అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజలు క్రమశిక్షణతో వినతులు సమర్పించి అధికారులకు సహకరించాలని కోరిన జిల్లా కలెక్టర్, ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి ప్రజలకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

లక్ష కోట్లతో పీపీపీలు... నెంబర్ వన్

విజయవాడ : భారతదేశంలో మౌలిక వసతుల విప్లవాత్మక అభివృద్ధి కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం రాష్ట్రాల వారీగా పిలిచిన ప్రతిపాదిత పీపీపీ ప్రాజెక్టుల విలువ, సంఖ్య పరంగా ఏపీ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా రూ. 1,15,578.81 కోట్ల అంచనా వ్యయంతో 270 మౌలిక వసతుల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం తన నివేదికలో స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం రూ. 17 లక్షల కోట్లకు పైగా విలువైన 852 ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తెచ్చి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది. ఈ జాబితాలో తమిళనాడు రూ. 87,639.65 కోట్ల విలువైన 70 ప్రాజెక్టులతో రెండో స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రూ. 65,496.50 కోట్లతో 21 ప్రాజెక్టులతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అన్ని ర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికాభివృద్ధి, రోడ్లు, పోర్టులు, ఇంధన రంగం మరియు పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేసి కేంద్ర సమ్మతిని పొందింది. రహదారులు, ఓడరేవులు, లాజిస్టిక్ పార్కులు, ఇంధన రంగానికి చెందిన కీలక ప్రాజెక్టులను ఈ 270 ప్రతిపాదనల్లో పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు ఆంధ్రప్రదేశ్‌పై అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నిధుల కొరత లేకుండా పీపీపీ నమూనాలో ఈ మౌలిక ప్రాజెక్టులు పట్టాలెక్కితే, రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపు లభించనుంది.

భారత్ కు జిన్ పింగ్



న్యూఢిల్లీ : 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్–చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించలేదు. ఇటీవలే భారత్–చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12–13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌కు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది. గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్‌లోనూ, 2025లో తియాన్‌జిన్‌లోనూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ రాక భారత్–చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది. భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్‌పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత, పెట్టుబడులు వంటి అంశాలపై చర్చ జరగవచ్చు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య నమ్మకం పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తగ్గడం, బహుపక్ష వేదికల్లో సహకారం పెరగడం వంటి ఫలితాలు రావచ్చు. అయితే సరిహద్దు విషయంలో ఇంకా పూర్తి పరిష్కారం లేకపోవడం, పరస్పర అపనమ్మకం, ప్రాంతీయ రాజకీయాలు వంటివి సవాళ్లుగా ఉంటాయి. అయితే జిన్‌పింగ్ పర్యటనపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగల్వాన్ ఘటన తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం రెండు పెద్ద ఆసియా శక్తుల మధ్య సంబంధాలను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక దీనికి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అయితే నిజమైన పురోగతి సరిహద్దు, వాణిజ్య సమస్యలపై కాంక్రీట్ చర్యలపైనే ఆధారపడి ఉంటుంది.

శారీరక దృఢత్వం పోలీసింగ్‌కు పునాది

ప్రజాసేవలో ఉత్తమ ఫలితాలకు క్రమశిక్షణ తప్పనిసరి

అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

వారాంతపు కవాతుకు హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్ : జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జానకి, సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు జిల్లా ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతులో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యంత అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అశోక్ కుమార్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కేర్ టు యాక్షన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వేడుక

విజయవాడ : కేర్ టు యాక్షన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాల పిల్లల విద్యాభివృద్ధి, సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తోంది. నిరుపేద బాలలకు నాణ్యమైన విద్య, ఆరోగ్య రక్షణ అందించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు ఈ సంస్థ పునాది వేస్తోందనిసీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్, కేర్ టు యాక్షన్ ఇండియా ప్రతినిధి అర్జున్ అన్నారు.'కేర్ టు యాక్షన్ ఇండియా' సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాల వేడుక ఘనంగా జరిగాయి. సంస్థ సాధించిన పురోగతిని, చేపట్టిన సేవా కార్యక్రమాలను జరుపుకునేందుకు వాటాదారులందరూ ఒకే వేదికపైకి వచ్చారు. పిల్లల విద్య, వికాసమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

అమరావతితో పాటు విజయవాడ, గుంటూరుల

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బాబురావు

అమరావతి:రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ దాని పరిసర పరిధిలోని ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. బాబూరావు విమర్శించారు. అమరావతిలోని 29 గ్రామాలతో పాటు విజయవాడ, గుంటూరులకు సమాన ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. అమరావతిలో ఇప్పటికే 15, 000 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయని, రాబోయే రోజుల్లో లక్ష కోట్ల రూపాయలకు పైగా వెచ్చించనున్నట్లు చెబుతున్న ప్రభుత్వం... మరి విజయవాడ, దాని పరిసర ప్రాంతాలకు ఎంత కేటాయిస్తోందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కార్మికులు హామీల అమలు కాక మోసపోయామని భావిస్తుంటే, మరోవైపు విజయవాడలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి కల్పన వంటి అన్ని రంగాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించినపోలీసులు

ఒంగోలు : రెండు జిల్లాలలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం, సీఈఐఆర్ పోర్టల్ మరియు పోలీసు శాఖ ప్రత్యేక సాంకేతిక విభాగం సహకారంతో గుర్తించిన ప్రకాశం జిల్లా పోలీసు మరియు మార్కాపురం జిల్లా పోలీసు, వాటిని సంబంధిత యజమానులకు తిరిగి అప్పగించారు.

మొబైల్ ఫోన్ అనేది నేటి రోజుల్లో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, విద్య, ఉద్యోగం మరియు అత్యవసర కమ్యూనికేషన్కు ఎంతో కీలకమైన సాధనం. అలాంటి మొబైల్ ఫోన్ పోయినప్పుడు ప్రజలు ఆందోళన చెందకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, అలాగే సీఈఐఆర్ పోర్టల్లో వివరాలు నమోదు చేయాలని పోలీసులు సూచించారు. ఫిర్యాదులను సాంకేతికంగా విశ్లేషించి, వివిధ ప్రాంతాల్లో గుర్తించిన మొబైల్ ఫోన్లను తిరిగి స్వాధీనం చేసుకుని వాటి యజమానులను గుర్తించి అప్పగించడం ద్వారా పోలీసు శాఖ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తోంది. ఈ సందర్భంగా తమ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసు శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తుల రక్షణ, సత్వర స్పందన, సాంకేతికత ఆధారిత పోలీసింగ్ మరియు ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ప్రకాశం జిల్లా పోలీసు మరియు మార్కాపురం జిల్లా పోలీసు ఎల్లప్పుడూ ముందుంటాయని అధికారులు తెలిపారు.

నారా లోకేష్ రాజీనామాకు డిమాండ్

విజయవాడ : డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్సీపీ నేతలు విజయవాడ కలెక్టరేట్లో వినతిపత్రం సమర్పించారు. ఈ నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యార్థి నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

పేద ప్రజల భూములను

ప్రభుత్వం లాక్కుంటుంది

బీజేపీ నేతల ఆరోపణ

ఎల్బీనగర్ : రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండల పరిధిలోని అమన్ గల్ హయత్ నగర్ ముదిరాజ్ కాలనీ 255/1 సర్వే నెంబర్ లో మొత్తం 74 ఎకరాల స్థలం ఉంది. ప్రజా అవసరాలకు వినియోగించగా ఇందులో 18 ఎకరాల భూమి ఉంది 18 కొంతమంది కొత్త భాగం రైతులు సాగు చేస్తుండగా కొంత భాగం రైతులు విక్రయించారు. ప్రభుత్వం ఇపుడు స్థలం ఖాళీగా కనిపించడంతో ప్రభుత్వం లాక్కోవడానికి ప్రయత్నిస్తుందని బిజెపి నాయకులు ఎల్బీనగర్ ఇన్చార్జ్ సామారంగారెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975లో ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం చేసే వాళ్లందరికీ అప్పటి ప్రభుత్వం పట్టా పుస్తకాలు ఇచ్చారని అన్నారు. కొంతమంది ఆర్థిక ఇబ్బందులతో ప్లాట్లుగా చేసి పేదవారికి 60గజల చొప్పున ప్లాట్లు విక్రయించడం జరిగిందని కొంత భాగం రైతులు దగ్గర ఉందని అన్నారు .కానీ ఇప్పుడు ప్రభుత్వం ఈ భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పేద ప్రజలకు కాకుండ ప్రభుత్వం తీసుకోవడం విడ్డూరమని అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయవలసిన ప్రభుత్వం ఇప్పుడు ప్రజల దగ్గర నుండి లాక్కోవడానికి చూస్తుందని అన్నారు. పేద ప్రజల స్థలాన్ని పేద ప్రజలకు ఇచ్చేంతవరకు బిజెపి పార్టీ పేద ప్రజల తరఫున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్ రెడ్డి, రైతులు, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

నగరంలో తొలి స్టార్ బక్స్ కాఫీ హౌస్

హైదరాబాద్ : హైదరాబాద్లో టాటా స్టార్ బక్స్ దక్షిణ భారతదేశంలో తొలి స్టార్బక్స్ రిజర్వ్ కాఫీహౌస్ను ప్రారంభించింది. జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో అందంగా పునరుద్ధరించిన బంగ్లాలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కాఫీహౌస్ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. భారతదేశంలో ఆరో స్టార్ బక్స్ రిజర్వ్ స్టోర్గా నిలిచిన ఈ కాఫీహౌస్లో ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రత్యేక కాఫీలు, సిగ్నేచర్ పానీయాలు, ప్రత్యేక ఫుడ్ మెనూ, పెంపుడు జంతువులతో వచ్చే వినియోగదారులకు కూడా అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయి. ఈ సందర్భంగా టాటా స్టార్ బక్స్ సీఈఓ సుశాంత్ డాష్ మాట్లాడుతూ, హైదరాబాద్ తమకు కీలకమైన మార్కెట్ అని, జూబ్లీహిల్స్లో తొలి స్టార్ బక్స్ రిజర్వ్ స్టోర్ను ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు.

వర్షం కొరకు ఎదురుచూస్తున్న రైతన్నలు

– మండల కేంద్రంలో వర్షం కోసం భజనలు నిర్వహణ

తుగ్గలి: సరైన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన మంచి వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు నిండు బిందెలతో నీళ్ళుపోసి పూజలు చేస్తున్నారు. శివాలయాలలోని శివలింగం మునిగిపోయేవరకు నీళ్ళుపోసి శివలింగాన్ని జల దిగ్బంధం చేసి,ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామాలలో భక్తి గీతాలతో భజనలు చేస్తున్నారు. ఐనా వానలు కురవడం లేదు. కొందరు గండా దీపం వెలిగించుకుని భజనలు చేసుకుంటూ గ్రామంలొ తిరుగుతున్నారు. మండల కేంద్రమైన తుగ్గలి గ్రామంలో రైతులు,భక్తులు వర్షం కోసం భజనలు చేస్తున్నారు. గండా దీపం వెలిగించుకొని,భజనలు చేస్తూ ఇంటింటికి తిరుగుతున్నారు. గృహస్థులు గండా దీపంకి నీళ్ళుపోసి, పసుపు కుంకుమ పెట్టి వర్షాలు కురవాలని మొక్కుతున్నారు.

వరంగల్ లో ఇసుక దుమారం

వరంగల్ : వరంగల్ జిల్లా పాలిటిక్స్‌లో ఇప్పుడు ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక దందాతో ఇద్దరు మంత్రులు వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తూ అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది బీఆర్ఎస్. ములుగు జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా ఇసుక దోపిడీ జరుగుతోందని విపక్షం చేస్తున్న ఆరోపణలు పొలిటికల్ మంటలు పుట్టిస్తున్నాయి. దోపిడీకి సంబంధించి మా దగ్గర డ్రోన్ విజువల్స్, ఇతర ఆధారాలు ఉన్నాయంటూరోజుకో ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేస్తున్నారు గులాబీ నేతలు. అలాగే దీనికి సంబంధించి సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సందర్భంలో దీనికి కౌంటర్ ఇవ్వడంలో జిల్లా కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ఇద్దరు మంత్రులు అంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై కేవలం ములుగు జిల్లా పార్టీ నేతలు మినహా కాస్తంత హోదా ఉన్న, పెద్ద నాయకులు ఎవరూ ఎందుకు రియాక్ట్ అవడం లేదన్న చర్చలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు ఇద్దరు కలిసి ములుగు జిల్లా పరిధిలోని గోదావరి ఇసుకను మింగేస్తున్నారంటూ డైరెక్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీతమ్మ సాగర్‌లో అక్రమంగా ఇసుక తవ్వి దాదాపు 4 వేల కోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు మంత్రులు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్నది కేటీఆర్ ఆరోపణ. ఇసుక మాఫియా సూత్రధారులను బయటకు లాగాలన్నది ఆయన డిమాండ్.దీనికి సంబంధించి ములుగు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు గులాబీ నేతలు. ఇలా ఇసుక దోపిడీ పేరుతో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా బీఆర్ఎస్ నేతలు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నా. అధికార పక్షం నుంచి గట్టిగా తిప్పికొట్టే ప్రయత్నం మాత్రం జరగడంలేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం ములుగు నాయకులు, అందునా ఒక మంత్రి అనుచరగణం తప్ప ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ముఖ్య నేతా ఎందుకు స్పందించలేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఆ విషయంలో కాంగ్రెస్ వాళ్ళు ఎందుకు వెనకడుగు వేస్తున్నారంటూ ఎవరికి వారు రకరకాల విశ్లేషణల్లో మునిగిపోయారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు అశోక్, జిల్లా పార్టీలోని కొందరు నాయకులు మాత్రమే బీఆర్ఎస్ ఆరోపణలకు రియాక్ట్ అయి నిరూపించమంటూ సవాల్ విసిరారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యేల సంగతి తర్వాత కనీసం ఉమ్మడి వరంగల్ పరిధిలో ఇప్పుడున్న మిగిలిన ఐదు జిల్లాల డీసీసీ అధ్యక్షులు కూడా మినిస్టర్స్ మీద వస్తున్న ఇసుక ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదన్నది ఆలోచించాల్సిన విషయమేనని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతుల విషయంలో ఎక్కడా తప్పు జరగలేదని, మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా వ్యవహరించలేదని కాంగ్రెస్ నేతలు గట్టిగా ఎందుకు చెప్పలేకపోతున్నారన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి.ఇందుకు సమాధానంగా వినిపిస్తున్న కొన్ని మాటలు కాంగ్రెస్ పార్టీలోని ప్రస్తుత పరిస్థితి ప్రతిబింబిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతోనే ఎక్కువ మంది కామ్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. చేతిలో పూర్తి సమాచారం లేకుండా. ఏదో, మంత్రుల్ని వెనకేసుకుని రావాలి కాబట్టి నోటికొచ్చింది మాట్లాడేస్తే రేపు మనం ఇరుక్కుపోతామన్న భయం వాళ్ళలో ఉందట. అందుకే ఇసుక ఆరోపణల విషయంలో మంత్రులు ఇద్దరికీ బాసటగా నిలవలేకపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మంత్రుల నుంచి కూడా మనం కరెక్ట్‌గానే ఉన్నాం, మీరు ఖండించండన్న గ్రీన్ సిగ్నల్ కూడా రాలేదని అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం సైతం ఈ విషయంపై నేతలకు క్లారిటీ ఇవ్వకపోవడం వల్ల ఇసుక దందా అంశాన్ని పట్టించుకోకుండా ఎవరికి వారు తమ పని తాము చేసుకుంటూ వెళ్తున్నారట. కానీ? విపక్షం ఆరోపణలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళక ముందే మేలుకుని ప్యాచ్‌వర్క్ చేయకుంటే నష్టపోవాల్సిన పరిస్థితులు వస్తాయన్న టెన్షన్ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది.

సైబర్ టవర్స్ ఇక చరిత్రే

హైదరాబాద్ : హైదరాబాద్ నగర ఐటీ రంగానికి పునాది వేసిన మొట్టమొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం చరిత్రగా మారిపోనుంది. అమెరికాకు చెందిన ఈ బహుళజాతి సంస్థ 1987లో బేగంపేట కేంద్రంగా నగరంలోనే మొదటి ఐటీ కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే.. ఇటీవల ఈ భవనంలోని భూగర్భ నీటి సంపు దెబ్బతినడంతో భవన భద్రత దృష్ట్యా యాజమాన్యం దీన్ని పూర్తిగా కూల్చివేస్తోంది. ఒకప్పటి ఐటీ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ ఐకానిక్ భవనం స్థానంలో సరికొత్త కమర్షియల్ బిల్డింగ్ నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.నేటి తరం యువతకు ఐటీ కారిడార్, హైటెక్‌సిటీ అనగానే అందరికీ గుర్తొచ్చే ఏరియాలు మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయదుర్గం. ఎటు చూసినా ఆకాశాన్ని తాకే గగనతలాలు, అత్యాధునిక గ్లాస్ బిల్డింగులే నేటి ఐటీ నగర రూపురేఖలు. కానీ.. హైదరాబాద్ నగరానికి చెందిన మొదటి తరం ఐటీ ఉద్యోగులను, అనుభవజ్ఞులను అడిగితే వారికి మొదటగా గుర్తొచ్చే ప్రాంతం బేగంపేట. ఎందుకంటే భాగ్యనగరంలో ఐటీ సామ్రాజ్యానికి తొలి పునాది పడింది ఇక్కడే. నగరంలోనే నిర్మితమైన మొట్టమొదటి ఐటీ టవర్‌గా ఖ్యాతిగాంచిన ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం పూర్తిగా కాలగర్భంలో కలిసిపోతోంది. ఆ ఐటీ భవన సముదాయాన్ని కూల్చివేసేందుకు యాజమాన్యం రెడీ అయింది.అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ 1987లో బేగంపేటలో ఐటీ టవర్ నిర్మించింది. నగరంలో స్థాపించబడిన మొట్టమొదటి అంతర్జాతీయ బహుళజాతి సంస్థఇదే కావడం విశేషం.ఐటీ రంగంలో హైదరాబాద్ పేరు గ్లోబల్ మ్యాప్‌పైకి ఎక్కడానికి ఈ సంస్థే తొలి కారణం. దశాబ్దాల పాటు ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తయారుచేసిన ఈ ఐకానిక్ భవనం ఇప్పుడు శాశ్వతంగా కనుమరుగవుతోంది. భవన భూగర్భంలో ఉన్న నీటి సంపు దెబ్బతినడం, పునాదులు బలహీనపడటంతో భవన భద్రతను దృష్టిలో ఉంచుకుని దానిని కూల్చివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు కూల్చివేత పనులు జరుగుతున్నట్లు స్థానిక పోలీసులు ధృవీకరించారు. పాత భవనాన్ని పూర్తిగా తొలగించిన అనంతరం.. అదే స్థలంలో సరికొత్త అధునాతన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.మాదాపూర్‌లో సైబర్ టవర్స్‌ను

నిర్మించి.. విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ దేశీయ ఐటీ సంస్థలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించేంత వరకు నగర ఐటీ రంగానికి బేగంపేట, అమీర్‌పేట ప్రాంతాలే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. అప్పట్లో అంతర్జాతీయ ప్రయాణాలకు అత్యంత అనువుగా.. నగర నడిబొడ్డున బేగంపేట విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాంతం ఐటీ హబ్‌గా ఎదగడానికి ప్రధాన కారణమైంది. ఆ రోజుల్లో బ్రిగేడ్, టాటా సెర్వికోల్, విప్రో ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్రాఫ్ వంటి దిగ్గజ సంస్థలన్నీ బేగంపేట కేంద్రంగానే తమ కార్యకలాపాలను సాగించాయి.వీటితో పాటు మేఫిర్, సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లలో సత్యం కంప్యూటర్స్ సంస్థ తన కార్యకలాపాలను నడపగా.. పంజాగుట్టలో ఓఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో హెచ్ఎస్‌బీసీ, సియారా అట్లాంటిక్ సంస్థలు ఉండేవి. సోమాజిగూడ కేంద్రంగా ఏడీపీ, 24/7 కస్టమర్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు నగరంలో ఐటీ విప్లవానికి ఊతమిచ్చాయి. నాడు కొన్ని వందల మందితో ప్రారంభమైన ఐటీ ఉద్యోగుల ప్రస్థానం.. నేడు లక్షల మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరింది. ఎందరో మొదటి తరం సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉపాధినిచ్చి, జీవితాలను నిలబెట్టిన హైదరాబాద్ మొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ భవనం నేడు జ్ఞాపకంగా మిగిలిపోతుండటంతో పాత తరం టెక్కీలు తీవ్ర భావోద్వేగానికి లోనవుతున్నారు.

10 రెస్టారెంట్లలో 9 దారుణం

హైదరాబాద్ : జొమాటో లేదా స్విగ్గి.. ఉబర్.. ఇలా ఎన్నో ఉన్నాయి. జస్ట్ ఫోన్ ఆన్ చేయడం.. యాప్ ఓపెన్ చేయడం.. ఆఫర్లు చూడడం.. నచ్చిన ఆహారం సెలెక్ట్ చేయడం.. ఆర్డర్ పెట్టడం.. పేమెంట్ ఆన్లైన్లోనే చేసేయడం.. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం డిన్నర్.. మధ్యలో స్నాక్స్.. చివరికి కేకులు.. బర్గర్లు.. పిజ్జాలు.. సూప్ లు కూడా అందులోనే.. ఆర్డర్ పెట్టిన కొత్త సమయానికి కళ్ళ ముందుకు వస్తుంది. కాళ్ల దగ్గరికి వస్తుంది. అలాంటప్పుడు ఇలాంటి తిండిని ఎవరు కాదనుకుంటారు.. కొంతకాలంగా హైదరాబాదులో సగటు నగర జీవి ఇటువంటి రెడీమేడ్ ఫుడ్ కే అలవాటు పడ్డాడు. చివరికి వివాహం జరిగిన వారు సైతం ఆన్లైన్లోనే ఆర్డర్ పెట్టుకుంటున్నారు. వండే శ్రమ లేకుండా.. చెమటలు చిందించకుండా దర్జాగా తింటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. తెస్తున్న ఫుడ్ ఎలా ఉంటుంది.. ఎలాంటి పరిస్థితుల్లో తయారుచేస్తున్నారు.. వాటి వల్ల ఎలాంటి రోగాలు వస్తాయి ఎవరూ గుర్తించడం లేదు. చివరికి ఆఫీసర్లు చేసిన దాడుల్లో.. దిగ్భ్రాంతి కరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ నగరంలో ఈ నెలలో 10 రెస్టారెంట్లను అధికారులు తనిఖీలు చేస్తే.. అందులో తొమ్మిది అత్యంత దారుణంగా ఉన్నాయని తేలింది. చెత్తబుట్టలో వేయాల్సిన ఆహారాన్ని వారు విక్రయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దారుణమైన ఆహారాన్ని రకరకాల రంగులు.. మసాలాలు దట్టించి ప్లేట్లో పెడుతున్నారు.

ఈ రెస్టారెంట్ మదినగూడ లో ఉంది. ఇక్కడ కూరగాయలకు బూజు పట్టి ఉంది. వాడిన నూనె మళ్ళీ మళ్ళీ ఉపయోగించడానికి అధికారులు గుర్తించారు. పైగా ప్యాకెట్ల మీద లేబుల్స్ కూడా లేవు.

లులు హైపర్ మార్కెట్

చెత్తబుట్టలో వేయాల్సిన 150 కిలోల ఆహారాన్ని ఇక్కడ అధికారులు గుర్తించారు. వెంటనే దానిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైనేజీలు మొత్తం బ్లాక్ అయ్యాయి. అందులో పురుగులు ఉన్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించిన అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఉడిపి ఉపహార్ మూసాపేట్

డ్రైనేజీలో దారుణంగా సమస్యలు ఉన్నాయి. పురుగులు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. చెత్తబుట్టల మీద మూతలు లేవు. వంట చేసేవారు సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. లైసెన్స్ కూడా ముగిసిపోయింది.

చౌమన్, మాదాపూర్

ఇక్కడ మాంసాన్ని అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేశారు. శాకాహారం.. మాంసాహారం కలిపి నిల్వ చేశారు. కనీసం వాటి మీద మూతలు కూడా పెట్టలేదు.

జిస్మత్ జైల్ మండి, మదినగూడ

ఇక్కడ వంటలు వండే తీరు ఎలా ఉందంటే.. కనీసం వాటిని పందులు కూడా తినవు. ఐటమ్స్‌కు లేబుల్స్ లేవు. సరైన నిలవలేదు. దీనికి ఎటువంటి గుర్తింపు లేదు. వాతావరణం అత్యంత దారుణంగా ఉంది.

రాయల్ స్పైసి, గచ్చిబౌలి

కీటకాలు తాండవం చేస్తున్నాయి. దుర్వాసన ముక్కులను పగలగొడుతోంది. నీరు దారుణంగా నిలిచిపోయింది. కిచెన్ అత్యంత అపరిశుభ్రంగా ఉంది. వంట కాదు కదా, ఇక్కడ ఐదు నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి. కుళ్ళిపోయిన కూరగాయలు వాడుతున్నారు. లేబుల్ లేని ఐటమ్స్ ఉపయోగిస్తున్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి

అందరూ భాగస్వాములు కావాలి

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జడ్చర్లలో భారీ వాకథాన్ : ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్ : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియం, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్ నుంచి జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన వాకథాన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది విద్యార్థులు, వాకర్స్, యువత, మహిళలు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దుష్ప్రవర్తన అని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు మళ్లే యువత తమ జీవితాలను, కుటుంబాల ఆశలను, సమాజ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణం వ్యాపార, విద్యా మరియు రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉండటంతో, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారని, ఈ పరిస్థితుల్లో మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాకు అవకాశాలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రత్యేకంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉండేలా అందరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజికంగా తీవ్రమైన నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తి క్రమంగా కుటుంబానికి దూరమవడమే కాకుండా నేరప్రవర్తన వైపు వెళ్లే ప్రమాదం కూడా ఉంటుందని అన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాను పూర్తిగా డ్రగ్–ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడం పోలీసు శాఖ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరి సహకారం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.తదుపరి మినీ స్టేడియం నుండి నేతాజీ చౌరస్తా వరకు భారీ వాకథాన్ ర్యాలీ నిర్వహించబడింది. ర్యాలీ మొత్తం డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సందడి చేసింది. నేతాజీ చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ గారు అందరితో కలిసి మాదకద్రవ్యాల వినియోగాన్ని దూరం పెట్టాలని, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మినీ స్టేడియంకు తిరిగి చేరుకున్న తర్వాత విద్యార్థులు, ప్రజలు మానవహారంగా నిలబడి మాదకద్రవ్యాల నిర్మూలనకు మద్దతుగా పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వాకింగ్ అసోసియేషన్ సభ్యులు, యోగా సభ్యులు, విద్యార్థులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

యువత, విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

తమ భవిష్యత్ ప్రణాళిక వైపు పయనించాలి - ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం - హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ - ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు - డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

రాజన్న సిరిసిల్ల : డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచిగాంధీ మీదుగా పద్మనాయక కల్యాణ మండపం వరకు నిర్వహించారు.అనంతరం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, నష్టాలపై స్కూల్ విద్యార్థులు, సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వివిధ స్టాళ్లను అతిథులు పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు

పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట

సే నో టూ డ్రగ్స్.. సే ఎస్ టూ లైఫ్ నినాదాలు చేశారుఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన చేశారని గుర్తు చేశారు ఇందులో భాగంగా డ్రగ్స్ ను నిర్మూలించేందుకు రాష్ట్రంలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేస్తుందని తెలిపారు. యువత, విద్యార్థులకు డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు.యువత సన్మార్గంలో వెళ్లేలా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. యువత విద్యార్థులు మత్తు పదార్థాల బాట ను వీడండి.. మైదానం బాట పట్టండి అని సీఎం పిలుపు నిచ్చారని గుర్తు చేశారు. యువత సన్మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ పై దాడులు, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు.పోలీస్ శాఖ శాంతి భద్రతల తో పాటు పోలీసులు రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారని, హెల్మెట్ ధరించాలని కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు.యువత, విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా ఒలింపిక్స్ లో పతకాలు సాధించేలా రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకువచ్చారని తెలిపారు. అలాగే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సీఎం కప్ పేరిట జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించి నైపుణ్యం ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వచ్చేలా కృషి చేశారని అభినందించారు. యువత, విద్యార్థులు ఏదో ఒక హాబీ తో ఉండాలని సూచించారు.

ఏపీ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో తెలంగాణ బిడ్డలు..

– నారా లోకేష్ ట్వీట్ వైరల్! టాలెంట్‌కు బోర్డర్లు లేవంటూ ప్రశంసలు

విజయవాడ : రాష్ట్రాలు వేరైనా, రాజకీయాలు ఎల్లలు గీసినా.. నిజమైన ప్రతిభకు ప్రాంతీయ సరిహద్దులు అడ్డుకావనే సరికొత్త చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత కొన్ని వారాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ సెంటిమెంట్, నిజమైన తెలంగాణ బిడ్డ ఎవరు? అనే రాజకీయ లెక్కల్లు, వాదోపవాదాలు జరుగుతున్న తరుణంలో.. దీనికి పూర్తిగా భిన్నమైన, ఆరోగ్యకరమైన ఒక ని ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టును ముందుండి నడిపిస్తున్న కీలక వ్యక్తుల నేపథ్యమే ఇందుకు ప్రధాన కారణం.ఈ సరికొత్త చర్చకు ఒక సీనియర్ జర్నలిస్ట్ పెట్టిన ట్వీట్ వేదికైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారిణి ధాత్రి రెడ్డి పక్కా తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆమెతో పాటు ఈ ప్రాజెక్టులో కీలక భూమిక పోషిస్తున్న దీప్తి, ఒకప్పుడు అమెరికాలో ఉంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. కోసం తీవ్రంగా శ్రమించిన యాక్టివిస్ట్. ఒకప్పుడు మనం.. ఆంధ్రానా అని అదోలా నవ్వుకున్న ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు, నేడు నవ్యాంధ్ర ప్రగతి చక్రంలో అత్యంత కీలకమైన ఆవిష్కరణల విభాగాన్ని నడిపిస్తున్నారు. రాజకీయం గీసిన అదృశ్య బోర్డర్లను దాటి ప్రతిభ తన దారిని తాను ఎలా వెతుక్కుంటుందో చెప్పడానికి ఇది నిదర్శనంగా నిలిచింది. సదరు జర్నలిస్ట్ తన ట్వీట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని వారాలుగా తెలంగాణ సెంటిమెంట్ మట్టూ తిరుగుతున్న ఉపన్యాసాల మధ్య, ఏపీ ప్రభుత్వ ప్రాజెక్టులో ఈ ఇద్దరు తెలంగాణ బిడ్డలు లీడ్ రోల్ పోషిస్తున్నారనే వార్త నాలో ఆనందం నింపింది. ఏపీ ప్రభుత్వం తమ రాష్ట్ర అవసరాలకు ఎలాంటి టాలెంట్ కావాలో చూసింది తప్ప, ఆ టాలెంట్ ఏ ప్రాంతం నుండి వచ్చిందో చూడలేదు. మీ మాతృభూమిపై మీకు గర్వం ఉండొచ్చు, కానీ ఏ రాజకీయ నేత కూడా మీ ప్రతిభను రాష్ట్ర సరిహద్దుల వద్ద ఆపలేరని గుర్తుంచుకోండి" అని సదరు జర్నలిస్ట్ రాసుకొచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం సెంటిమెంట్‌ను వాడుకునే నేతల అసలు రంగును గుర్తించాలని పిలుపునిచ్చారుఈ వైరల్ ట్వీట్‌పై ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ , మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ అద్భుతమైన రిప్లై ఇచ్చారు.

"దీనితో నేను వంద శాతం ఏకీభవిస్తున్నాను. మేము నిర్మిస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ సరిగ్గా ఇలాగే ఉంటుంది. భౌగోళిక సరిహద్దుల కంటే ప్రతిభకు మాత్రమే విలువనిచ్చే రాష్ట్రాన్ని మేము తయారుచేస్తున్నాం. మా వద్దకు వచ్చే వారిని మీరు ఎక్కడి నుండి వచ్చారు అని మేము అడగం.. మీరు ఈ రాష్ట్రం కోసం ఏం నిర్మించగలరు? అని మాత్రమే అడుగుతాం. మీ మూలాలను గౌరవించండి, కానీ రాష్ట్ర బోర్డర్లు మీ అవకాశాలను పరిమితం చేయనివ్వకండి. ఆంధ్రప్రదేశ్ అనేది ఎవరు ఎక్కడి నుండి వచ్చారనే దానిపై కాకుండా, అందరం కలిసి ఏం నిర్మిస్తున్నామనే దానిపైనే ఆధారపడి ఉంటుంది" అని లోకేష్ పేర్కొన్నారు.

కత్తి లేకుండా యుద్ధం

విజయవాడ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ వద్ద అస్త్రాలన్నీ దాదాపుగా ఇప్పటికే వాడేశారు. వచ్చే ఎన్నికల్లో ఇక వాడేందుకు ఎలాంటి అస్త్రాలు ఆయన వద్ద లేదు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి ఏం చెప్పగలుగుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతం వేరు. ప్రస్తుతం వేరు. భవిష్యత్ మరోలా ఉంటుంది. గత మూడు ఎన్నికల్లో తాను అధికారంలో లేకపోవడంతో ప్రజల వద్దకు వెళ్లి చెప్పేందుకు తగిన అంశాలున్నాయి. కానీ ఈసారి మాత్రం ఆయన అన్ని ఆయుధాలను వాడేశారు. మిగిలింది తమకు మరోసారి అధికారం ఇస్తే అభివృద్ధి సంక్షేమం అందిస్తామని మాత్రమే చెప్పగలిగేందుకు అవకాశముంటుంది.. 2014లో జనసేన పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ నాడు పోటీ చేయలేదు. నాడు టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చారు. అనుభవమున్న నేతతో పాటు, నాడు మోదీ చరిష్మా పట్ల ఆకర్షితుడైన పవన్ కల్యాణ్ వారికి మద్దతు పలికారు. 2019 ఎన్నికలకు వచ్చే సరికి టీడీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మరొక కూటమిని ఏర్పాటు చేసుకుని బీజేపీ, టీడీపీలపై విమర్శలు చేశారు. కానీ నాడు పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండు స్థానాలలోనూ ఓటమి చెందారు. జనసేన ఒకే ఒక స్థానం నుంచి గెలిచింది. 2024 ఎన్నికలకు వచ్చే సరికి చంద్రబాబు అరెస్ట్... టీడీపీ, బీజేపీతో జనసేన జట్టుకట్టడంతో కొంత ఆయుధాలు పుష్టిగా పవన్ కు లభించాయి. 2019 నుంచి వైసీపీ అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. 30 వేల మంది యువతులు మాయం అయ్యారని, లా అండ్ ఆర్డర్ దెబ్బతినిందని, అభివృద్ధి ఆగిపోయిందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవంటూ జనంలోకి వెళ్లగలిగారు. తాము అధికారంలోకి వస్తే యువతతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని బహిరంగ సభల్లో చెప్పేందుకు వీలు కలిగింది. అయితే వచ్చే ఎన్నికల్లో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని మాత్రమే పవన్ కల్యాణ్ చెప్పగలరు. మరొక పార్టీని అధికారంలోకి రానివ్వవద్దని చెప్పడానికి పవన్ కల్యాణ్ వద్ద ఎటువంటి ఆయుధాలు లేవు. దీంతో పవన్ కల్యాణ్ ఆయుధాలు లేకుండా యుద్ధానికి దిగాల్సి వస్తుందన్న పరిస్థితి వస్తుంది. మరి వచ్చే ఎన్నికల్లో ప్రజలు, కాపు సామాజికవర్గం, అభిమానులు ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాలి.

నేతల్లో టెన్షన్... తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ చాలా మంది నేతలు సంతోషంగా లేరు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు మూడుసార్లు అధికారంలో ఉన్నప్పటి పరిస్థితికి చాలా తేడా వచ్చిందంటున్నారు. పార్టీ నాయకత్వ వైఖరి మారడమే కాకుండా, పార్టీ కేంద్ర కార్యాలయం ఇస్తున్న నివేదికలపైనే చంద్రబాబు ఎక్కువ ఆధారపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ఇచ్చే ఫీడ్ బ్యాక్ ను చూసి నాయకత్వం నిర్ణయాలు తీసుకంటుందన్న ఆరోపణలు సోషల్ మీడియాలోవెల్లువెత్తుతున్నాయి. సత్యవేడు, గంగాధర నెల్లూరు నియోకవర్గ ఎమ్మెల్యేలు బహిరంగంగానే దీనిపై ఆరోపణలు చేయడం విశేషం. ఇవే ఆరోపణలు అనేక మంది నేతలు ఆఫ్ ది రికార్డుగా చేస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు సామర్థ్యం, అనుభవంపై నేతలకు నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం చంద్రబాబు ఇతర పార్టీల పై ఆధారపడుతుండటంతో కొంత నేతలు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ దక్కుతుందో? లేదో? అన్న టెన్షన్ కూడా వారిలో ఉంది. మిత్రపక్షాలు వత్తిడి తెస్తే ఏ నియోజకవర్గాన్ని అయినా వారికి అప్పగించేందుకు సిద్ధంగా ఉండేలా చంద్రబాబు వ్యవహార శైలి ఉందని నేతలు అభిప్రాయపడుతున్నారు. అందుకే గతంలో మాదిరిగా ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టడంలో నేతలు ముందుకు రావడం లేదు. ప్రధాన రీజన్ ఇక పార్టీలో తమకు ప్రాధాన్యత ఉంటుందో లేదో అన్న అనుమానమే వారిని సైలెంట్ గా మార్చేసిందంటున్నారు. మరొకవైపు చంద్రబాబు వ్యూహంపై అనేక మంది కార్యకర్తలు, నేతలకు నమ్మకం మాత్రం సడలలేదు. చంద్రబాబు అనేక సార్లు పార్టీ ఓటమి పాలయినా తిరిగి అధికారంలోకి వచ్చేలా చేయగలడంలో సక్సెస్ అయిన తీరును చూసి నేతలు నమ్మకంతో ఉన్నారు. అలాంటి వారికి కూడా ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ 175 నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్, ఓటు బ్యాంకు ఉంది. అలాంటి సమయంలో గెలుపోటములపై ఆధారపడకుండా పార్టీ నియోజకవర్గాల్లో బలహీన పడకుండా చేయాల్సిన బాధ్యత కూడా చంద్రబాబుపైనే ఉంది. మరి రానున్న కాలంలో భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న బెంగ మాత్రం తెలుగు తమ్ముళ్లలో ఆందోళనను రేపుతుంది.

జగన్ వర్సెస్ విజయ్ వర్సెస్ శివకుమార్

విజయవాడ : ఏమిటిది సినిమా టైటిల్ గా ఉందని అనుకోమాకండి. రాజకీయాల్లో ట్విస్టులు అలాగే ఉంటాయి మరి. తెర ముందు కొన్ని జరిగితే తెర వెనక జరగాల్సినవి ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే దక్షిణాదిన తమ రాజకీయ ఆధిపత్యాన్ని పూర్తి స్థాయిలో చూపించాలని కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి ఆరాటపడుతోంది. ఉత్తరాదిలో బీజేపీ హవా తగ్గుతూండడంతో దక్షిణాదిని పూర్తిగా తమ సొంతం చేసుకుని ఉత్తరాది మీద కూడా పట్టు సాధించాలని ఇండియా బ్లాక్ అయితే వ్యూహ రచన చేస్తోంది. ఈ క్రమంలో ఏపీ వైపు ఫుల్ ఫోకస్ పెడుతున్నారు అని అంటున్నారు. ఏపీలో చూస్తే రాజకీయం పూర్తి స్పష్టతగా ఉంది. బీజేపీతో జనసేన టీడీపీ కలసి ప్రయాణం చేస్తున్నాయి. 2029 ఎన్నికల్లోనూ మూడు పార్టీలు ఎన్డీయే కూటమిగానే వస్తాయని అంటున్నారు. ఈ విషయంలో బీజేపీ కూడా జాగ్రత్తగానే ఉంటుంది. టీడీపీ అలాగే జనసేన 2019 నాటి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కూటమిని బలోపేతం చేసే విధంగానే వ్యవహరిస్తున్నాయి. దీంతో ఏపీలో ఇండియా కూటమి పాగా వేయాలి అంటే జగన్ తో చెలిమి అనివార్యంగా కనిపిస్తోంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ ఏ మాత్రం పుంజుకోకపోవడం వామపక్షాలు నామమాత్రం కావడంతో వైసీపీనే తిప్పుకోవాలని ఇండియా బ్లాక్ నేతలు చూస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే సడెన్ గా దక్షిణాదిన పరిణామాలు రాజకీయంగా వేగంగా మారిపోతున్నాయి. కర్ణాటకకు ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా వచ్చారు. ఆయనకు ఏకంగా వైఎస్సార్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అంతే కాదు జగన్ తోనూ మంచి పరిచయాలు ఉన్నాయని చెబుతున్నారు. జగన్ ప్రస్తుతం ఉంటోంది కూడా బెంగళూరులోనే అన్నది కూడా గుర్తుంచుకోవాలని చెబుతున్నారు. ఇక తమిళనాడుకు కొత్తగా ముఖ్యమంత్రి అయిన విజయ్ తోనూ జగన్ గుడ్ రిలేషన్స్ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. తాజాగా జూన్ 22న విజయ్ బర్త్ డే వస్తే జగన్ గ్రీట్ చేస్తూ ఎక్స్ ఖాతా ద్వారా ట్వీట్ చేశారు. అంతకు ముందు కూడా చెన్నైలో ఒక వివాహ వేడుకలో ఇద్దరూ కలుసుకుని ముచ్చటించుకున్నారు. అంతే కాదు విజయ్ గెలిచాక జగన్ ఆయనకు అభినందనలు తెలిపారు. విజయ్ వైపు నుంచి కూడా అదే విధమైన రెస్పాన్స్ వస్తోంది అని అంటున్నారు. దీంతో ఏపీలో రాజకీయ పరిణామాలు ఏమైనా జరగవచ్చు అని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి ఇండియా కూటమిలోకి జగన్ ని తీసుకుని వచ్చేలా అటు డీకే శివకుమార్ ఇటు విజయ్ కూడా తమదైన శైలిలో తీవ్ర ప్రయత్నం చేస్తారు అని అంటున్నారు. జగన్ కి వీరు సన్నిహితులు కావడంతో ఆ వైపు నుంచి కూడా పాజిటివ్ గా రెస్పాన్స్ ఉండొచ్చు అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇపుడే తొందరపడకుండా తగిన సమయంలోనే ఏపీ వ్యూహానికి ఒక లాజికల్ ఎండ్ తీసుకుని రావాలని అనుకుంటున్నారు అని చెబుతున్నారు. ఇక 2029 ఎన్నికల నాటికి ఎన్డీయే కూటమి గ్రాఫ్ బాగా తగ్గుతుందని ఇండియా బ్లాక్ నేతలు అంచనా వేస్తున్నారు. సౌత్ పార్ట్ అంతా తమ ప్యాకెట్ లో వేసుకుంటే నార్త్ లో కూడా సగానికి సగం అయినా సీట్లు గుంజుకుంటే కేంద్రంలో ఈజీగా ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు అన్నది ఇండియా బ్లాక్ పక్కా ప్లాన్ గా ఉంది. దానికి ఏపీ ఇపుడు అతి పెద్ద కీలకమైన పరిణామం కాబోతోంది అని అంటున్నారు.

బెబ్బులి దెబ్బ.. ఏలూరు జిల్లాలో హైటెన్షన్..!

ఏలూరు : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా హల్‌చల్ చేస్తున్న పెద్దపులి తాజాగా బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించింది. మండల పరిధిలోని నిమ్మలగూడెం శివారులో గల పాలకుంట చెరువు సమీపంలో పులి సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పాలకుంట చెరువు వద్ద మేతకు వెళ్లిన పశువుల మందపై పెద్దపులి ఒక్కసారిగా దాడికి తెగబడింది. ఈ దాడిలో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పులి అడుగు జాడలనుపరిశీలించారు. పశువుల మరణంతో స్థానిక రైతులు, గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో బుట్టాయగూడెం మండలం మరియు పరిసర గిరిజన గ్రామాల్లో అటవీ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. గ్రామాల్లో మైకుల ద్వారా అనౌన్స్‌మెంట్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సమీపంలోని అటవీ ప్రాంతాలకు, పొలాలకు ఎవరూ ఒంటరిగా వెళ్లకూడదని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఇళ్ల నుంచి బయటకు రావద్దని గిరిజనులకు గట్టిగా సూచించారు. అయితే, ఈ పులి కదలికలను ట్రాక్ చేయడం అధికారులకు కొంత సులువైంది. ఈ పులికి ముందే 'రేడియో కాలర్' అమర్చి ఉండటంతో, శాటిలైట్ సిగ్నల్స్ ఆధారంగా అది ఎటు వైపు వెళ్తోంది అనే విషయాన్ని అటవీ శాఖ ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. పులిని తిరిగి అడవిలోకి పంపించేందుకు లేదా పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఎవరూ అధైర్యపడకూడదని అధికారులు వెల్లడించారు.

జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు

కాకినాడ : పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ అంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది. పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి. జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు అన్నట్లుగా రాజకీయం రంజుగా సాగుతోంది. ఈ మీటింగ్ తరువాత వైసీపీ నాయకురాలు వంగా గీత మీడియాతో మాట్లాడుతూ ఒక కామెంట్ చేశారు. పవన్ కులాన్ని తక్కువ చేయకూడదని అన్నారు. కాపులు ఎక్కువగా ఉన్నారనే కదా పిఠాపురం ఎంచుకుని పోటీ చేశారు అని ఆమె కామెంట్స్ చేశారు. అదే ఇపుడు ఏపీలో రాజకీయ పొలికేక గా మారిపోయింది. మరో వైపు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే జనసేన నేత పంతం నానాజీ అయితే హాట్ కామెంట్స్ చేశారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. వంగా గీతది పిఠాపురం అమ్మ గారి ఊరా నాన్న గారి ఊరాఅని ప్రశ్నించారు. అసలు ఎవరు ఎక్కడ నుంచి అయినా పోటీ చేయవచ్చు అని రాజ్యాంగంలోఉందని అన్నారు. జగన్ పులివెందుల నుంచి బయటకు వచ్చి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ సత్తా ఏమిటో చూపిస్తామని పంతం నానాజీ రాజకీయ పంతమే పూనారు. ఈ సందర్భంగా ఆయన ఆవేశంలో జగన్ మీదఅనుచిత వ్యాఖ్యలే చేశారు.

బీసీల సమస్యలకు పరిష్కారం చూపాలి..

బేరి రామచందర్ యాదవ్

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు గారికి వినతి పత్రం అందించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్

హైదరాబాద్ : తెలంగాణలోని బీసీ కులాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. బీసీల డిమాండ్ల కోసం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు గారికి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టింగ్ అభ్యర్థి మారబోయిన రవి కుమార్ యాదవ్ గారికి ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ సమక్షంలో ఓబీసీ సమస్యల గురించి వినతి పత్రం సమర్పించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ నాయకులు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రగుండ్ల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మియాపూర్ ఓబీసీ మోర్చా సమావేశం మదినగూడ భూమి బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. ప్రభాకర్ యాదవ్ ఆహ్వానం మేరకు బీసీ కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ లు బిసి సంక్షేమ పథకాలు, సమస్యల గురించి బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు గారికి అందరు కలిసి మెమొరాండం సమర్పించడం జరిగింది. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉన్నందున 54 శాతం ఉన్న బీసీలకు న్యాయం చేయాలని పేద వర్గాలైన 132 బీసీ కులాలకు అన్ని విధాల సహాయ పడాలని విన్నవిస్తూ మెమొరాండం సమర్పించడం జరిగింది. బీసీ కులాల్లో ఎక్కువగా పేదలు ఉన్నందున విద్యా, వైద్యంలాంటి అధిక ఖర్చులు భరించలేని పక్షంలో ఉన్న పేదలకు కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకొని విద్య కోసం ఎక్కువ బడ్జెట్ కేటాయించి కార్పొరేట్ హాస్పిటల్స్ లో పేదలు లక్షలు బిల్లు చెల్లించలేరని అన్ని ఆలోచనతో పేదలను ఆదుకోవాలని కోరడం జరిగింది. పేదలు బ్రతకడానికి ముద్ర లోన్లు సబ్సిడీ లోన్స్ మిగతా అన్ని సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అన్ని బీసీ కుల సంఘాలకు వర్తించే విధంగా వృత్తి ధర్మంగా 132 కులాలకు సహాయం చేయాలని ప్రత్యేకించి విన్నవించడం జరిగింది. బీసీ ముఖ్యమంత్రి బిజెపి డిక్లేర్ చేసిన సంక్షేమ పథకాలు ద్వారా ప్రజల్లోకి వెళ్లి అత్యధిక జనాభా కలిగిన బీసీలకు జీవన భృతి కలిగే విధంగా సహాయపడాలని ఉద్యోగాలు ప్రభుత్వం మొత్తం కల్పించకపోయినా .....ఉపాధి మరియు స్వంత వ్యాపారాలు చేసుకోవడానికి బీసీలకు లోన్స్ తో ఆదుకోవాలని ముఖ్యంగా రైతుల్లో 50 శాతం కంటే ఎక్కువ ఉన్న బీసీలు చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బ్యాంకు లోన్ ఇవ్వనందున ఎంతో మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు, రైతులకు సబ్సిడీ ఎరువులు సబ్సిడీ విత్తనాలు అవన్నీ కూడా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రైతులకు సహాయపడాలని విన్నవించడం జరిగింది. స్వాతంత్రం వచ్చి సుదీర్ఘకాలం తరువాత కూడా ఆర్థిక అంతరాలు పెరిగిపోయినవి. ధనవంతులు కుబేరు లైతే పేదలు నిరుపేదలై కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామీణ వలసలు పట్టణాలకు పెరిగిపోయినవి అందుకని ఆర్థిక సామాజిక న్యాయం పేదలకు ముఖ్యంగా బీసీలకు జరగాలని కోరడం జరిగింది పేదరిక నిర్మూలన వాజ్పేయి ఇందిరా గాంధీ పిలుపుఇచ్చిన పేదరికం పోలేదు. ప్రజాస్వామ్యంలో చేతినిండా పని కడుపునిండా అన్నం ఉండాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో రోజుగార్ యోజన గ్రామీణ సడక్ యోజన ఎన్ని యోజనాలు ఉన్నా కూడా పేదరికానికి తొలగించే.. విధంగా ప్రభుత్వాలు ఇంతవరకు ప్రయత్నం చేయలేదు సంక్షేమ ఫలాలు 132 కులాలకు సంచారజాతులైన కొన్ని బీసీ కులాలు అసలు వారు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి వాళ్లను కూడా గుర్తించి సహాయపడాలని బీసీ కులాల బిసి సంఘాల ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులు, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ విజ్ఞప్తితో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్ మేదరి సంఘం అధ్యక్షులు కొంటు ముకుందం బట్రాజు సంఘం అధ్యక్షులు రాజు విశ్వబ్రాహ్మణ సంఘం శేరిలింగంపల్లి శ్రీశైలం కురుమ,సాయిలు విశ్వకర్మ సంఘం హరికృష్ణ చారి ఐక్యవేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటగిరి మారుతి అధ్యక్షులు కృష్ణమోహన్ యువత అధ్యక్షులు కొంటూ సుమన్ ఆంజనేయులు గౌడ సంఘం రామకృష్ణ గౌడ్ మున్నూరు కాపు సంఘం బి కృష్ణనాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, ముత్యం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్,భారీ ఎత్తున బీసీ కుల సంఘాల నాయకులు అధ్యక్ష కార్యదర్శులుఅందరూ కలిసి సంక్షేమ ఫలాలతో బీసీలను ఆదుకోవాలని విన్న వించారు.

ఈ సారి కోలగట్ల శ్రావణి వంతేనా

విజయనగరం : విజయనగరం అంటేనే పూసపాటి వారి సంస్థానం. మూడు తరాలను చూసిన గడ్డ అది. రాచరికం అయినా ప్రజాస్వామ్యం అయినా పూసపాటి వారి హవాకు తిరుగులేదు. పీవీజీ రాజు నుంచి అశోక్ గజపతిరాజు దాకా అందరినీ విజయనగరం ప్రజలు ఆశీర్వదించారు. అశోక్ అయితే ఈ రోజున గోవాకు గవర్నర్ గా వెళ్లారు. ఆయన 1978 నుంచి 2009 దాకా ఏకంగా ఎనిమిది సార్లు పోటీ చేస్తే ఏడు సార్లు విజయనగరం అసెంబ్లీ నుంచి గెలిచి అనేకసార్లు మంత్రి పదవులు చేపట్టారు. ఇక కేంద్ర మంత్రిగా కూడా పనిచేసిన అశోక్ గవర్నర్ గా తన రాజకీయ జీవితాన్ని రాజ్యాంగబద్ధమైన పదవితో పూర్తి చేయనున్నారు అశోక్ కుమార్తెగా రాజకీయాల్లో వారసత్వంగా ముందుకు వచ్చిన అదితి గజపతి రాజు 2019లో ఓడి 2024లో గెలిచారు. 2019లో ఆమెను కోలగట్ల వీరభద్రస్వామి ఓడించారు. ఇక 2029లో అదితి గజపతి రాజు మీద పోటీ చేయబోయేది కోలగట్ల వారసురాలు అయిన శ్రావణి అని అంటున్నారు. తండ్రికి తగిన తనయగా ఆమె ఇప్పటికే పేరు తెచ్చుకున్నారు. విజయనగరం కార్పోరేషన్ కి డిప్యూటీ మేయర్ గా పనిచేసిన అనుభవం ఆమె సొంతం. దాంతో పాటుగా వైసీపీ పార్టీ కార్యక్రమాలలో ఆమె జోరుగా పాల్గొంటున్నారు. 2029 ఎన్నికల విషయంలో ఇప్పటి నుంచే కోలగట్ల శ్రావణి ప్రిపేర్ అవుతున్నారు: అశోక్ కుమార్తెగా రాజకీయాల్లోకి వచ్చినా తండ్రి మాదిరిగా జనంతో మమేకం కావడం లేదు అన్న విమర్శ అయితే అదితి గజపతిరాజుకు ఉందని అంటున్నారు. ఆమె కొద్ది మంది నేతల మీదనే ఆధారపడుతున్నారని అంటున్నారు. దాంతో పార్టీలోనూ కొంత అసంతృప్తి ఉందని చెబుతున్నారు. వీటిని ఆమె అధిగమించాల్సి ఉందని చెబుతున్నారు. రెండేళ్ళ పాలన అయితే పూర్తి అయింది, దాంతో ఇక మీదట గట్టిగా పట్టు బిగించాల్సి ఉందని చెబుతున్నారు. విజయనగరంలో వైసీపీకి కూడా పట్టు ఉంది. పైగా కోలగట్ల సామాజిక వర్గం కూడా అధికంగా ఉంది. దాంతో మాజీ ఉప సభాపతిగా ఉంటూ రెండు సార్లు ఎమ్మెల్యే ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన కోలగట్ల వీరభద్రస్వామి ఈసారి కుమార్తెని గెలిపించుకోవాలని పూర్వ రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

రోజా అరెస్ట్ తప్పదా...?

తిరుపతి : వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా అరెస్టు తప్పదా? ఆమెపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన నివేదిక రెడీ అయిందా? ప్రభుత్వం కూడా చాలా సీరియస్‌గానే స్పందిస్తోందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. తాజాగా మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి స్పందిస్తూ.. రోజా సహా.. వైసీపీ హయాంలో శాప్ చైర్మన్‌గా వ్యవహరించిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, వాటిపై విజిలెన్స్ విచారణ కూడా పూర్తయిందని.. త్వరలోనే నివేదిక వస్తుందని తెలిపారు. వైసీపీ హయాంలో రోజా.. క్రీడల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని అమలు చేశారు. ఈ క్రమంలో సుమారు 150 కోట్ల రూపాయలు ఖర్చు చేసి క్రికెట్, వాలీబాల్, హాకీ సహా ఇతర క్రీడలకు సంబంధించిన వస్తువులను బల్క్‌గా కొనుగోలు చేశారు. అయితే.. ఇవన్నీ నాశిరకమేనని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. క్రికెట్ స్టిక్స్ విరిగి పోవడం.. బ్యాట్లు ముక్కలు కావడం అప్పట్లో ప్రధానంగా కనిపించింది. అలానే.. రాష్ట్ర వ్యాప్తగా ప్లే గ్రౌండ్స్ ను ఆధునీకరించే పేరుతో పెద్ద ఎత్తున కాంట్రాక్టు పనులు చేయించారు. దీనికిగాను 100 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. అయితే.. ఈ పనులు కూడా నాశిరకంగా సాగాయని అప్పట్లో క్రీడాకారులు ఆరోపించారు. ఆయా పరిణామాలపై కూటమి ప్రబుత్వం వచ్చిన తర్వాత అందిన ఫిర్యాదులతో విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ విచారణ పూర్తయి.. ప్రస్తుతం నివేదిక రూపొందిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. క్రీడా పరికరాలు కొనుగోలు చేసే విషయంలోను.. మైదానాలను చదును చేసి మౌలిక సదుపాయాలు కల్పించే పేరిట మొత్తంగా 100 కోట్ల రూపాయల మేరకు అవినీతి జరిగిందని.. ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే విచారణకు ఆదేశించింది.

పెండింగ్ సమస్యలపై యుద్ధం

విశాఖపట్టణం : ఏపీ టీడీపీ ప్రెసిడెంట్, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాకలో పెండింగ్ భూ సమస్యల మీద పిటిషన్ కమిటీ ముందు గళమెత్తారు. చిరకాలంగా అటు రెవిన్యూ ఇటు ఏపీఐఐసీ, పట్టణాభివృద్ధి శాఖలకు సంబంధించిన అనేక భూ సమస్యలను కమిటీ ముందు ఉంచారు. ఈ సమస్యలకు రెండు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని కమిటీ హామీ ఇవ్వడం విశేషం. ఇదిలా ఉంటే విశాఖ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్, శాసనసభ పిటిషన్స్ కమిటీ ఛైర్మన్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పిటిషన్స్ కమిటీ సమావేశంలో గాజువాక నియోజకవర్గం సమస్యల మీద పల్లా పూర్తి స్థాయిలో ప్రస్తావించారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతం. దాంతో భూములను వివిధ పరిశ్రమల కోసం సేకరించడం జరుగుతోంది. అదే సమయంలో భూ సేకరణకు తమ భూములు ఇచ్చిన బాధితులకు నష్ట పరిహారం ఈ రోజుకీ చాలా కేసులలో దక్కలేదు. అంతే కాదు, నిర్వాసితుల పునరావాసం సమస్య ఉండనే ఉంది. అలాగే 22-ఏ సమస్యలతో పాటు పరిశ్రమల వల్ల ప్రభావితమైన కుటుంబాల హక్కులు కూడా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ ఉంది. వీటిని అన్నింటికీ కమిటీ ముందు పల్లా ఉంచారు. ఇక చినగంట్యాడ పరిధిలో అనేక గ్రామాలలో నివస్తున్న వందలాది కుటుంబాలకు ఇప్పటికే ఉన్న ఇళ్లకు జీవో నంబర్ 30 తరహాలో క్రమబద్ధీకరణ కల్పించాలని పల్లా కోరారు. అంతే కాదు ఆ ఇళ్ళు రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పల్లా డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాన కార్యదర్శికి ప్రత్యేక సిఫార్సులు పంపాలని పిటిషన్ కమిటీకి సూచించారు. అవసరమైతే కేబినెట్ ఆమోదంతో ప్రత్యేక విధానం తీసుకురావాలని కూడా పల్లా సూచించారు. దీనిపై పిటిషన్స్ కమిటీ సానుకూలంగా స్పందించడమే కాదు 90 రోజుల్లో కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించడం విశేషం. ఇక 22-ఏ పేరుతో అనేక భూములు చిక్కుకున్నాయని పల్లా పిటిషన్ కమిటీ ముందు ఉంచారు. అలా గాజువాకలోని వడ్లపూడి, చినగంట్యాడ, కూర్మన్నపాలెం, మిందీ, పెద్దగంట్యాడ, జగ్గరాజుపేట ప్రాంతాల్లోని నివాస కాలనీలు ఉండటంతో ప్రజలు కొనుగోలు, విక్రయాలు వంటివి లేకుండా పూర్తిగా ఇబ్బందిలో పడ్డారని ఆయన చెప్పారు. వీటిలఒ అర్హులైన నివాస ప్రాంతాలను 22-ఏ నుంచి తొలగించాలని పల్లా కమిటీని కోరారు. ఇక ఉక్కు నిర్వాసితుల ఆర్-కార్డుల డిజిటలైజేషన్ సమయంలో నకిలీ కార్డులు కూడా వచ్చాయని ఆయన చెప్పారు. దీంతో అనుమానాస్పదంగా ఉన్న 486 డౌట్‌ఫుల్ ఆర్-కార్డుల వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని కమిటీ హామీ ఇవ్వడం విశేషం

ప్రధానమంత్రి గతిశక్తి ప్రణాళికల పురోగతిపై సమీక్ష

ఆసిఫాబాద్ : ప్రధానమంత్రి గతిశక్తి జిల్లా ప్రణాళికల పురోగతిపై కేంద్ర ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి ఆయన ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ ధర్మేంద్ర, జిల్లా ... భవనాల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రాజశేఖర్, ఆకాంక్షిత మండల సహచరుడు డాక్టర్ బాలరాజు రాజారాం తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గతిశక్తి పథకానికి సంబంధించిన జిల్లా మాస్టర్ ప్రణాళికపై సమీక్షించినట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో మౌలిక వసతుల కల్పన, రవాణా వ్యవస్థ అభివృద్ధి ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో ప్రణాళికల పురోగతి, వివరాల ...

పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేసిన వైసీపీ కాపు మిషన్

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరుగుతున్నాయి. గత ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలపై తీవ్రంగా మేధోమథనం చేస్తోంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలు, పాలనాపరమైన లోపాలపై పోరాటం కంటే.. వైసీపీ నాయకత్వం ప్రస్తుతం సామాజిక సమీకరణాల పునర్నిర్మాణంపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో తాము ఘోర పరాజయం పాలుకావడానికి, కూటమి చారిత్రాత్మక విజయం సాధించడానికి ప్రధాన కారణం.. కాపు సామాజికవర్గం ఒకేతాటిపైకి రావడమేనని వైసీపీ గట్టిగా నమ్ముతోంది. ఈ మార్పునకు సూత్రధారి పవన్ కల్యాణ్ అని డిసైడ్ అయిన జగన్ .. ఇప్పుడు పవన్ నుంచి కాపులను దూరం చేసే ఒక వ్యూహాత్మక మిషన్ ను తెరపైకి తెచ్చారు. పవన్ కల్యాణ్ ఎప్పటికీ తమ వైపు వచ్చే అవకాశం లేదని తేలిపోవడంతో.. ఆయనకున్న ప్రధాన ఓటు బ్యాంకు పునాదులను కదిలించడమే లక్ష్యంగా వైసీపీ ఒక సరికొత్త పొలిటికల్ గేమ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా వైసీపీలోని కీలక కాపు నాయకులను రంగంలోకి దించారు. పవన్ కల్యాణ్ కేవలం చంద్రబాబు ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని, కాపు సామాజికవర్గానికి దక్కాల్సిన డిప్యూటీ సీఎం లేదా పవర్‌ను త్యాగం చేశారని ప్రచారం చేయడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. పవన్ పై కాపు యువతలో, ఆ సామాజికవర్గ పెద్దల్లో నమ్మకం తగ్గించడం ద్వారా వారిని జనసేన నుండి దూరం చేయవచ్చునేది వైసీపీ ఆలోచన.అయితే, ఇక్కడే వైసీపీ ఒక పెద్ద పొలిటికల్ లాజిక్‌ను మిస్ అవుతోంది. కాపు సామాజికవర్గం పవన్ కల్యాణ్ వైపు భారీగా నిలిచిన మాట వాస్తవమే అయినప్పటికీ.. పవన్ వెంట కేవలం ఒకే ఒక్క సామాజికవర్గం లేదు. ముఖ్యంగా ఏపీలోని యువత , కులాలకు అతీతంగా ఉన్న న్యూట్రల్ ఓటర్లు, మహిళల్లో పవన్ కల్యాణ్‌కు ఒక విలక్షణమైన క్రేజ్ ఉంది. కూటమి ప్రభుత్వంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, క్షేత్రస్థాయి పర్యటనలు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్నాయి. కాబట్టి పవన్‌ను కేవలం 'ఒక్క కులానికే' పరిమితం చేయాలని చూసే వ్యూహం క్షేత్రస్థాయిలో ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే.వైసీపీ కాపు నేతలు చేసే విమర్శల వల్ల కాపు సామాజికవర్గంలో ఎంతమంది పవన్‌ను అనుమానిస్తారో చెప్పడం కష్టం. ఎందుకంటే గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కాపు సామాజికవర్గానికి మంచి ప్రాధాన్యత దక్కింది. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా అత్యంత కీలకమైన శాఖలను నిర్వహిస్తున్నారు. ఇలాంటి సమయంలో వైసీపీ చేసే చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ అనే విమర్శలు.. కాపు ఓటర్లలో సానుభూతిని పెంచి, పవన్‌కు మరింత దగ్గరయ్యేలా చేసే ప్రమాదం కూడా ఉంది.ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. ఒకవేళ వైసీపీ వ్యూహం ఫలించి, జనసేన లేదా కాపుల్లో పవన్ పై నమ్మకం కాస్త తగ్గితే.. జగన్ నేరుగా గెలిచేస్తారా? అంటే రాజకీయ విశ్లేషకులు కాదనే సమాధానం చెబుతున్నారు. ఎందుకంటే ఏపీలో యాంటీ-వైసీపీ సెంటిమెంట్ కేవలం కాపులకే పరిమితం కాలేదు. బీసీలు, ఎస్సీలలోని కొన్ని ప్రధాన వర్గాలు కూడా గత ఎన్నికల్లో వైసీపీకి దూరమయ్యాయి. కేవలం ఒక సామాజికవర్గాన్ని టార్గెట్ చేయడం వల్ల పోయిన ఓటు బ్యాంకు తిరిగి రాదు. మిగిలిన వర్గాల్లో నమ్మకం కలిగించకుండా కేవలం కూటమిని విడదీయాలని చూడటం వల్ల ఆశించిన ఫలితం దక్కకపోవచ్చునని చెబుతున్నారు. వైసీపీ ప్రస్తుతం ప్రజా పోరాటాలు, ప్యాకేజీలు, అభివృద్ధి వంటి అంశాల కన్నా సోషల్ ఇంజనీరింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. కానీ ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడినప్పుడే దానికి మైలేజ్ వస్తుంది. కూటమి ప్రభుత్వంలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని ఎత్తిచూపడం మానేసి.. కేవలం జనసేన ఓటు బ్యాంకును చీల్చడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుంటే.. అది న్యూట్రల్ ఓటర్లలో వైసీపీపై మరింత ప్రతికూలతను పెంచే అవకాశం ఉంది. పవన్ కల్యాణ్‌ను ఒక సామాజికవర్గ నాయకుడిగా ఫ్రేమ్ చేయాలనేది వైసీపీ దీర్ఘకాలిక వ్యూహం. దీనికి పవన్ కల్యాణ్ తన డెలివరీ, అడ్మినిస్ట్రేటివ్ స్కిల్స్‌తో ఎలా కౌంటర్ ఇస్తారనే దానిపైనే ఏపీ భవిష్యత్తు రాజకీయాలు ఆధారపడి ఉంటాయి. కూటమి బలంగా ఉన్నంతవరకు ఈ సోషల్ ఇంజనీరింగ్ మైండ్ గేమ్స్ వర్కవుట్ కావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

పాలనపై పట్టు తప్పుతోందా..

విజయవాడ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈ దఫా ఎందుకో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పాలనను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వంపై పూర్తిగా గ్రిప్ కొరవడినట్లుంది. గతంలో ముఖ్యమంత్రిగా చూసిన చంద్రబాబుకు, నేటి చంద్రబాబుకు చాలా తేడా ఉంది. ఈ మాట పార్టీ నేతలే చెబుతున్నారు. జగన్ ను రాజకీయంగా బలహీనం చేయాలన్న ఆలోచన తప్ప పార్టీకి అండగా ఉన్న వారిని తమ వెంటనే ఉంచుకునే విషయంలో మాత్రం విఫలమవుతున్నారనిపిస్తుంది. అయితే చంద్రబాబు కు ఇది తెలియంది కాదు. వచ్చే ఎన్నికల్లో ఇటు పవన్ కల్యాణ్ మద్దతు, అటు బీజేపీ అండతో గెలుస్తామన్న ధీమాతోనే అలా వ్యవహరిస్తూ ఉండి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. విజయవాడ సాయికృష్ణ వ్యవహారాన్ని సరిగ్గా ప్రభుత్వం డీల్ చేయలేక పోయింది. అనవసర తల నొప్పిని కొని తెచ్చుకున్నట్లయింది. ఆదిలోనే చర్యలకు దిగి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. సాయికృష్ణ వ్యవహారంలో ప్రధాన కారకులైన పోలీసులను సస్పెండ్ చేసి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదు. అలాగే ఈ విషయంలో అసలు నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. చివరకు చంద్రబాబు రంగంలోకి దిగే వరకూ చర్యలు తీసుకోలేదు. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ వ్యవహారాన్ని లైట్ తీసుకున్నారు. చివరకు సిట్ ను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. సంఘటన తెలిసిన వెంటనే సమర్థుడయిన టీడీపీ నేతను ఆ కుటుంబం వద్దకు పంపి ఉంటే బాగుండేది. వంగవీటి రాధా కృష్ణ లాంటి నేతలయితే మరింత బాగుండేదన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతుంది. వంగవీటి రాధా వెళ్లి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదంటున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో 27 శాతం ఓటు బ్యాంకు ఉన్న కాపు సామాజికవర్గంపై వైసీపీ కన్నేసిందని తెలుసు. పవన్ కల్యాణ్ నుంచి ఆ వర్గాన్ని వేరు చేసే యత్నం చేస్తుందని తెలుసు. కానీ ప్రభుత్వం, పార్టీ కానీ పెద్దగా పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య తీవ్రమయిందన్న అభిప్రాయం టీడీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. రెండేళ్లు పూర్తయింది. మూడేళ్లు మరింత కూటమి ప్రభుత్వానికి కీలకం. కాపు,కమ్మ, బీసీ, మాదిగ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకోకపోతే మాత్రం తీవ్ర నష్టం జరిగే అవకాశముంటుందన్న అభిప్రాయం పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతుంది. తస్మాత్ జాగ్రత్త.. అంటూ చెబుతున్నారు.

ఆరు ఆలయాలకు శ్రీ వాణి నిధులు

విజయవాడ : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవాణి ట్రస్టు నిధులను ఉపయోగించి ఆరు దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఇందులో ఏపీ నుంచి మూడు ఆలయాలు, తెలంగాణలోని మూడు ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం శ్రీవాణి ట్రస్టు నిధుల కేటాయింపునకు సైతం ఏపీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సిద్ధిపేట జిల్లాలోని దొమ్మాటలో ఉన్న మహాకాళేశ్వర ఆలయానికి అత్యధికంగా రూ.4.60 కోట్లు కేటాయించారు.శహిందూ దేవాలయాల అభివృద్ధి. హిందూ ధర్మపరిరక్షణ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు, శ్రీవాణి ట్రస్ట్ తీర్మానాల మేరకు తెలుగు రాష్ట్రాలలోని ఆరు దేవాలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆరు ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం శ్రీవాణి ట్రస్టు నిధులను ఖర్చుచేసేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.ఇక ఆ ఆరు దేవాలయాల విషయానికి వస్తే.. ఈ జాబితాలో ధర్మవరం సిద్ధయ్యగుట్టలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, అనకాపల్లి జిల్లా మునగపాకలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, కర్నూలు జిల్లాలోని హుస్సేనాపురం సుంకులమ్మ, మారెమ్మ ఆలయం, తెలంగాణకు సంబంధించి సికింద్రాబాద్ శ్రీగిరిలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, సిద్ధిపేట జిల్లాలోని దొమ్మాట మహాకాళేశ్వర ఆలయం, సంగారెడ్డి జిల్లా కించన్ పల్లి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.అలాగే ఏయే ఆలయాలకు ఎంత మొత్తం నిధులు కేటాయించాలనే దానికి కూడా ఏపీ ప్రభుత్వం అంగీకారం తెలియజేసింది. ఈ ఆరు ఆలయాల్లో అత్యధికంగా దొమ్మాట శ్రీమహాకాళేశ్వర ఆలయం అభివృద్ధి కోసం 4 కోట్ల 60 లక్షలు శ్రీవాణి ట్రస్టు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతించింది. మునగపాక వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.1.75 కోట్లు, హుస్సేనాపురం సుంకులమ్మ, మారెమ్మ దేవాలయానికి రూ.1.10 కోట్లు, కించన్ పల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.1.09 కోట్లు, శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.50లక్షలు, ధర్మవరం శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రూ.50.85లక్షల చొప్పున కేటాయించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది.మరోవైపు శ్రీవాణి ట్రస్టు నిధులను కేవలం హిందూ దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. హిందూ ఆలయాలకు సంబంధించిన నిధులను వాటి పరిరక్షణకు మాత్రమే ఉపయోగిస్తామని ఆనం తేల్చిచెప్పారు. ఇదే సమయంలో షిరిడీ సాయిబాబా హిందూ ధర్మశాస్త్రాలలో లేరన్న దేవాదాయ శాఖ మంత్రి.. షిరిడీ సాయి ఆలయాలకు శ్రీవాణి ట్రస్టు నిధులను ఖర్చు చేసేది లేదనే క్లారిటీ పరోక్షంగా ఇచ్చారు.

మూడో లైన్ కు ఓకే..

గుంటూరు : గుంటూరు - బాపట్ల జిల్లాల సరిహద్దుల్లో ఉండే వేమూరు రైల్వేస్టేషన్‌కు మంచిరోజులు వచ్చాయి. రైల్వేస్టేషన్‌లో మూడో లూప్‌లైన్ నిర్మాణానికి రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం రూ.20.58 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో మూడో లూప్‌లైన్ నిర్మాణంతో పాటుగా ప్లాట్ ఫారంల విస్తరణ, తాత్కాలిక నిల్వకేంద్రాలు, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నిర్ణయంతో వేమూరు, తెనాలి ప్రాంత ప్రజలకు ఉపయోగం ఉంటుందని అధికారులు చెప్తున్నారు.కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలోని పలు రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారిపోతున్నాయి. తాజాగా వేమూరు రైల్వేస్టేషన్ కు మంచి రోజులు వచ్చాయి. బాపట్ల-గుంటూరు జిల్లాల సరిహద్దులలో వేమూరు రైల్వేస్టేషన్ ఉంటుంది. ఈ రైల్వేస్టేషన్ మీదుగా రైళ్ల రద్దీ అధికంగా ఉంది. దీంతో గూడ్సు రైళ్లను ఆపేందుకు, సరుకు లోడింగ్ ప్రక్రియకు అంతరాయాలు కలుగుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపించేందుకు రైల్వేశాఖ వేమూరు రైల్వేస్టేషన్‌లో మూడో లూప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదించింది. తాజాగా ఇందుకోసం రైల్వేశాఖ నిధులు కేటాయించింది. వేమూరు రైల్వేస్టేషన్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు గానూ.. మూడో లూప్‌లైన్ నిర్మాణం కోసం రైల్వేశాఖ రూ.20.58 కోట్ల నిధులు కేటాయించింది.మూడో లూప్ లైన్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వస్తే వేమూరు రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు అడ్డంకులు ఉండవని అధికారులు చెప్తున్నారు. సరుకు రవాణా చేసే గూడ్స్ రైళ్లను లూప్‌లైన్‌లోకి మళ్లించి.. సరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేయవచ్చని చెప్తున్నారు. దీంతో రైళ్ల రాకపోకల సమయం ఆదా కావటమే కాకుండా, సరకు రవాణా వేగం కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ లూప్‌లైన్ నిర్మాణంతో ఇటు బాపట్ల, అటు గుంటూరు రెండు జిల్లాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది.

మూడో లూప్‌లైన్ నిర్మాణంతో ఈ ప్రాంత రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో, వేగంగా రవాణా చేసేందుకు వీలు కలుగుతుంది.

అలాగే ఇతర రాష్ట్రాల నుంచి కూడా పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు వంటి వాటిని వేగంగా దిగుమతి చేసుకోవడానికి కూడా అవకాశం ఉందని రైల్వే అధికారులు చెప్తున్నారు. రైల్వేశాఖ కేటాయించిన రూ.20.58 కోట్లతో మూడో లూప్‌లైన్ నిర్మాణం మాత్రమే కాకుండా.. గూడ్స్ రైళ్లు సులువుగా వచ్చి వెళ్లేలా ప్లాట్‌ఫారాల విస్తరణ కూడా చేపట్టనున్నారు. రైల్వేస్టేషన్ వద్ద అంతర్గత రోడ్ల నిర్మాణం.. తాత్కాలిక నిల్వ కేంద్రాలను సైతం అధికారులు ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా కేంద్ర రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయంతో వేమూరు, తెనాలి ప్రాంతంలోని కార్మికులు, హమాలీలు, ఆటో, లారీ డ్రైవర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని అధికారులు చెప్తున్నారు

కుంగిపోతున్న ఊడలమర్రి

ఒంగోలు : మార్కాపురం జిల్లా కనిగిరి దుర్గం దొరువుకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. కనిగిర కేంద్రంగా కొండపై ఓ కోటను నిర్మించి ఇక్కడ నుంచే రాజులు పాలన కూడా చేశారు. ఆ కనిగిరి కొండ కింద ఉండే దొరువు గట్టుపై ఓ పెద్ద మర్రి చెట్టు చరిత్రకు ఆనవాళ్లుగా ఉంది. ఇప్పుడు ఆ చరిత్రను చెరిపేసే దుశ్చర్యలను కొందరు చేస్తున్నారు. వారం రోజుల కింద రెండు భారీ కొమ్మలు విరిగిపోగా.. తాజాగా మరో నాలుగు నేలవాలడం ప్రకృతి ప్రేమికులను కలవరపెడుతోంది. చారిత్రక ప్రదేశాలను కాపాడాల్సిన అవసరం చాలా ముఖ్యం. అవి కేవలం చరిత్రకు ఆనవాళ్లు మాత్రమే కాదు.. మన భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలు కూడా. పాత ప్రకాశం జిల్లా, ప్రస్తుత మార్కాపురం జిల్లాలోని కీలక ప్రాంతమైన కనిగిరి కోట ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగింది. కనిగిరి కొండ కింద ఉండే దొరువు మార్కాపురం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. అక్కడ ఉన్న ఊడల మర్రి ఎవరో దుండగులు నిప్పు పెట్టడం ఇప్పుడు కలకలం సృష్టించింది.కనిగిరి దుర్గం దొరువు దగ్గర ఉండే మర్రిచెట్టుతో ఆ ప్రాంత ప్రజలకు ఎన్నో జ్ఞాపకాలు. చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా అందరూ ఆ ఊడల మర్రి కింద కాసేపు సేద తీరుతారు. ఆ ప్రాంతంలో చదువుకునే విద్యార్థులకు అదో తీపి గుర్తు. పిల్లలు కాసేపు అక్కడికి వచ్చి ఆటలాడుకుంటూ ఉంటారు. ప్రకృతి ప్రేమికులు, ఎవరైనా కొత్తగా వచ్చిన వాళ్లు ఆ ప్లేస్‌లో సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు.అలాంటి మహావృక్షానికి ఇప్పుడు పెద్ద ముప్పే వచ్చింది. వారం రోజుల కిందట రెండు భారీ కొమ్మలు విరిగిపోగా ఆదివారం రాత్రి మరో నాలుగు నేలవాలాయి.

మర్రిచెట్టు మాను కూడా ఓ వైపు ఒరిగిపోయి కళా విహీనంగా మారిపోయింది. దాంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణ శాస్త్రవేత్తలతో పరిశీలించి చెట్టు సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.అయితే, కొందరు వ్యక్తులు కావాలనే చెట్టు తొర్రల్లో నిప్పు పెట్టడంతో పాటు.. చెట్టు మొదలులో యాసిడ్ వంటివి పోయడంతో కొమ్మలు పటుత్వం కోల్పోయి ఒక్కొక్కటిగా విరిగిపోతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ కొందరు వ్యక్తులు ఈ మర్రిచెట్టుకు దగ్గరలో ఉండే స్థలాన్ని ఆక్రమించేందుకు యంత్రాలతో చెట్టు కొమ్మలను నరికేశారని కూడా స్థానికులు గుర్తు చేస్తున్నారు. అప్పట్లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఏదేమైనా ఇప్పటికైనా అధికారులు పూనుకుని ఈ చారిత్రక ఆనావళ్లకు రక్షణ కల్పించాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

సర్-2026 జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందే..

హైద్రాబాద్ ; సర్-2026 (ప్రత్యేక సమగ్రసవరణ(సర్)జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగా ఓటేస్తున్నామంటే అలా కుదరదని స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమంలో భాగంగా ఇలా చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి(డీఈవో), జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. నెలరోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు నింపినవారి వివరాలతో మాత్రమే ముసాయిదా ఓటరు జాబితా తయారవుతుంది. ముసాయిదాలోని ఓట్లపై నెల రోజుల పాటు ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్న ఆయన ఆయా ఓటర్లకు నోటీసులు ఇస్తామని చెప్పారు. ఓటరు తగు పత్రాలను అందజేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. గుర్తింపు కార్డుల అవసరం లేదు .అక్టోబరు 1, 2026న తుది ఓటరుజాబితా ముద్రిస్తామని, ముసాయిదా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటికి వచ్చిన సమయానికి తాళం వేసి ఉంటే తలుపు, కిటికీల నుంచి పత్రాలను లోపలికి వేస్తారని పేర్కొన్నారు. వాటిలో వివరాలు నింపి సిద్ధంగా ఉంచుకోవాలన్న ఆయన మరో రోజు బీఎల్వో వచ్చి పత్రాలను తీసుకుంటారని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలతో ఎలాంటి గుర్తింపు కార్డులను ఇవ్వాల్సిన అవసరం లేదు.

జాబితాలో పేరు లేకుంటే?

ఎన్యుమరేషన్ పత్రాన్ని అధికారులు ఇవ్వరు. వారు ఓటరుగా నమోదయ్యేందుకు ఎప్పటిలాగే ఫారం-6 నింపాల్సి ఉంటుంది. వారికి సర్-2026 సర్వేతో ఎటువంటి సంబంధం ఉండదు. ఇటీవల ఎన్నికల్లో ఓటు వేసిన నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఇల్లు మారిన ఓటర్లకు కూడా ఎన్యుమరేషన్ పత్రం ఇచ్చేది ఉండదు. ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డులోని అడ్రస్?లోనే సదరు వ్యక్తులు ఎన్యుమరేషన్ ఫారం అందుకోవాలి. ఆ చిరునామాతోనే వివరాలను నింపి ఇవ్వాలి. హైదరాబాద్ నగరంలో వివిధ రాష్ట్రాల ఓటర్లను దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు ఇంగ్లీష్?లో ముద్రించిన ఎన్యుమరేషన్ పత్రాన్ని పంపిణీ చేస్తున్నారు.

ఓటరు సంతకం చేయాలి

ఎన్యుమరేషన్ పత్రంలో నింపిన వివరాలు సరైనవని తెలుపుతూ ఓటరు లేదా ఓటరు కుటుంబ సభ్యులు సంతకం చేయాల్సి ఉంటుంది.

జూనియర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని బీఎల్వోలుగా నియమించారు.వారు ప్రతి పత్రాన్ని పరిశీలించి అందులోని వివరాలను బీఎల్వో యాప్‌లో నమోదు చేస్తారన్న ఆయన బీఎల్వో అప్‌లోడ్ చేసే వివరాలను సహాయ ఈఆర్వో, ఈఆర్వోలు ఆమోదిస్తారు. వారికి ఏ మాత్రం అనుమానం వచ్చినా సదరు ఓటరుకు నోటీసు వెళ్తుందని. అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకు అవసరమైన పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

జనసేన గూటికి..

విశాఖపట్టణం : ట్రెండ్‌కి తగ్గట్టు ఎప్పటి కప్పుడు పొలిటికల్ ప్లేగ్రౌండ్ మార్చే ఆ మాజీ మంత్రి ఇప్పుడు కొత్తగా ఆలోచిస్తున్నారా? ఇప్పటి వరకు తాను ఎంట్రీ ఇవ్వని పార్టీలోకి అడుగుపెట్టబోతున్నారా? ఆ మాజీ మంత్రి రాజకీయ గమ్యస్థానం ఫిక్స్ అయింది, ఇక పార్టీ మారే ముహూర్తమే మిగిలి ఉందన్న ప్రచారం నిజమేనా? ఎవరా ఎక్స్ మినిస్టర్? ఏ పార్టీలోకి వెళ్లాలనుకుంటున్నారు? రాజకీయాల్లో ఎంత ఎక్కువ సహనంతో ఉంటే అంత మంచి పదవులు దక్కుతాయన్నది విస్తృతాభిప్రాయం. అందుకు చాలా ఉదాహరణలు కూడా కనిపిస్తుంటాయి. అదే సమయంలో దుందుడుకు నిర్ణయాలు తీసుకుని దెబ్బతిన్న వాళ్ళకు కూడా కొదవలేదు. ఈ విషయాన్ని బాగా ఒంటబట్టించుకుని సమయానుకూల నిర్ణయాలు తీసుకునే ఉత్తరాంధ్ర పొలిటికల్ లీడర్స్‌లో ఒకరు అవంతి శ్రీనివాస్. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఒకటి రెండు సార్లు మాత్రమే స్పందించిన అవంతి రీఛార్జ్ మోడ్‌లోకి వచ్చారన్న సంగతి ఆసక్తి రేపుతోంది. అదే సమయంలో ఆయన ఏ పార్టీలో చేరతారన్న చర్చలు ఇంకా ఇంట్రస్టింగ్‌గా జరుగుతున్నాయి. రెండు సార్లు ఎమ్మెల్యే, ఒక సారి ఎంపీగా గెలిచిన ముత్తంశెట్టి శ్రీనివాస్ అలియాస్ అవంతి శ్రీనివాస్ మూడు సార్లు మూడు వేరువేరు పార్టీల నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఎన్నికలకు ముందు పోటీ చేసే సీటే కాదు, గెలిచే పార్టీ మీద ఆయన పర్ఫెక్ట్ సర్వేలతో రంగంలోకి దిగుతారనే ప్రచారం ఉంది. మెగాస్టార్‌గా చిరంజీవి ఊపు, కాపు ఫ్యాక్టర్ లెక్కలేసుకుని 2009లో తొలిసారి భీమిలి నుంచి ప్రజారాజ్యం పార్టీ తరపున బరిలో దిగి గెలిచారు అవంతి. తర్వాత 2014లో టీడీపీ గూటికి చేరి అనకాపల్లి ఎంపీగా విజయం సాధించారు. ఇక 2019లో వైసీపీలో చేరిన శ్రీనివాస్ పట్టుబట్టి మరీ భీమిలి అసెంబ్లీ సీటు దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో గ్రేటర్ విశాఖ పరిధిలో మూడు స్థానాలు వైసీపీ గెలుచుకోగా నాలుగు సీట్లు టీడీపీ కైవసం చేసుకుంది. పెందుర్తి, గాజువాక నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఫస్ట్ టైం కావడం, కాపు ఈక్వేషన్‌తో వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఛాన్స్ కొట్టేశారాయన. నాడు మూడేళ్లు జిల్లాలో ఏకైక మంత్రిగా ఓ వెలుగు వెలిగారు. ఈ సమయంలో టీడీపీ, జనసేనలను వివరీతంగా టార్గెట్ చేసేవారు అంతి. ఆ విషయంలో సొంత సామాజికవర్గంలో వ్యతిరేకత వచ్చినా? పార్టీ లైన్ మాత్రం తప్పలేదనే నమ్మకాన్ని అధినాయకత్వానికి కలిగించగలిగారని అంటారు. దాంతో ఇక కప్పదాట్లు ఉండబోవని, ఫ్యాన్ పార్టీకి ఫిక్స్ అయ్యారనే అంతా ఊహించారు. కానీ 2024 ఎన్నికలు ముగిసి కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కొత్త ఆప్షన్ ఎంచుకున్నారు ఈ మాజీ మంత్రి. వైసీపీ వైఫల్యాలను ఏకరువు పెట్టి మరీ బయటకు వచ్చారు. రాజకీయాల్లో తీరిక లేని కారణంగా ఫ్యామిలీ బిజినెస్ అయిన విద్యా సంస్థల అభివృద్ధిపై దృష్టి పెట్టలేక పోయానని సన్నిహితులతో చెబుతూ వచ్చారు.

దీంతో ఎన్నికలు సమీపించే వరకు ఆయన అదే స్టాండ్‌లో ఉంటారని అంతా భావించారు. కానీ అవంతి మాత్రం అంతర్గతంగా కూటమి పార్టీలతో సఖ్యత కోసం ప్రయత్నిస్తున్నారట. ఆ దిశగా టీడీపీ, బీజేపీ పెద్దలకు దగ్గరయ్యే ప్రయత్నాల్లో ఉన్నట్టు చాలాకాలం ప్రచారం జరిగింది. అయితే, తనకు పొలిటికల్ విక్టరీని పరిచయం చేసిన చిరంజీవి ఫ్యామిలీతో ఉన్న పరిచయాల కారణంగా జనసేన వైపు మొగ్గు చూపవచ్చని అంటున్నారు. ఇందుకు రెండు కారణాలను కూడా చెబుతున్నారు కొందరు. ఒకటి నియోజకవర్గ పునర్విభజన కాగా రెండోది పోటీకి అనువైన స్థానం ఎంపిక. అలాగే మరోసారి ఎంపీగా పోటీ చేసే అవకాశం వస్తే బాగుండునని కూడా ఆశిస్తున్నారట. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే భీమిలి రెండు సెగ్మెంట్స్ అవుతుందని అంటున్నారు. వాటిలోని ఒక సీటులో తాను పోటీ చేసే ఛాన్స్ వస్తుందన్నది అవంతి లెక్క అట. అలాగే అనకాపల్లి జిల్లా పరిధిలో కాపు ఓట్ బ్యాంక్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకోవాలన్నది ఆయన సెకండ్ ఆప్షన్‌గా తెలుస్తోంది. ప్రస్తుతం తాను రాజకీయంగా న్యూట్రల్ అని బయటికి స్టేట్మెంట్ ఇస్తున్నా లేటెస్ట్‌గా తన మనసులో మాటను సన్నిహితుల దగ్గర బయటపెడుతున్నారట. దాన్నిబట్టి చూస్తే జనసేన వైపు అడుగులేయడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వచ్చే ఎన్నికల్లో జనసేన ఎక్కువ సీట్లు తీసుకుని పోటీ చేస్తుందన్న అభిప్రాయమైతే చాలా మందిలో ఉంది. దాంతో గ్లాస్ పట్టుకుంటే సేఫ్‌గా ఉంటామని మాజీ మంత్రి అనుకుంటున్నట్టు సమాచారం.

బీజేపీ గూటికి వైసీపీ ఎంపీలు

తిరుపతి : మళ్లీ కూటమిలో చేరికలు మొదలయ్యే అవకాశం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు మళ్ళీ పార్లమెంటు ముంగిటకు రానుంది. ఏపీలో దాదాపు 80 అసెంబ్లీ సీట్లతో పాటు 13 పార్లమెంటు సీట్లు పెరగనున్నాయి. అదే జరిగితే అధికార కూటమికి అభ్యర్థులు అవసరం ఉంటారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకోకపోవడంతో ఆ పార్టీ నేతలు జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిణామాల క్రమంలోనే జనసేన చేరికల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు బిజెపి సైతం ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. వైసీపీ ఎంపీలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు సమాచారం.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోక్సభలో నలుగురు ఎంపీలు, రాజ్యసభలో నలుగురు ఎంపీలు ఉన్నారు. వారిపై బిజెపి గురి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. వారు సైతం అవసరాల కోసం బిజెపి వైపు మొగ్గు చూపుతున్నట్లు టాక్ నడుస్తోంది. ముఖ్యంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి పేరు వినిపిస్తోంది. మద్యం కుంభకోణం కేసులో మిధున్ రెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఆయన తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై కూడా అనేక కేసులు నమోదయ్యాయి. వైసీపీలో ఒక వెలుగు వెలిగారు ఈ ఇద్దరు తండ్రి కొడుకులు. కానీ ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అందుకే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి బిజెపి వైపు చూస్తున్నట్లు మళ్లీ ప్రచారం మొదలైంది.మరోవైపు వివేకానంద రెడ్డి హత్య కేసులో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు అవినాష్ రెడ్డి. ఎంతకాలం జగన్మోహన్ రెడ్డి బిజెపితో ఉన్న స్నేహంతో అవినాష్ రెడ్డి బయటపడ్డారు. కానీ ఇప్పుడు వైసీపీ విషయంలో బిజెపి అభిప్రాయం మారింది. కోర్టు కూడా మళ్లీ విచారణ మొదలు పెట్టాలని సిబిఐ కు ఆదేశించే అవకాశం ఉంది. అదే జరిగితే అవినాష్ రెడ్డి అడ్డంగా బుక్ కావడం ఖాయం. అందుకే ఆయన సైతం బిజెపిని ఆశ్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి సైతం బిజెపికి టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. టీటీడీ లడ్డు కల్తీ కి సంబంధించి అభియోగాలు మోపుతూ విచారణ లోతుగా సాగింది. సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా బలమైన ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది.. అందుకే ఆయన సైతం బిజెపి వైపు వచ్చేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది.అయితే ఈ ముగ్గురు జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులు. వారు పార్టీ మారుతారు అంటే అంత సులువు కాదు. పైగా వీరి అవసరం బిజెపికి ప్రస్తుతం లేదు. మీరు బిజెపిలో కేవలం ఇబ్బందులను దృష్ట్యా వెళ్తారే తప్ప.. వీరికంటూ వైసీపీపై ఎటువంటి అసంతృప్తి లేదు. పైగా టిడిపి నుంచి అనేక రకాల అభ్యంతరాలు ఉంటాయి. మీరు ఎట్టి పరిస్థితుల్లో బిజెపిలో చేరే అవకాశం లేనట్టు చాలామంది కొట్టి పారేస్తున్నారు.

సైకిల్ ఎక్కనున్న మహీధర్ రెడ్డి

ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఒకరు గుడ్ బై చెప్పనున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు దాదాపు సిద్ధపడ్డారు. గత కొంతకాలంగా జగన్మోహన్ రెడ్డి తీరుతో ఆగ్రహంగా ఉన్నారు. జగన్ వైఖరిలో మార్పు రాకపోవడంతో పార్టీని వీటడమే మేలన్న నిర్ణయానికి ఆయన వచ్చారు. కార్యకర్తలతో వరుసగా భేటీలు నిర్వహిస్తూ వచ్చిన ఆయన పార్టీకి రాజీనామా చేసేందుకు డిసైడ్ అయ్యారు. ఆయనే నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి. ఇప్పటికే నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన నైరాస్యం అలముకుంది. ఇప్పుడు మహీధర్ రెడ్డి గుడ్ బై చెబితే మరింత సంక్షోభం ఖాయం ఆ పార్టీకి.మానుగుంట మహిధర్ రెడ్డికి కందుకూరు రాజకీయాల్లో మంచి నేపథ్యం ఉంది. బలమైన క్యాడర్ కూడా ఉంది. మానుగుంట ఆదినారాయణ రెడ్డి వారసుడిగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు కాంగ్రెస్ పార్టీ ద్వారా. 1989లో తొలిసారిగా కందుకూరు నుంచి పోటీ చేసి గెలిచారు. 1994లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి ఓటమి చవి చూశారు.

2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో సైతం విజయాన్ని దక్కించుకున్నారు. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కీలకమైన మున్సిపల్ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2014 ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019లో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచారు.. 2024 ఎన్నికల్లో జగన్ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు మహిధర్ రెడ్డి దూరంగా ఉన్నారు. దాదాపు రెండేళ్లుగా ఆయన పార్టీలో యాక్టివ్ గా లేరు. ఇటీవల వరుసగా పార్టీ శ్రేణులతో పాటు అనుచరులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. పసుపు కండువా కప్పుకోవాలని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉండి.. ఆ తరువాత నెల్లూరు జిల్లాలో విలీనమైన కందుకూరు నియోజకవర్గంలో మహీధర్ రెడ్డి టిడిపిలో చేరితే ఒక ఊపు రావడం ఖాయం అని విశ్లేషకులు భావిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, క్లీన్ ఇమేజ్ ఉన్న మహిధర్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడితే కచ్చితంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రభావం చూపడం ఖాయం. మహీధర్ రెడ్డిని పార్టీని వీడకుండా జగన్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలితం ఇవ్వడం లేదని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

ఏపీలో రెడీగా మరో విద్యాసంస్థ

రూ. 234 కోట్ల భారీ వ్యయం.. 50 ఎకరాల్లో వరల్డ్ క్లాస్ క్యాంపస్!

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ విద్యా రంగానికి కేంద్ర ప్రభుత్వం మరో భారీ కానుకను అందించింది. నెల్లూరు వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ రీజినల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు సంబంధించిన మాస్టర్ ప్లాన్ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ ప్రతిష్టాత్మక క్యాంపస్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వీలుగా ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. మైసూర్ తర్వాత దక్షిణ భారతదేశంలోనే రెండవ ఆర్ఐఈ క్యాంపస్గా నెల్లూరు రూపుదిద్దుకోనుంది. ఈ ప్రపంచస్థాయి క్యాంపస్ను నెల్లూరులో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత ఆధునిక వసతులతో నిర్మించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.234.36 కోట్ల భారీ బడ్జెట్ను కేటాయించింది. ఈ అత్యాధునిక క్యాంపస్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు, అత్యాధునిక లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్తో పాటు విద్యార్థులు, అధ్యాపకులకు అవసరమైన హాస్టల్, వసతి గృహాల సముదాయాలను నిర్మించనున్నారు. పర్యావరణ అనుకూలమైన గ్రీన్ క్యాంపస్ నమూనాతో ఈ మాస్టర్ ప్లాన్ను సిద్ధం చేశారు.ఎన్సీఈఆర్టీ పరిధిలో పనిచేసే ఈ నెల్లూరు ఆర్ఐఈ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల విద్యా అవసరాలను తీర్చనుంది. దక్షిణ భారతదేశంలోనే ఉపాధ్యాయ విద్య , అధ్యాపక శిక్షణ, విద్యా పరిశోధనల్లో ఒక ప్రధాన హబ్గా ఇది అవతరించనుంది. జాతీయ విద్యా విధానం కు అనుగుణంగా ఇక్కడ బోధనా పద్ధతులపై సరికొత్త పరిశోధనలు జరగనున్నాయి. నూతన తరం ఉపాధ్యాయులను తీర్చిదిద్దడంలో ఈ సంస్థ అత్యంత కీలక పాత్ర పోషించనుంది. గతంలో ఈ ప్రాజెక్టు మంజూరైనప్పటికీ వివిధ కారణాల వల్ల ఆలస్యమవగా.. ఇప్పుడు మాస్టర్ ప్లాన్ విడుదల కావడం, ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ ప్రక్రియ తుది దశకు చేరడంతో నెల్లూరు ప్రజల్లో, విద్యా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ అనుమతులు రాగానే నిర్మాణ పనులు వేగంగా ప్రారంభం కానున్నాయి.

రైల్వే జంక్షన్ గా కుప్పం

తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో కొత్త రైల్వే జంక్షన్ అందుబాటులోకి రానుంది. రెండేళ్లలో కుప్పం రైల్వే జంక్షన్గా మారనుంది. కర్ణాటకలోని మారికుప్పం నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకూ కొత్త రైల్వేట్రాక్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పనులలో రైల్వే అధికారులు వేగం పెంచారు. ప్రస్తుతం ఈ మార్గంలోని భూములను చదును చేసే పనులు జరుగుతున్నాయి. కర్ణాటక సరిహద్దుల నుంచి ఏపీ సరిహద్దు వరకు భూమిని చదును చేసే పనులను చేపడుతున్నారు. ఇందులో ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి . అలాగే బిసానత్తం నుంచి కుప్పం వరకు 18 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం 269 ఎకరాల భూమిని సేకరించారు. ఈ నూతన రైలు మార్గం ఏర్పాటు కోసం రూ.363 కోట్లు అంచనాలతో పనులు జరుగుతున్నాయి. 2028 మార్చికల్లా పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులలో ఉంటుంది కుప్పం. రెండు రాష్ట్రాలకు సుమారుగా 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చెన్నై బెంగళూరు రైల్వే మార్గంలో కుప్పం రైల్వేస్టేషన్ ఉండటంతో.. రోజూ పదుల సంఖ్యలో రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వేశాఖ కుప్పం రైల్వేస్టేషన్ను అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలోనే 2011లో కుప్పం – మారికుప్పం మధ్యన కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు. 23.7 కి.మీ. మేరకు కుప్పం రామకుప్పం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ అధికారులు ప్రణాళికలు రచించారు. కుప్పం, మల్దేపల్లె, నక్కనపల్లి, గుండ్లసాగరం, కనమనపల్లె, అగరం, కుప్పిగానిపల్లి, కోటచెంబగిరి, పొగురుపల్లె, బిసానత్తం, అత్తిసత్తం మీదుగా మారికుప్పం వరకూ ఈ ట్రాక్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసింది. అలాగే మారికుప్పం ప్రాంతం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి అయ్యి కుప్పం–మారికుప్పం రైల్వేట్రాక్ అందుబాటులోకి వస్తే.. ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు పెరుగుతాయి. అలాగే కుప్పం రైల్వేస్టేషన్ జంక్షన్గా రూపుదిద్దుకుంటుందని అధికారులు చెప్తున్నారు

డీ లిమిటేషన్ వరకు వైసీపీ కాపు నేతల టైం పాస్!

విజయవాడ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కాపు నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత వారిలో ఒక రకమైన భయం ఉంది. కానీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే వారంతా కొనసాగుతున్నారు. కూటమి పార్టీలో చేరాలనుకున్నా.. ఆ మూడు పార్టీల నాయకత్వాలు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో వైసీపీలోనే ఉంటూ కాస్త హడావిడి చేస్తున్నారే తప్ప.. మనస్ఫూర్తిగా పనిచేయని కాపు నేతలు వైసీపీలో అధికంగా ఉన్నారు. ముఖ్యంగా గోదావరి జిల్లాలో అయితే ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు వైసిపిలో కొనసాగుతున్నారు. రెండేళ్లు అవుతున్నా పార్టీలో ఎటువంటి పురోగతి లేదు. పుంజుకున్న దాఖలాలు లేవు. ఆపై కూటమి సమన్వయంతో ముందుకు సాగుతోంది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో ఉంటే తమ పొలిటికల్ కెరీర్ క్లోజ్ అయిపోతుందని భయం ఆ నేతల్లో ఉందిమొన్నటి ఎన్నికల్లో కూటమికి రికార్డు స్థాయిలో మెజారిటీ లభించింది. ఆ ఫలితాలు చూశాక చాలామంది వైసిపి నేతలకు భవిష్యత్తుపై ఆశలు పోయాయి. అందుకే కూటమి పార్టీల్లోకి జంప్ కావాలని భావించారు. కానీ స్థానిక రాజకీయాల దృష్ట్యా కూటమి పార్టీల నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. ఈ నేతలంతా అటు వెళ్లలేక.. ఇటు ఉండలేక వైసీపీలోనే ఉండిపోవాల్సి వచ్చింది. వైసీపీలో ఉంటూ ఉనికి కోసం వారు చేసే ప్రయత్నం అంతా ఇంతా కాదు. మళ్లీ ఇప్పుడు కాపు ఆత్మీయ సదస్సులు అంటూ సరికొత్త రాగాలు అందుకుంటున్నారు. నిన్ననే కాపు నేతల ఆత్మీయ సదస్సు జరిగింది. కాపులకు రాజ్యాధికారం కావాలన్నట్టు వారు మాట్లాడారు. వైసీపీకి దీంతో సంబంధం లేదు అని సంకేతాలు ఇచ్చారు. అయితే వీరు పార్టీ కోసం.. జగన్మోహన్ రెడ్డి కోసం ఈ ప్రయత్నం చేయలేదు. కేవలం అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్టు కనిపించారు.పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా కాపుల ఆత్మీయ సమావేశం పెట్టారు. కూటమి నుంచి పవన్ బయటకు వచ్చేలా ఒత్తిడి పెంచేందుకు ఈ ప్రయత్నం చేశారు. కానీ అంతకుమించి నిజం ఏంటంటే రాజకీయ భవిష్యత్తు ఇస్తామంటే.. వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇస్తామంటే మాత్రం వీరంతా కూటమి గూటికి చేరడం ఖాయం. ముఖ్యంగా జనసేన వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలో డీలిమిటేషన్ జరగనున్న దృష్ట్యా దాదాపు 80 సీట్లు పెరుగుతాయి. వాటిలో వారి వారసులకు అవకాశం కల్పిస్తామన్న మరుక్షణం వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పడం ఖాయం. ఈ కాపు ఆత్మీయ సమావేశాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యూహంలో భాగంగా జరగవచ్చు. కానీ వాటిని తమ వారసులకు ఒక రాజకీయ వారధిగా మార్చుకోవాలని చూస్తున్నారు నేతలు.శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కాపు నాయకులు పునరాలోచనలో ఉన్నారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నాం కాబట్టి అధినేత జగన్ ఆదేశాల ప్రకారం ఆత్మీయ సదస్సులు పెట్టాలని నిర్ణయించారు. కానీ ఇందులో మెజారిటీ కాపు నేతలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో డిలిమిటేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన మరుక్షణం ఏపీలో రాజకీయాలు మారిపోతాయి.

ప్రస్తుతం వైసీపీలో ఉన్న కాపు నేతలంతా వచ్చే ఎన్నికల వరకు ఆ పార్టీలో ఉంటారు అనుకోవడం చాలా తప్పు. వారు కూటమి నుంచి వచ్చే గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఆత్మీయ సమావేశాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అని జగన్ అనుకున్నారు. కానీ జస్ట్ టైం పాస్ అని కాపు నేతలు భావిస్తున్నారు. మొత్తానికైతే జూలైలో డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందిన మరుక్షణం చాలామంది కాపు నేతలు వైసీపీకి గుడ్ బై చెప్పడం ఖాయం. అటువంటి వారంతా టిడిపి కంటే జనసేన వైపు వెళ్తారు. అలా ప్లాన్ చేస్తున్నారన్నమాట.

ఉత్తరాంధ్ర అభివృద్ధి పరుగులు

విశాఖపట్టణం : ఉత్తరాంధ్ర పై వెనుకబాటు ఒక అపవాదు ఉంది. విశాఖ జిల్లాను పక్కన పెడితే విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లా వెనుకబడి ఉన్నాయన్నది ఇప్పటివరకు ఉన్న ప్రచారం. అయితే దానికి చెక్ పడనుంది. ఉత్తరాంధ్ర అన్ని విధాల అభివృద్ధికి పునాది పడింది. వచ్చే నెలలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితం చేయనున్నారు. మరోవైపు విశాఖ తో పాటు ఉత్తరాంధ్రకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఇప్పటికే గూగుల్ డేటా సెంటర్ రాకతో.. ఐటీ అనుబంధ పరిశ్రమల చూపు విశాఖ వైపు ఉంది. కేవలం విశాఖ మాత్రమే కాదు విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లాలో కూడా ఈ పరిశ్రమల విస్తరణకు అవకాశం ఉంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనేది ఉత్తరాంధ్రకు గేమ్ చేంజర్గా నిలవనుంది. అన్ని రంగాల అభివృద్ధికి ఇది దోహదం కానుంది. పైగా సువిశాల తీర ప్రాంతం ఉత్తరాంధ్ర సొంతం. పర్యాటకంగానూ చాలా కీలక ప్రాజెక్టులు నిర్మితం కానున్నాయి ఉత్తరాంధ్రలో. కేవలం ఉత్తరాంధ్ర మాత్రమే కాదు పక్కనే ఉన్న ఒడిస్సా, చత్తీస్గఢ్ ప్రజలు సైతం భోగాపురం ఎయిర్పోర్ట్ మీదుగా రాకపోకలు సాగించనున్నారు. కచ్చితంగా ఇది విశాఖ తో పాటు ఉత్తరాంధ్రకు కలిసి వచ్చే అంశం. ఇతర రంగాల్లో కూడా అభివృద్ధి సాధిస్తే ఆదాయం భారీ స్థాయిలో సమకూరే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖ– రాయపూర్ గ్రీన్ హైవే ఈ ఏడాది అందుబాటులోకి రానుంది. ఒడిస్సా తో పాటు చత్తీస్గఢ్ వరకు 500 కిలోమీటర్ల మేర ఈ రహదారి దాదాపు నిర్మితమైంది. దీంతో ఉత్తరాది రాష్ట్రాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రధానంగా ఉత్తరాంధ్రలో తయారీ రంగ పరిశ్రమలతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు మరింత అభివృద్ధి కానున్నాయి. శ్రీకాకుళంలో కొబ్బరి జీడి ఉత్పత్తులకు జాతీయస్థాయి మార్కెట్ కలగనుంది. వీటితో పాటు అటవీ ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులకు సైతం మార్కెట్ సదుపాయం రానుంది. రవాణా మరింత మెరుగు పడనుంది. రవాణా అందుబాటులోకి రావడంతో ఔత్సాహికులు పరిశ్రమలు పెట్టేందుకు ఆసక్తి చూపుతారు. భారీగా పెట్టుబడులు కూడా పెడతారు.మరో రెండేళ్లలో గూగుల్ డేటా సెంటర్ నిర్మితం కానుంది. మరోవైపు రిలయన్స్ డేటా సెంటర్ సైతం ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ ఐటి అనుబంధ పరిశ్రమలు కేవలం విశాఖకు మాత్రమే పరిమితం కావడం లేదు.

విజయనగరం తో పాటు శ్రీకాకుళం జిల్లాలో కూడా ఇవి ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు శ్రీకాకుళం జిల్లాలో కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణం ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి.

కోస్టల్ క్యారిడార్ తో పాటు మూడో రైల్వే లైన్ నిర్మాణం కానుంది. ఇలా రవాణా పరంగా కనెక్టివిటీ పెంచుకుంటోంది ఉత్తరాంధ్ర. తద్వారా మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేయనుంది అన్నమాట.

శ్రీవాణి నిధులు షిర్డికి ఇవ్వడం లేదా

విజయవాడ : కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తుల నుంచి భారీ సంఖ్యలో విరాళాలు అందుతున్నాయి. ఈ నిధులతో వెంకన్న ఆలయాలతో పాటు ఇతరత్రా ఆలయాల నిర్మాణం, అభివృద్ధి, ఆయా ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు సమర్పిస్తున్న విరాళాలను తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి నిర్ణయం మేర కు వెచ్చిస్తున్నారు. అయితే షిరిడీ సాయి మందిరాలకు ఈ నిధులు అందడం లేదు. ఇదే విషయంపై తాజాగా వచ్చిన ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చిన ఏపీ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారా యణ రెడ్డి ట్రస్టు నిధుల విని యోగంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. శ్రీవాణి నిధులను హిందూ ధర్మశాస్త్రంలో పేర్కొన్న ఆలయాలకు మాత్రమే వెచ్చిం చాల్సి ఉంది. ఈ నిబంధన మేరకే టీటీడీ నిర్ణయం తీసుకుంటూ ఉంది. తిరుమలతో పాటు ఇతరత్రా హిందూ ఆలయాలన్నింటికీ దాదాపుగా ఈ ట్రస్టు నిధులను వెచ్చించే అవకాశం ఉంది.

అయితే షిరిడీ సాయి ఆలయాల విష యానికి వచ్చేసరికి ఈ ట్రస్టు నిధులను వెచ్చించడానికి వీల్లేని పరిస్థితులు ఉన్నాయి. ఎందుకంటే షిరిడీ సాయి ఆలయం హిందూ ధర్మశాస్త్రంలో పేర్కొనబడలేదు. హిందూ ధర్మశాస్త్రాల్లో పేర్కొన్న దేవాదిదేవుల ఆలయాల వృద్ధి కోసం మాత్రమే ఈ నిధులు వెచ్చించా లని ఓ స్పష్టమైన నిబంధన అమలు అవుతోం ది. ఇవేఅంశాలను ప్రస్తావించిన మంత్రి ఆనం అయినా శ్రీవాణి ట్రస్టు నిధుల కోసం వేచి చూసే పరిస్థితి షిరిడీ సాయి ఆలయానికి లేదని చెప్పారు. హిందూ దేవుళ్లకు కేవలం హిందువులు మాత్రమే భక్తులుగా కొనసాగుతుండగా షిరిడీ సాయికి హిందువులతో పాటుగా ఇతర మతాలకు చెందిన వారు కూడా భక్తులుగా ఉన్న విషయాన్ని మంత్రి తెలిపారు.పౌరాణిక హిందూ ధర్మశాస్త్రాలు, ఆగమ సంప్రదాయాల్లో షిర్డీ సాయికి స్థానం లేదని, శ్రీవాణి నిధులను సనాతన ధర్మ ప్రచారం, వైదిక సంప్రదాయాల పరిరక్షణ కోసమే వినియోగిస్తున్నా మని పేర్కొన్నారు. షిర్డీ సాయి ఆలయాల్లో ఆగమ శాస్త్రాల ప్రకారం పూజా విధానాలు జరగవని కూడా అభిప్రాయపడ్డారు. షిర్డీ సాయిబాబా అంశం గతంలోనూ వివాదాలకు కేంద్రబిందువైంది. సాయిబాబాను హిందూ దేవతలతో సమానంగా ఆరాధించాలా వద్దా అనే అంశంపై పీఠాధిపతులు, హిందూ మత సంస్థలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.

మరోవైపు దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు షిర్డీ సాయి బాబాను విశ్వసిస్తూ పూజిస్తుండటంతో ఈ అంశం తరచూ చర్చనీయాంశంగా మారుతోంది. ఇదిలా ఉండగా, శ్రీవాణి నిధులతో ఆలయాల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం మరింత విస్తరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు టిడ్కో కాలనీలో తొలి ఆలయ నిర్మాణాన్ని జూలైలో ప్రారంభిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ రెండేళ్ల ప్రగతి నివేదికను వివరిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా మంత్రి ప్రస్తావించారు. ధూపదీప నైవేద్య పథకం కింద అర్హత కలిగిన ఆలయాల బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెల రూ.10 వేల చొప్పున జమ చేస్తున్నామని చెప్పారు. ఆలయాల పునర్నిర్మాణం కోసం 'సర్వ శ్రేయోనిధి' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా షిరిడీ సాయి భక్తులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారి ద్వారా పోగవుతున్న విరాళాలతోనే షిరిడీ సాయి ఆలయాలు ఆశించిన దానికంటే కూడా అధికంగానే విస్తరిస్తున్నాయని తెలిపారు.

మారని ఆక్వా కంపెనీలు

భీమవరం : ఆంధ్రప్రదేశ్లో ఆక్వా సాగు సంక్షోభంలో కూరుకుపోతున్న తరుణంలో, ఆక్వా ఫీడ్ తయారీ కంపెనీలు సాగుదారులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. నిలకడలేని మార్కెట్ ధరలు, పెరిగిన పెట్టుబడులతో నష్టాల్లో ఉన్న ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చొరవకు ఫీడ్ కంపెనీలు మొండిచేయి చూపించాయి. ఫీడ్ ధరలను ఆశించిన స్థాయిలో తగ్గించకుండా కంపెనీలు తమ ఏకపక్ష వైఖరిని ప్రదర్శిస్తుండటంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ఆక్వా ఫీడ్ ధరను కిలోకు కనీసం రూ. 4 చొప్పున తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫీడ్ తయారీ కంపెనీలకు స్పష్టమైన సూచనలు చేసింది. అయితే, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. కేవలం రూ. 2 మాత్రమే తగ్గిస్తున్నట్లు పేర్కొంటూ ఫీడ్ తయారీ అసోసియేషన్లు ఒక లేఖను విడుదల చేశాయి. ప్రభుత్వ ప్రతిపాదనలో సగం మాత్రమే తగ్గించి చేతులు దులుపుకోవాలని చూడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఫీడ్ కంపెనీల ఈ మొండి వైఖరిపై ఆక్వా సాగుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు, విత్తనం ధరలు, రవాణా ఖర్చులు పెరిగిపోయి ఆక్వా సాగు భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో మేత ధరలపై కార్పొరేట్ కంపెనీలు సిండికేట్గా మారి దోపిడీ చేస్తున్నాయని, ప్రభుత్వం చెప్పిన ధర తగ్గింపును అమలు చేయకపోవడం దుర్మార్గమని ఆరోపిస్తున్నారు.

సిక్కోలులో మాధురి శీనుల సీన్..



శ్రీకాకుళం : త్తరాంధ్ర రాజకీయాల్లో , సోషల్ మీడియా వేదికలపై ఎప్పుడూ ఏదో ఒక హాట్ టాపిక్ తో హల్చల్ చేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఆయన సహచరిణి మాధురి జోడీ.. తాజాగా కొత్తూరు పోలీస్ స్టేషన్ వేదికగా మరో హైడ్రామాకు తెరలేపారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్పై గతంలో దువ్వాడ శ్రీనివాస్ చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో విచారణ నిమిత్తం పోలీసులు నోటీసులు జారీ చేయడంతో.. ఈ ఇద్దరూ కలిసి కొత్తూరు పీఎస్కు హాజరయ్యారు. అయితే, లోపల పోలీసులు దువ్వాడను గదిలో కూర్చోబెట్టి లీగల్ విచారణ జరుపుతుంటే.. బయట మాత్రం మాధురి యూట్యూబ్ ఛానళ్లు, మైకుల ముందు సినిమా రేంజ్ లో డైలాగులు కొడుతూ సీన్ క్రియేట్ చేశారు.

పోలీస్ స్టేషన్ గేటు వద్ద నిలబడి, సోషల్ మీడియా ఛానళ్ల కెమెరాలను చూస్తూ మాధురి వదిలిన పవర్ ఫుల్ డైలాగులు కొట్టారు. ఈ జిల్లాలో పోలీసులకు మరే క్రైమ్లు దొరకలేదా.. మా ఆయనే దొరికాడా? దువ్వాడ శ్రీనివాస్కి ఏమైనా అయితే నేను చూస్తూ ఊరుకోను.. మా ఆయన్ని ఇంతలా హింసిస్తున్న ఆ నా కొడుకులను అసలు వదలను! అంటూ ఆమె ఉగ్రరూపం ప్రదర్శించారు.

ఎప్పుడో పాత ఫిర్యాదును పట్టుకుని ఇప్పుడు విచారణకు రమ్మనడం వెనుక కక్షసాధింపు ఉందంటూ ఆమె అంటున్నారు. మా ఆయన చేసింది తప్పైతే, పవన్ కళ్యాణ్ చేసింది తప్పు కాదా? పవన్ కళ్యాణ్ మా నేత జగన్ని తిట్టొచ్చు.. కానీ మా శ్రీను మాత్రం పవన్ను తిట్టకూడదా అంటూ సమానత్వ సూత్రాన్ని తెరపైకి తెచ్చారు.ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని పర్యాయాలు విచారణకు పిలిచినా తాము తగ్గేదే లేదని చాలెంజ్ కూడాచేశారు. నే.. లోపల విచారణ తర్వాత పోలీసులు దువ్వాడను అరెస్ట్ చేస్తారా లేక వదిలేస్తారా అనే ఉత్కంఠను తానే స్వయంగా బిల్డప్ చేశారు. వ్యూస్ కోసం ఆరాటపడే కొన్ని సోషల్ మీడియా ఛానళ్లు ఆమె ఇచ్చిన ఈ ఎలివేషన్లను భలేగా ఎంకరేజ్ చేస్తూ లైవ్లు పెట్టడంతో కొత్తూరు పీఎస్ పరిసరాలు కాస్తా పొలిటికల్ షూటింగ్ స్పాట్ను తలపించాయి.

తెల్ల ఏనుగులా మారిన పశ్చిమాసియా యుద్ధం

వాషింగ్టన్: పశ్చిమాసియా యుద్ధం అమెరికా పాలిట తెల్లఏనుగులా మారింది. యుద్ధం కోసం అమెరికా దాదాపుగా 3.6 లక్షల కోట్లు ఖర్చు పెడుతోంది. ఇదే విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆ లోపు అయ్యే ఖర్చులను కూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67 బిలియన్ డాలర్ల అదనపు రక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈ ఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది. గాయపడిన వారిలో చాలామంది తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే, యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ మాత్రమే ఉండటంతో, నిధుల కేటాయింపు బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయపక్షాల మద్దతు తప్పనిసరి. మరోవైపు ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే కొందరు నిరసనకారులు సభకు అంతరాయం కలిగించి యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని దాడులకు సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. మరో వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినట్లుగానే ఇరాన్ పై .. యూఎస్ ఆర్మీ దాడులు ముమ్మరం చేసింది. ఇరాన్ లోని కీలక టార్గెట్లపై అమెరికా విరుచుకుపడింది. అగ్రరాజ్యం దాడులతో ఇరాన్ దద్దరిల్లింది. జోర్డాన్‌లోని తమ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ చేసిన దాడికి ప్రతిగా ఈ శక్తిమంతమైన దాడులు జరుగుతున్నాయని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. మరోవైపు.. జోర్డాన్‌లోని బేస్‌లపై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. "మేం వారిని గట్టిగా దెబ్బకొడతాం" అని ప్రకటించారు. ఆ క్రమంలోనే దక్షిణ ఇరాన్ లో శక్తిమంతమైన పేలుళ్లు వినిపిస్తున్నాయి. ఖేష్మ్ ద్వీపాన్ని, అణువిద్యుత్ కేంద్రం ఉన్న తీరనగరం బుషెహర్‌ను అమెరికా సైన్యం టార్గెట్ చేసింది. ఖేష్మ్ ద్వీపంలో నివాస ప్రాంతాలపై క్షిపణి దాడి జరిగిందని ఇరాన్ స్థానిక మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్, కమాండ్ సెంటర్‌ను టార్గెట్ చేశామని ఐఆర్‌జీసీ వెల్లడించింది. అమెరికా బెదిరింపులు కొనసాగినంత కాలం.. ఇరాన్ వైపు నుంచి ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించింది. అయితే ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను తాము అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. తాము డజన్ల కొద్దీ ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. ఇరాన్, గల్ఫ్ దేశాలకే పరిమితమైన యుద్ధం బుధవారం మరో టర్న్ తీసుకుంది. ఈజిప్ట్‌లోని దమియెట్టా పోర్ట్‌లోని అమెరికాకు చెందిన గ్యాస్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి చేసింది. దాంతో ఎల్ఎన్‌జీ లోడింగ్, ఇతర ప్రక్రియలు జరుగుతోన్న సమయంలో ఈ దాడి జరగడంతో భారీగా మంటలు ఎగిసిపడి, వేగంగా మరో ట్యాంకర్‌కు విస్తరించాయి. దాంతో అత్యవసర సహాయక బృందాలు నావికులను అక్కడి నుంచి తరలించాయి. ఇంధన నిల్వలున్న మరో దేశానికి ఘర్షణలు విస్తరించడంతో యుద్ధం తీవ్ర రూపం దాల్చుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రాత్రి పూట ఇడ్లీ బండి పెడితే జైలా?

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో రాత్రిపూట జీవనం కోసం ఇడ్లీ బండి నడుపుకున్నాడనే చిన్న కారణంతో ఓ సాధారణ వీధి వ్యాపారిపై మల్కాజిగిరి పోలీసులు తీవ్రమైన చర్యలు తీసుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. అర్ధరాత్రి వేళ టిఫిన్ బండి పెట్టుకున్నాడనే ఆరోపణలతో ఆ చిన్న వ్యాపారిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచి రెండు రోజుల జైలు శిక్ష పడేలా చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదో గొప్ప విజయమన్నట్లుగా మల్కాజిగిరి పోలీసులుసోషల్ మీడియాలో ప్రకటించుకున్నారు. కానీ విమర్శలు రావడంతో తొలగించారు. పొట్టకూటి కోసం నిజాయితీగా కష్టపడి బతికే సామాన్యులను క్రిమినల్ నేరస్థుల వలె చూస్తూ కేసులు బనాయించడం పట్ల హక్కుల సంఘాలు, ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసు యంత్రాంగం నిబంధనల పేరుతో సామాన్య వ్యాపారులను ఏ విధంగా వేధిస్తోందో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనంగా నిలిచిందన్న విమర్శలు వస్తున్నాయి. ఒక పేద వ్యాపారిని జైలుకు పంపడాన్ని ఏదో ఘనకార్యంగా సాధించినట్లుగా మల్కాజిగిరి పోలీసులు తమ అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో గర్వంగా పోస్ట్ చేయడం విశేషం. అయితే, దీనిపై నెటిజన్లు , పౌర హక్కుల సంఘాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వ్యూహం దెబ్బకు దిగిరావడంతో పోలీసులు ఆ పోస్టును డిలీట్ చేశారు. అప్పటికే ఈ ఉదంతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసుల తీరుపై నగరవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోవైపు హైదరాబాద్‌ను 24 గంటలూన నిద్రపోని గ్లోబల్ సిటీగా, నైట్ ఎకానమికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంది. నైట్ ఎకానమికి అసలు సిసలు వెన్నెముకగా నిలిచే చిన్న వ్యాపారులను, చిరుధాన్యాల బండ్ల వారిని

పోలీసులే స్వయంగా అణచివేయడం ప్రభుత్వ ఆశయాలకు గొడ్డలిపెట్టులా మారిందని అభిప్రాయపడుతున్నారు. రాత్రి వేళల్లో లక్షలాది మంది ఐటీ, బహుళజాతి కంపెనీల ఉద్యోగులు నైట్ షిఫ్ట్‌లలో పనిచేస్తుండగా, వారికి తక్కువ ధరలో వేడివేడిగా అల్పాహారం అందించే ఇలాంటి చిన్న వ్యాపారులపై ప్రతాపం చూపడం దారుణమని మండిపడుతున్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు, మాల్స్‌కు 24 గంటల వ్యాపార నిర్వహణకు అనుమతులు ఇస్తూ.. వారికి సేవలందిస్తున్న అభాగ్యులైన ఇడ్లీ, టిఫిన్ బండ్ల వ్యాపారులను మాత్రం అక్రమంగా జైలుకు పంపడం ఏమాత్రం తార్కికం కాదని నెటిజన్లు నిలదీస్తున్నారు. బడా నేరస్థులు, ఆర్థిక నేరగాళ్లను పట్టుకోవడంలో విఫలమవుతున్న కొందరు పోలీసులు, కేవలం టార్గెట్ల పేరుతో పొట్టకూటి కోసం శ్రమించే సామాన్యులపై నిబంధనల కొరడా ఝుళిపించడం మానవత్వానికే మచ్చ అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిలో అధ్వానంగా భోజనం

అమలుకాని మెనూ – పట్టించుకోని అధికారులు

కరీంనగర్ : నిరుపేదలు, అల్పాదాయ వర్గాలకు మెరుగైన వైద్య సేవలతో పాటు వారు త్వరగా కోలుకునేందుకు ఉచితంగా నాణ్యమైన పోషక విలువలతో కూడిన అల్పాహారం ఆహారం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది. మెరుగైన వైద్య సేవలు అటుంచి మేలు కలిగించే సరైన ఆహారం కూడా అందడం లేదని రోగులు వారి బంధువులు వాపోతున్నారు. ఇన్‌పేషంట్లకు ఆహారం అందించే బాధ్యతను కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అప్పగించారు. వాటి పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఆసుపత్రిలో భోజనం అధ్వానంగా మారాయనే విమర్శలు వస్తున్నాయి.

500 పడకలు... జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారంపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడంతో పాటు నిర్ణీత మెనూను పాటించడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 350 పడకలతోపాటు మాతా శిశు సంరక్షణ సెంటర్‌లో 150 పడకలు ఉంటాయి. ఐదు వందల మంది ఈ ఆసుపత్రిలో ఇన్ పేషంట్లుగా ఉంటారు. ఒక్కోసారి ఇన్‌పేషంట్ల సంఖ్య 750 నుంచి 800కు పెరుగుతూ ఉంటుంది. ఇన్ పేషంట్లకు ప్రభుత్వం ఉదయం పూట అల్పాహారం టీ పాలు, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని ఉచితంగా సమకూరుస్తుంది. మెనూ ప్రకారం అల్పాహారంగా ఒక రోజు ఇడ్లీ, ఒక రోజు ఉప్మా, పొంగల్, కిచిడి, బ్రెడ్డు అందించాల్సి ఉంటుంది. టిఫిన్‌తోపాటు పాలు, టీ కూడా ఇస్తారు. మధ్యాహ్న భోజనంలో అన్నంతోపాటు ఒక కూర, పాలకూర పప్పు, సాంబారు, అరటి పండు ఇవ్వాల్సి ఉంటుంది. రాత్రి పూట అన్నం లేదా డాక్టర్ల సూచన మేరకు కొందరికి చపాతి ఇవ్వాలి. వీటితో పాటు కూర పాలకూర పప్పు, సాంబారు మెనుగా ఉంటుంది. మూడు పూటలా బాయిల్డ్ ఎగ్ ఇవ్వాలి. ఆస్పత్రిలో మాత శిశు సంరక్షణ కేంద్రంలో ఇదే మెనూను పాటించాలి. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అదనంగా తల్లులకు పల్లిపట్టీ ఇవ్వాలి. ఈ మెనూను రోగులకు అందించడానికి ఒక్కో పేషంట్‌కు రోజుకు 72 రూపాయల చొప్పున కాంట్రాక్ట్ ఏజెన్సీకి చెల్లిస్తారు. గర్భిణులకు, టీబీ పేషంట్లకు, రక్తం తక్కువగా ఉన్న వారికి హై ప్రోటీన్ డైట్ అందించాల్సి ఉంటుంది. ఇందుకు భోజన ఛార్జీలుగా 112 రూపాయలు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తారు. జిల్లాకేంద్ర ఆసుపత్రికి ఆహారం సరాఫరా చేసి కాంట్రాక్ట్ ఏజెన్సీ నాణ్యత విషయంలో, మెనూ పాటించే విషయంలో నిబంధనలు పాటించడం లేదని రోగులు వారి బంధువులు ఆరోపిస్తున్నారు.

అల్పాహారంగా ప్రతీ రోజు దొడ్డు రవ్వ ఉప్మానే.. అల్పాహారంగా రోజుకు ఒకటి చొప్పున ఐదు రకాల టిఫిన్లను అందించాల్సి ఉండగా, ప్రతీరోజు దొడ్డు రవ్వ ఉప్మానే రోగులకు ఇస్తున్నారు. మూడు పూటలా బాయిల్డ్ ఎగ్ ఇవ్వాల్సి ఉండగా వాటిని ఇవ్వడం లేదు. అల్పాహారంతో ఇచ్చే పాలు పలుచగా, తక్కువగా ఇస్తున్నారని రోగులు విమర్శిస్తున్నారు. భోజనంతోపాటు ఇవ్వాల్సిన అరిటి పండును గర్భిణులకు మాత్రమే ఇస్తున్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తల్లులకు, గర్భిణులకు పల్లీ పట్టిని కూడా ఇవ్వడం లేదు. అల్పాహారం, భోజనం అందించే విషయంలో సమయ పాలన కూడా పాటించడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేని ఆహారం, సరైన సమయంలో ఇవ్వకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వారి వెంట ఉన్న బంధువులు లయన్స్ క్లబ్ వారు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రతి రోజు ఉచితంగా అందించే అల్పాహారాన్ని తెచ్చుకుంటు న్నారు. మధ్యాహ్నం, రాత్రి స్వచ్ఛంద సంస్థలు సమకూర్చే భోజనం తెచ్చుకుంటున్నారు.

రేపల్లెవాడలో సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సు

తాండూర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే కార్యక్రమంపై గ్రామస్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో సర్పంచ్ ఆకుల వెంకటేష్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. భూముల రికార్డులను పారదర్శకంగా రూపొందించి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా ఏ.డి. శ్రీనివాస్, తాండూర్ మండల తహసీల్దార్ జ్యోత్స్న, ఆర్ఐ మురళి, సబ్ సర్వేయర్ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే రైతులకు ఎంతో ప్రయోజనకరమని వివరించారు. సర్వే సమయంలో ప్రతి రైతు తమ భూమికి సంబంధించిన పాత పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర భూ రికార్డులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి రైతు సమగ్ర భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలో ఎలాంటి భూ వివాదాలు లేకుండా అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించేందుకు గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ మాట్లాడుతూ భూమి రైతుకు అత్యంత విలువైన ఆస్తి అని, ప్రభుత్వ సర్వే ద్వారా భవిష్యత్ తరాలకు స్పష్టమైన భూ హక్కులు లభించే అవకాశం ఉందన్నారు. అందుకే ప్రతి రైతు బాధ్యతగా ఈ కార్యక్రమంలో పాల్గొని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారులను ప్రశ్నలు అడిగి సమగ్ర భూ సర్వేపై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

సున్నిపెంటలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన

శ్రీశైలం : శ్రీశైలం ప్రాజెక్టులో ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. 'వన్ మంత్ – ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంట రెడ్డివారి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌లు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ప్రతి అర్జీని స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ×ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకొని వేగవంతంగా పరిష్కరించడమే 'వన్ మంత్ – ఫోర్ విజిట్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరు, మహానంది, వెలుగోడు మండలాలలో 900కు పైగా అర్జీలు స్వీకరించామని, వాటిలో అత్యధికంగా రెవెన్యూ, సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి అర్జీపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య వాస్తవ పరిస్థితిని తెలుసుకున్న అనంతరమే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారమైన వెంటనే సంబంధిత ఉత్తర్వులు లేదా చర్యల ప్రతిని అర్జీదారునికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వీకరించిన అన్ని వినతులను కలెక్టరేట్ బృందం డిజిటలైజ్ చేసి వెంటనే సంబంధిత శాఖలకు పంపించి నిరంతర పర్యవేక్షణ చేపడుతుందని తెలిపారు. సున్నిపెంట ప్రాంతంలో అధికంగా ఇళ్ల స్థలాలు, గృహాలు, పెన్షన్లు, విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, ప్రాథమిక వసతులకు సంబంధించిన సమస్యలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను అర్హతల మేరకు పరిశీలించి, స్థలం మాత్రమే కోరిన వారి వివరాలను వేరుగా నమోదు చేయాలని, ఇల్లు మరియు స్థలం రెండూ అవసరమై న వారి ప్రతిపాదనలను ఆర్డీఓకు పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సున్నిపెంటలో కొన్ని ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు ఇళ్లకు ఒకే విద్యుత్ మీటర్ ఉండటం వల్ల పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కోల్పోతున్నాయని వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, గతంలో కేటాయించిన గృహాల జాబితాను పరిశీలి ంచి ప్రతి ఇంటికి ప్రత్యేక విద్యుత్ మీటర్, విద్యుత్ కనెక్షన్ కల్పించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెస్టర్న్ కాలనీతో పాటు ఇతర కాలనీల్లో వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కొరత ఉందని ప్రజలు తెలియజేశారని, సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అడవి మృగాల సంచారం దృష్ట్యా వీధి దీపాల ఏర్పాటు అత్యవసరమని పేర్కొంటూ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వ యంతో అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని ఆదేశించా రు. సున్నిపెంట తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.15 కోట్ల వరకు నిధులు మంజూరు చేసిందని, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్లు, మోటార్లు, ప్రత్యామ్నాయ నీటి వనరులను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రోడ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రెయినేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొంటూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యా మ్నాయ కార్యాచరణ రూపొందించి డ్రెయినేజీ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల ద్వారా ఇప్పటికే అనేక మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని, త్వరలో సున్నిపెంట ప్రాంత యువతకు ఉపయోగపడేలా మరో భారీ ఉద్యోగ మేళా నిర్వహించి సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఆదేశించారు.

దేవనకొండ ఎస్సీ కాలనీ కి అభివృద్ధి కరువాయే...

దేవనకొండ : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమస్యలకు నిలయంగా మారిందని రోడ్లు, డ్రైనేజీ అధ్వానంగా ఉన్నాయని విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయని వాటి పరిష్కారానికి వెంటనే అధికారులు కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక గ్రామపంచాయతీ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ సమస్యల పరిష్కారం కోసం డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు వై మహేంద్ర అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి ముకెళ్ళ అశోక్ లు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఎనిమిది పదులు కావస్తున్న నేటికీ దళిత వాడలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయని సరైన మౌలిక సదుపాయాలు లేక అక్కడ నివాసం ఉంటున్న వారు చాలా ఇబ్బందులు గురవుతున్నారు వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనందు చర్చి దగ్గర నుండి కొత్త కాలనీ వైపు ప్రధాన రోడ్డు ఏప్పుడు కృంగి పోతుందోనని అక్కడ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మట్టి కోసం తవ్విన గుంత విపరీతంగా పెద్దదై పది అడుగుల్లోతుకు పైగా ఉంటుందని ఇక్కడ ప్రమాదం జరిగితే తీవ్ర నష్టం జరుగుతుందని వారు పేర్కొన్నారు. వెంటనే ప్రధాన రోడ్డు నిర్మాణం చేపట్టాలని మరియు డ్రైనేజ్ ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ ఆవాసాలలో ఎలాంటి మౌలిక వసతుల కోసం ఎలాంటి ఖర్చుకైనా వెనకాడమని చెబుతున్న ప్రభుత్వం ఇక్కడ సిసి రోడ్లు వేయడంలో విఫలమవుతుందని పేర్కొన్నారు కాలనీలో సీ సీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని డ్రైనేజీ కాలువల నిర్మాణం వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు విద్యుత్ స్తంభాలు కూలిపోవడానికి దాదాపు పది ,పన్నెండు సిద్ధంగా ఉన్నాయని విద్యుత్ శాఖ వారిని పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారి కోరారు అనేక మంది విద్యాధికులు ఉన్న ఎస్సీ కాల నందు లైబ్రరీ పునరుద్ధరణ చేయాలని సొంత నిధులతో కాలనీవాసు నిర్మించుకుంటున్న కమ్యూనిటీ భవనంకు నిధుల కొరతతో మధ్యలోనే ఆపేశారని కమ్యూనిటీ భవనంకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అదేవిధంగా ప్రహరీ గోడ నిర్మించాలని కాలనీకి మరొక అంగన్వాడి కేంద్రం ఆశా వర్కర్ ను కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు యూసుఫ్ భాష, పాండురంగడు , కే.బీ నాగేంద్ర, మహేష్, బలరాముడు, మధు, వీర బద్రి,రంగస్వామి, ముకెళ్ల పరశురాముడు. యం.నాగేంద్ర, కొత్త పల్లి అశోక్ కాలనీవాసులు పాల్గొన్నారు

ఏపీలో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల

విజయవాడ :ఏపీలో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ అనంతరం దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది.

మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జూలై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు.

అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.

అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం-6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు.

తిరుపతి జిల్లా ముసాయిదా ఓటరు జాబితా విడుదల

తిరుపతి : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్)–2026లో భాగంగా తిరుపతి జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్. వెంకటేశ్వర్‌విడుదల చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 14,81,603 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 7,20,329 మంది పురుషులు, 7,61,188 మంది మహిళలు, 86 మంది థర్డ్ జెండర్లు ఉన్నారని తెలిపారు. ఇంటింటి ధృవీకరణలో గైర్హాజరైనవారు, మరణించినవారు, డూప్లికేట్ నమోదుల వంటి 2,87,826 కేసులను ప్రత్యేకంగా గుర్తించామని స్పష్టం చేశారు.?జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, సెప్టెంబర్‌లో విచారణ పూర్తి చేసి అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని చెప్పారు. జూలై 1, 2026 నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారు ఫారం–6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు కావాలని, మార్పులు–చేర్పుల కోసం ఫారం–8 ఉపయోగించుకోవాలని సూచించారు.

నక్కల కాలువ వంతెనను కాపాడండి

శ్రీకాళహస్తి : నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణానికి ముఖద్వారం అయినటువంటి పానగల్ వద్ద గల నక్కల కాలువ వంతెన దగ్గర గతంలో మున్సిపాలిటీ వారు మురుగునీటి కాలువను నిర్మించడం వల్ల వర్షాకాలంలో వరద నీరు ఉధృతంగా ప్రవహించడం ద్వారా వంతెన రిటైనింగ్ వాల్ దెబ్బతిని వంతెన మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, రాబోవు వర్షాకాలంలో వరదనీరు వల్ల పెను ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గారికి కాంగ్రెస్ పార్టీ తరఫున వినతిపత్రం అందజేయడం జరిగినది. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ గారు సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలను జారీ చేశారని, శ్రీకాళహస్తి నక్కల కాలం వద్ద నూతనంగా కాలువ నిర్మాణం చేపట్టి ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగూరయ్యా, ముని కృష్ణయ్య, చందు, నాగరాజు,అరుణ్, చరణ్, జోసెఫ్,సారధి,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపలు పట్టడానికి అవకాశం కల్పించండి

చిట్వేలి : జిల్లాలో అతి పెద్ద యలమరాజు చెరువులో చేపలు పట్టుకోవడానికి గిరిజనులమైన మాకు అవకాశం కల్పించాలని చెరువు ఆయకట్టు గ్రామాల గిరిజనులు జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నాగయ్యకు వినతి పత్రం సమర్పించారు. టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ సలహా మేరకు జనసేన రాయలసీమ అధ్యక్షుడు జోగినేని మణి, చిట్వేలి మండల జనసేన నాయకుడు ఆనాల సునీల్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మత్స్య శాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమరాజు చెరువు లో చేపలు పట్టడానికి ఒకే సహకార సంఘానికి ప్రభుత్వం హక్కులు కల్పించడంతో గిరిజనులమైన మేము చేపలు పట్టడానికి అవకాశం లేక జీవన ఉపాధి కోల్పోతున్నామని అన్నారు. ప్రభుత్వ చట్టాల మేరకు దాదాపు 450 హెక్టర్ల విస్తీర్ణం కలిగిన చెరువులో చేపలు పట్టడానికి హెక్టారుకు ఒకరు చొప్పున 450 మంది సహకార సంఘంలో సభ్యులుగా చేరవచ్చు అని అన్నారు. కావున అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గిరిజనులమైన మమ్ములను సొసైటీలో సభ్యులుగా చేర్చి చేపల పట్టుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నాగయ్య మాట్లాడుతూ చెరువులో చేపలు పట్టే సమస్య తీరేవరకు ఎవరూ చెరువులోకి దిగకుండా చిట్వేలి మండల రెవెన్యూ అధికారి, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్, సహకార సంఘానికి నోటీసులు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదినేని కనక రాజ, మాదినేని రాజా, పగడాల వెంకటేష్, పగడాల శివ శంకర పాల్గొన్నారు.

విద్యార్థుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

సూర్యాపేట : జాతీయ బీసీ సంక్షేమ యువజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అయితే ప్రభుత్వం ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందకపోవడంతో అనేక ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని, ప్రభుత్వానికి తమ సమస్యలను వివరించినా వారిపైనే ఒత్తిడి, బెదిరింపులు కొనసాగుతున్నాయని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ, ఎన్నో కష్టాలు పడి తమ పిల్లలను చదివిస్తున్నారని తెలిపారు. అలాంటి సమయంలో కళాశాలలు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడటానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధీనంలోనే ఉన్నప్పటికీ, విద్యార్థులు తమ హక్కుల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. విద్యా ప్రమాణాలను పెంచాల్సిన ప్రభుత్వం, విద్యార్థులు మరియు విద్యా వ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బొల్లం మల్లయ్య యాదవ్, విద్యార్థులను క్రిమినల్ వేస్టులు అని సంబోధించడం అత్యంత బాధ్యతారాహిత్యమైనదని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు తెలంగాణ యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, ఇది ముఖ్యమంత్రి అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.చదువుకొని పట్టభద్రులైన యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఉద్యోగాల కోసం ప్రశ్నించిన యువతను కించపరిచేలా మాట్లాడడం తగదని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే వెనక్కి తీసుకోవాలని, రాష్ట్ర విద్యార్థులకు మరియు యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆదివాసి చిన్నారులకు అఖండ యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్ట్ చేయూత

43 మంది చిన్నారులకు నూతన దుస్తుల పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం:అఖండ యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పినపాక మండలం బోటిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని విప్పల గుంపు ఆదివాసి గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 43 మంది ఆదివాసి చిన్నారులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, మారుమూల ఆదివాసి ప్రాంతాల్లోని చిన్నారులకు అవసరమైన సహాయాన్ని అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అఖండ యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు కట్ల నరేష్, నాని బాబు, కె. నాగేశ్వరరావు, ఆకుల వెంకటేష్, సైదా నాయుడు, విప్పల గుంపు గ్రామ పెద్దలు నరసయ్య, మడకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిడిల్ క్లాసు కష్టాలు

హైదరాబాద్ : ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జీవించే మిడిల్ క్లాస్ వాళ్లకు ప్రతిరోజు ఒక పజిల్ మాదిరిగానే ఉంటుంది. అక్కడ జీవించే మిడిల్ క్లాస్ ప్రజల కష్టాల మీద ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. ఈఎంఐ.. కిరాయిలు.. కుటుంబ ఖర్చులు.. వీటన్నింటికీ జీతం సరిపోక కనీసం మటన్ కూడా కొనుగోలు చేయడం కష్టమవుతుంది. జీవితంలో ఎటువంటి ఎదుగుదల లేకుండా.. పెళ్లి జరిగిన తర్వాత.. పిల్లలు పుట్టిన తర్వాత.. వారి బాధ్యతలతోనే జీవితం సంకనాకి పోతుందని.. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి చెప్పాడు.

ఈ వీడియోను చాలామంది తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. తమది కూడా ఇటువంటి దుస్థితేనని వాపోతున్నారు. మా మనసులో ఉన్న బాధను మొత్తం వ్యక్తం చేశావని చాలామంది కామెంట్లు చేస్తున్నారు.గతంతో పోల్చి చూస్తే హైదరాబాద్ నగరంలో మిడిల్ క్లాస్ వల్ల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. అన్ని ఖర్చులు పెరిగిపోవడం.. వాటికి తగ్గట్టుగా వేతనాలు పెరగపోవడంతో చాలామంది ఆర్థికంగా కష్టాలు పడుతూనే ఉన్నారు. పెళ్లి.. పిల్లలు.. బాధ్యతలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటాయి కాబట్టి.. చాలామంది కష్టాలను పంటి కింద భరిస్తూ.. తమ ఇబ్బందులను తిట్టుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటారు. ఎందుకంటే అంతకుమించి చేయడానికి మిడిల్ క్లాస్ వాళ్లకు అవకాశం లేదు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందని ప్రియురాలి దారుణ హత్య

సూట్‌కేస్‌లో మృతదేహం పెట్టి ఒడిశా అడవుల్లో పడేసిన కారు డ్రైవర్

విశాఖపట్నం: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందనే నెపంతో ఒక కారు డ్రైవర్ తన ప్రియురాలిని దారుణంగా హత్య చేసిన ఉదంతం కలకలం రేపింది మృత దేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి, ఎవరికీ తెలియకుండా పక్క రాష్ట్రమైన ఒడిశాకు తరలించి అడవుల్లో పడేసిన ఘాతుకానికి పాల్పడ్డాడు.పెళ్లి ప్రస్తావన తేవడమే పాపమైంది పోలీసుల కథనం ప్రకారం కంచరపాలెం దుర్గానగర్‌కు చెందిన బొలిశెట్టి సురేష్ కుమార్ (32) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి పెందుర్తికి చెందిన సంధ్య (20) అనే యువతితో పరిచయం ఏర్పడింది అది కాస్తా వివాహేతర శారీరక సంబంధానికి దారితీసింది. అయితే గత నెల 15వ తేదీన సంధ్య తనను పెళ్లి చేసుకోవాలని సురేష్‌ను కోరింది. దీంతో ఆగ్రహానికి గురైన సురేష్ కుమార్ ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు సూట్‌కేస్‌లో మృతదేహం రైలులో ఒడిశాకు రవాణాహత్య అనంతరం నిందితుడు జగదాంబ సెంటర్‌లో ఒక పెద్ద సూట్‌కేస్‌ను కొనుగోలు చేశాడు సంధ్య మృత దేహాన్ని ఆ సూట్‌కేస్‌లో కుక్కాడు. ఆపై రైలు మార్గంలో ఒడిశాలోని రాయగడ (జేకే పూర్) పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ పడేశాడు ఏమీ తెలియ నట్టు మళ్లీ నగరానికి తిరిగి వచ్చాడు.

దుర్గంధంతో వెలుగులోకి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా అరెస్ట్ అటవీ ప్రాంతంలో ఉన్న ఆ సూట్‌కేస్ నుంచి తీవ్రమైన దుర్గంధం రావడాన్ని గమనిం చిన ఒడిశా పోలీసులు రంగంలోకి దిగారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు రైల్వే స్టేషన్లు,పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణం గా పరిశీలించగా సురేష్ కుమార్ గుట్టు రద్దయింది వెంటనే ఒడిశా పోలీసులు విశాఖపట్నం పోలీసుల సహకారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన భార్య తో ఎలాంటి గొడవలు లేకుండా సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతోనే, పెళ్లి చేసుకోమని ఒత్తిడి తెస్తున్న సంధ్యను హత్య చేసినట్లు సురేష్ పోలీసుల ఎదుట నేరాన్ని అంగీ కరించాడు. దీంతో ఒడిశా పోలీసులు నిందితుడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై రాయగడ కోర్టుకు తరలించారు.

కమలం కొత్త వ్యూహం

హైదరాబాద్ : తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మార్చింది. కేంద్ర నాయకత్వం తలంటడంతో ఇప్పుడు తెలంగాణ కమలం పార్టీ నేతలు యాక్టివ్ అయ్యారు. సోషల్ మీడియాలో తెలంగాణ నాయకులు వెనకబడి ఉండటాన్ని కేంద్ర నాయకత్వంతో పాటు రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జులు కూడా తప్పుపట్టారు. డిజిటల్ యుగం నడుస్తున్న సమయంలో ఇలా వెనకబడి ఉంటే పార్టీ ఎలా ఎదుగుతుందని ప్రశ్నించారు. ఇకపై రీల్స్ చేయడం, మీమ్స్ వంటి వాటితో ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నించాలని, తెలంగాణలోని ప్రతి ఒక్క బీజేపీ నేతల సోషల్ మీడియాలో యాక్టివ్ కావాలని, వారి ఫాలోయిర్స్ సంఖ్య పెరగాలని ఆదేశాలు జారీచేసింది.తెలంగాణ ప్రభుత్వం. ఇటీవల సోషల్ మీడియా వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఎన్ని మిలియన్ల మందికి దగ్గరయిందో గుర్తుకు తెచ్చుకోవాలని రాష్ట్ర నేతలకు బీజేపీ కేంద్ర నాయకత్వం క్లాస్ పీకింది. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల విధానాలపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ దూకుడు పెంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, వ్యూహాత్మక పోస్టలతో ట్రెండింగ్ సృష్టించడం మరియు డిజిటల్ క్యాంపెయిన్ల ద్వారా కేడర్‌లో జోష్ నింపడం వంటి అంశాలపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది. ఇందుకోసం ప్రతి నేత సోషల్ మీడియాను హ్యాండిల్ చేసేందుకు సిబ్బందిని కూడా నియమించుకున్నారని తెలిసింది. తమ పర్యటనలతో పాటు ప్రభుత్వంపై విమర్శలు కూడా ఇందులో చోటు చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వ్యూహాలతోనే అధికారంలోకి రాగలమని బీజేపీ కేంద్ర నాయకత్వం నమ్ముతుంది. దేశంలో, రాష్ట్రంలోసోషల్ మీడియా వినియోగం పెరిగిపోవడంతో దానిని అందిపుచ్చుకుని వెళితే తప్ప అధికారానికి దగ్గరకు కాలేమని పదే పదే చెప్పిన మాటలు కమలనాధులకు ఇప్పటికి చెవికి ఎక్కినట్లున్నాయి. ప్రభుత్వంపై విమర్శలతో పాటు కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పాలనా విధానాలను, నిర్ణయాలను నిరసిస్తూ నిరంతరం డిజిటల్ అస్త్రాలు సంధిస్తున్నారురాష్ట్ర ప్రభుత్వ హామీలు, ప్రజా సమస్యలపై ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తిస్తున్నారు.రాష్ట్ర నాయకులు సైతం ఆన్‌లైన్ చర్చల్లో పాల్గొంటూ కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. మొత్తం మీద తెలంగాణ బీజేపీలో పెద్ద మార్పు వచ్చినట్లుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

క్యూర్ కు 28 శాతం మార్కులే

హైదరాబాద్ : 70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది.హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది.నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిల్‌ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు.

నగర పరిపాలనా వ్యవస్థను నిరంతరం జవాబుదారీగా ఉంచేందుకు స్వతంత్ర పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ (ఎంపీసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డీఏ), ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అత్యున్నత పాలనా మండలి విధుల మధ్య ఎలాంటి పునరావృతం లేకుండా స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.బృహత్తర నగరాల నిర్వహణలో భారత దేశంలోనే హైదరాబాద్ ఒక ఉందని జనాగ్రహ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ విశ్వనాథన్ అభిప్రాయ పడ్డారు.

భర్త బెట్టింగ్ వ్యసనం.. సాఫ్ట్వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

కుప్పం : నెల్లూరు జిల్లా చేజర్ల మండలం ఆదూరుపల్లికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజినీర్ చీరల రాధ అర్ధరాత్రి కుప్పం రైల్వే స్టేషన్లో విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న ఆమె భర్త బెట్టింగ్కు బానిసై రూ.లక్షలు నష్టపోవడంతో కుటుంబంలో తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పులు తీర్చేందుకు పుట్టింటివారు రూ.40 లక్షలు సాయం చేసినా భర్తలో మార్పు రాలేదు. దీంతో సమస్యను పెద్దలతో చర్చించేందుకు బెంగళూరు నుంచి వస్తున్న సమయంలో ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంది. ఆమె బ్యాగులో సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వివాదస్పదమయిన సీఐ తన్నుడు

హిందూపురం: హిందూపురం సీఐ రాజగోపాల్ నాయుడు వివాదంలో చిక్కుకున్నారు. బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణపై దురుసు ప్రవర్తన ఆందోళనకు దారి తీసింది. శివరామకృష్ణను హిందూపురం సీఐ రాజగోపాల్ నాయుడు బూతులు తిడుతూ... బూటుకాలితో తన్నటం సీసీ కెమెరాల్లో రికార్డయింది. హిందూపురం మాతృశ్రీ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ధర్నా చేపట్టిన హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణపై సీఐ విరుచుకపడ్డారు. సీఐ రాజగోపాల్ నాయుడును సస్పెండ్ చేయాలని కోరుతూ పుట్టపర్తి ఎస్పీ కార్యాలయం వద్ద దళిత సంఘాలు నిరసనకు దిగాయి.

మహిళా ఎస్ఐపై దాడి చేసిన వైసీపీ నేతలపై నాన్–బెయిలబుల్ కేసులు

శ్రీకాకుళం : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రదర్శించిన హంగామా, అరాచక ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు అత్యంత సీరియస్‌గా స్పందించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శ ముసుగులో విధి నిర్వహణలో ఉన్న బూర్జ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ ఎం. ప్రవల్లికపై ఆమదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్, ఆయన అనుచరులు తీవ్ర దుర్భాషలాడుతూ, వికృతంగా ప్రవర్తిస్తూ భౌతిక దాడికి దిగడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. మహిళా అధికారి అని కూడా చూడకుండా చుట్టుముట్టి తోసివేయడం, అడ్డుకోబోయిన సీఐ సన్యాసి నాయుడితో పాటు ఇతర కానిస్టేబుళ్లపై దాడి చేసి గాయపరచడాన్ని హోంశాఖ, పోలీస్ బాస్ తీవ్రంగా పరిగణించారు.రాజకీయ పర్యటనల నెపంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, పోలీస్ వ్యవస్థపైనే దాడులకు తెగబడే అల్లరిమూకలను ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారుల స్థానంలో ఉన్న మహిళా పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించడం, చట్టబద్ధమైన విధులకు భంగం కలిగించడం, కుట్రపూరితంగా గుమిగూడి దాడులకు పాల్పడటం వంటి తీవ్రమైన నేరాల ఆధారంగా శ్రీకాకుళం జిల్లా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. ఈ దారుణానికి పాల్పడిన నిందితులందరిపై నాన్–బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలను వేగవంతం చేశారు.

ఈ అరాచక ఘటనకు బాధ్యులైన ప్రధాన సూత్రధారులు, పాత్రధారులను అరెస్ట్ చేయడానికి శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించారు. సంఘటనా స్థలంలో నమోదైన సీసీటీవీ దృశ్యాలు, విజువల్ మీడియా కెమెరా ఫుటేజీలు మరియు సోషల్ మీడియా రీల్స్‌లోని డిజిటల్ ఆధారాలను ప్రత్యేక విభాగం జల్లెడ పడుతోంది. ముఖ్యంగా ప్రధాని, సీఎంల పర్యటనల ముందు పోలీసులు అనేక ఆంక్షలు పెట్టినప్పటికీ సెక్యూరిటీ బందోబస్తు ప్రోటోకాల్స్‌ను ఉల్లంఘిస్తూ, మహిళా అధికారిపైకి రౌడీల్లా దూసుకెళ్లిన ప్రవర్తన ఆధారంగా ప్రతి ఒక్కరినీ స్పష్టంగా గుర్తించి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.మహిళా అధికారిపై జరిగిన ఈ భౌతిక దాడి ఉదంతంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సుమోటోగా కేసు స్వీకరించి పోలీసుల నుంచి సమగ్ర నివేదిక కోరారు.

భారీ వర్షాల బీభత్సం.. కుప్పకూలిన ఇల్లు

తాండూర్; ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తాండూర్ మండలంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జాల గ్రామానికి చెందిన మడవి బుచ్చిరావు నివాస గృహం శుక్రవారం తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అప్రమత్తంగా బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లోని సామాన్లు, ధాన్యం, గృహోపకరణాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు.బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకున్న స్థానిక నాయకులు, గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు, ఉపసర్పంచ్ పర్వాత్ రావు, నాయకులు మడవి మాణిక్‌రావు, భగవంత్‌రావు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.భారీ వర్షాలతో గ్రామ పరిసరాల్లోని వాగులు, వంకలు ఉప్పొంగిపోవడంతో రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ కారణంగా రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల అధికారులు వెంటనే గ్రామానికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి సాధారణమైన వెంటనే నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.గ్రామంలో కురుస్తున్న నిరంతర వర్షాలతో మరికొన్ని పాత ఇళ్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి ప్రమాదకర గృహాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ ప్రజలకు అందుబాటులో ఫ్యామిలీ సర్టిఫికెట్

హైదరాబాద్ : ప్రజా సౌకర్యమే లక్ష్యంగా మన ఇందిరమ్మ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను ఏ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థకైనా లేదా వ్యవస్థకైనా సులభంగా, అధికారికంగా అందించేందుకు వీలుగా 'ఫ్యామిలీ సర్టిఫికెట్' ను అందుబాటులోకి తీసుకొచ్చాం. జలు తమ పరిధిలోని మీ–సేవ కేంద్రాలు లేదా తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లి సులభంగా ఈ సర్టిఫికెట్ ను పొందవచ్చని అయన అన్నారు. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ తదితర పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాల సమాచారంతో కూడిన ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అయన అన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పొడిగింపు

నవంబరు 30 వరకు రుసుముపై 25 శాతం రాయితీ అమలు

పురపాలక శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్: లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుదారులు 25% రాయితీతో ఫీజు చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రాయితీ అమలు గడువును ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు నాలుగు నెలల పాటు పొడిగించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పురపాలక శాఖ జారీ చేసింది. అక్రమ లేఅవుట్ నిబంధనలు 2020 కింద లేఅవుట్ క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారంతా ఈ రాయితీని సద్వినియోగం చేసుకోవచ్చు. రాయితీ అమలుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీరాజ్ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, టౌన్ ప్లానింగ్ విభాగం, రాష్ట్రంలోని అన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ కింద రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 20లక్షల మంది దరఖాస్తుదారులకు ఫీజు చెల్లింపునకు సంబంధించి లేఖలు పంపారు.

మండలి కోసం వడపోతలు షురూ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పండుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ (ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. అందుకే తుది ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.శాసన మండలిలో ఖాళీ అయిన.. రెండు స్థానాలను భర్తీ చేసే విషయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మౌనంగా ఉన్నారు. ఈ రెండు సీట్లు కూడా గవర్నర్ కోటాలో భర్తీ చేసేవే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి సర్కారుకు గవర్నర్ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి పెద్దగా ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. దీంతో ఎవరిని ఎంపిక చేసినా ఇట్టే వారు మండలిలో కూర్చుంటారు. దీంతో నాయకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. గతంలో తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపిక వివాదం అయింది. సుప్రీంకోర్టు వరకు సాగింది.

అయితే.. ఇలాంటి వివాదాలు ఏపీలో కనిపించడం లేదు. దీంతో బాబు నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉంది. ఇది నాయకుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. తాజాగా సీనియర్ నాయకులతో సచివాలయంలో చంద్రబాబు భేటీ అయినా.. ఈ విషయంపై ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇది మరింతగా నాయకుల్లో టెన్షన్ పెంచుతోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నిక ల సమయంలోనూ టీడీపీ కోటాలో ఎంపిక చేసేవారి పేర్లను ఇంతే గోప్యంగా ఉంచారు. ఫలితంగా ఆశలు పెట్టుకున్నవారు.. చివరి వరకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎంపిక ప్రక్రియ అయిపోయిన తర్వాత..ఆశలు పెట్టుకున్న అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా బాబు బాంబు పేలుస్తారా? అనేది చర్చకు దారితీసింది. అలా వద్దని.. సడెన్‌గా పేర్లను వెల్లడిస్తే.. కేడర్‌లో చులకన అవుతున్నామని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని, అయితే.. ఆ నిర్ణయమేదో సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే.. కేడర్‌ను సంతృప్తి పరిచేందుకు.. తమ ఫ్యామిలీలను సంతృప్త పరిచేందుకు కూడా అవకాశం ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఈ విషయంపై టీడీపీలో చర్చ సాగుతోంది. కొందరు నాయకులు వస్తుందో రాదో అన్న బెంగతో తరచుగా ఫోన్లు కూడా చేస్తున్నారు. మరి చంద్రబాబు ఎ వరిని కరుణిస్తారో చూడాలి. ఏదేమైనా సడెన్‌గా కాకుండా ముందుగానే ప్రకటించాలని నాయకులు కోరుతున్నారు.

రంగంలోకి రోజా

తిరుపతి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక కొత్త పరిణామం పార్టీ శ్రేణులకు గందరగోళపరుస్తోంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ఒక కుదుపు. మాజీ మంత్రి ఆర్కే రోజా మళ్లీ యాక్టివ్ కావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. ఆమె సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఆమెను పక్కనపెట్టి బీసీ నేతకు అవకాశం ఇస్తారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. ఈ విషయంపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. నగిరి నియోజకవర్గంలో రోజా అభ్యర్థిత్వం మార్పు చేయాలని ఆయన కోరుతూ వచ్చారు. ఎందుకంటే రోజా ఉంటే పెద్దిరెడ్డికి ఇబ్బందికరమే. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీనియర్ మంత్రిగా పెద్దిరెడ్డి ఉంటారు. అదే జిల్లాలో రోజా మంత్రిగా ఉంటే తనకు ఇబ్బందికరమని పెద్దిరెడ్డికి తెలుసు. అందుకే మొన్నటి ఎన్నికల్లో రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు పెద్దిరెడ్డి. కానీ జగన్ చివరి నిమిషంలో ఆమెకు చాన్స్ ఇచ్చారు. ఈసారి ఆమెను తప్పిస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. కానీ ఇప్పుడు రోజాను మళ్లీ తెరపైకి తేవడంతో పెద్దిరెడ్డి తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది.ఇటీవల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి బిజెపిలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దానికి కారణం లేకపోలేదు. జగన్ స్థాయిలో పెద్దిరెడ్డి ఫ్యామిలీని టార్గెట్ చేసుకుంది కూటమి ప్రభుత్వం. అయితే ఇంతవరకు జగన్మోహన్ రెడ్డిని టచ్ చేయలేదు కానీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు మద్యం కుంభకోణంలో. అయితే ఈ పరిణామాలతో తీవ్ర కలత చెందారు పెద్దిరెడ్డి. మరోవైపు మద్యం కుంభకోణంలో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సమయంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కనీసం జగన్మోహన్ రెడ్డి పరామర్శించిన దాఖలాలు లేవు. అప్పటినుంచి ఏర్పడిన గ్యాప్ అలానే విస్తరించింది. ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై అటవీ భూముల వ్యవహారం, ఆపై రెవెన్యూ రికార్డుల దహనం కేసు వెంటాడుతోంది. ఇన్ని అవమానాలు పడి జగన్మోహన్ రెడ్డి కోసం పార్టీలో ఉండాలా.. ఆపై తన ప్రత్యర్థి రోజాను ప్రోత్సహించడం ఎంత మాత్రం మింగుడు పడడం లేదు పెద్దిరెడ్డికి. అందుకే బిజెపిలోకి వెళ్లిపోవాలన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు రోజా. ఆమెకు నగిరి టిక్కెట్ ఇచ్చేందుకు జగన్ వెనుకడుగు వేస్తున్నారు అన్న ప్రచారం నేపథ్యంలోనే ఆమె చెన్నైలో ఉండిపోయారన్న టాక్ నడిచింది.. క్రమేపీ ఆమె వైసీపీకి గుడ్ బై చెబుతారని కూడా ప్రచారం సాగింది. కానీ ఉన్నట్టుండి ఆమెను తిరిగి చిత్తూరు రాజకీయాల్లోకి తేవడం.. మరింత స్వేచ్ఛ ఇవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. పెద్దిరెడ్డి పై ప్రోత్సహించేందుకే జగన్ ఆమెను తీసుకొచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఒకవేళ బిజెపిలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వెళితే రోజా ఇప్పుడు ప్రత్యామ్నాయంగా చిత్తూరు జిల్లాలో నాయకత్వ బాధ్యతలు చూస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

ఫుల్ రేంజ్‌లో లోకేష్ పాలిటిక్స్

విజయవాడ : మంత్రి నారా లోకేష్.. ఫుల్ రేంజ్‌లో తన రాజకీయాలను విస్తరిస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీపై ఆయ న పట్టు పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అవుతున్నాయి. నియోజకవర్గాలు, జిల్లాలు.. ఇలా ఎక్కడ ఎప్పుడు ఏది అవసరమో గుర్తించి.. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు పాలన చూసుకుంటూ.. మరోవైపు.. పార్టీ పనుల్లోనూ బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా కర్నూల్లో నిర్వహించిన సమావేశం లోకేష్ దూకుడుకు పక్కా రియాక్షన్ ఇచ్చింది. =పార్టీ కార్యక్రమాలకు ఇటీవల కాలంలో దూరంగా ఉంటూ వచ్చిన వారు కూడా.. తాజాగా లోకేష్ వస్తున్నారని తెలిసిన వెంటనే నాయకులు క్యూకట్టారు. అప్పటి వరకు ఉన్న విభేదాలను కూడా కొందరు నాయకులు దూరం పెట్టి చేతులు కలిపారు. లోకేష్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భేషజాలకు పోకుండా చేతు లు కలిపారు. ఇది.. పార్టీలో ఐక్యతకు నిదర్శనంగా మారిందని సీనియర్లు చెబుతున్నారు. నిజానికి కొన్నాళ్లుగా కర్నూలు తమ్ముళ్ల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. నిజానికి టీడీపీలో తరం మారుతున్న సంధికాలంలో నాయకుల పరిస్థితి.. అధిష్టానం ఆలోచనలు వంటివి ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి. చంద్రబాబుకు లోకేష్‌కు మధ్య వ్యత్యాసం.. దూకుడు వంటివి నాయకుల మధ్య ఆలోచనలను మారుస్తున్నాయి. చంద్రబాబు అయితే.. చెప్పింది వింటారు.. బుజ్జగిస్తారు.. సమయం ఇస్తారు.. అనే భరోసా ఉంటుంది.

దీంతో తప్పులు చేసిన నాయకులు కూడా వివరణ, విచారణలతో ఏదో ఒకరకంగా బయట పడుతున్నారు.కానీ, లోకేష్ విషయానికి వస్తే.. ఆయన దగ్గర ఇలాంటి కుదరడం లేదు. దీనికి అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. మైలవరం నుంచి పెనమలూరు వరకు.. పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న వివాదాలను లోకేష్ తనదైన శైలిలో పరిష్కరించారు. ఆయనేమీ సాగదీత ధోరణికి చాన్స్ ఇవ్వరు. ఫటాఫట్.. అన్నట్టు గా నాయకులతో మొహంమీదే మాట్లాడేస్తున్నారు. దీంతో నాయకుల మధ్య ఐక్యత పెంచేందుకు.. పార్టీని లైన్‌లో పెట్టేందుకు ఈ పరిణామాలు దోహదపడుతున్నాయి. ఇదే ఇప్పుడు కర్నూలులో నాయకులు తిరిగి కలుసుకునేందుకు అవకాశం కల్పించిందని అంటున్నారు.

వడివడిగా హైకోర్టు బెంచ్ ఏర్పాట్లు

కర్నూలు : రాయలసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్ష అయిన కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన తీవ్ర ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ అందుబాటులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ఒక రాష్ట్రంలో లేదా ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం మాత్రమే కాదు. దీనికి సుదీర్ఘమైన రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలు అవసరమవుతాయి. అందుకే 90 రోజుల గడువు సాధ్యమేనా? అసలు బెంచ్ ఏర్పాటు వెనుక ఉండే చట్టపరమైన క్రమం ఏమిటి? సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో హైకోర్టుకు చెందిన ఒక ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలంటే ది స్టేట్ హైకోర్ట్స్ యాక్ట్ లేదా సంబంధిత పునర్వ్యవస్థీకరణ చట్టాల నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొదట రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించాలి. అనంతరం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలోని ఫుల్ కోర్ట్ ముందుకు ఈ ప్రతిపాదన వెళుతుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ ఈ బెంచ్ ఏర్పాటుకు సాంకేతిక, మౌలిక వసతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఆమోదం తెలపాల్సి ఉంటుంది.హైకోర్టు ఫుల్ కోర్ట్ అంగీకారం తెలిపిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కేంద్ర న్యాయ శాఖ కు నివేదిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి , సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు పంపుతుంది. సుప్రీంకోర్టు సీజేఐ , కొలీజియం నుండి అనుమతి లభించిన తర్వాత మాత్రమే, కేంద్ర హోంశాఖ భారత రాష్ట్రపతి ఆమోదం కోసం ఫైలును పంపుతుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 214, సంబంధిత నిబంధనల ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్టబద్ధంగా రూపుదిద్దుకుంటుందిరాజ్యాంగపరమైన ఈ ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన అత్యంత ప్రధానమైనది. బెంచ్ నిర్వహణకు అవసరమైన తాత్కాలిక లేదా శాశ్వత భవనాలు, న్యాయమూర్తులకు నివాస సదుపాయాలు , కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ సెక్షన్లు, అడ్వకేట్ రూమ్‌లు, పోలీస్ బందోబస్తు , డిజిటల్ నెట్‌వర్కింగ్ వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయాలి. వీటితో పాటు అమరావతిలోని ప్రధాన హైకోర్టు నుండి కర్నూలు బెంచ్‌కు ఏ ఏ జిల్లాల కేసుల అధికార పరిధి బదిలీ చేయాలనే దానిపై న్యాయ పరిపాలనా పరమైన స్పష్టత రావాల్సి ఉంటుందిఇంతటి సుదీర్ఘ ప్రక్రియ ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేష్ 90 రోజుల గడువు విధించడం వెనుక కూటమి ప్రభుత్వ వ్యూహాత్మక ఆలోచన ఉందని రాజకీయ, న్యాయ విశ్లేషకులు భావిస్తున్నారు. కర్నూలులో ఇప్పటికే లోకాయుక్త వంటి న్యాయ సంస్థలకు ఉద్దేశించిన భవనాలు సిద్ధంగా ఉన్నందున, ప్రాథమికంగా తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రంతో మంచి సఖ్యతతో ఉన్నందున, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం త్వరితగతిన పూర్తి చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేల అనుమతుల ప్రక్రియను ఫాస్ట్ ట్రాక్ చేయాలనేది లోకేష్ వేసిన కచ్చితమైన ముందస్తు ప్రణాళికగా కనిపిస్తోంది. గతంలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియలపై న్యాయవాదుల నిరసనలు, వినతులు జాప్యానికి కారణమైన ఆధారాలు ఉన్నాయి.

అందువల్ల, 90 రోజుల్లో అన్ని రాజ్యాంగ ఆమోదాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో పరిపాలనాపరమైన క్లియరెన్సులను వేగవంతం చేస్తే, నిర్దిష్ట సమయంలో లేదా దానికి సమీప కాలంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ కల సాకారమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

భువనేశ్వరి ఆగ్రహం

తిరుపతి : నారా భువనేశ్వరి గత మూడు రోజుల నుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అయితే నారా భువనేశ్వరి ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడరు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు దాదాపు నాలుగు సార్లు ఎన్నికయినప్పటికీ నారా భువనేశ్వరి పాలన వ్యవహారాల్లోనూ, రాజకీయాల్లోనూ ఆమె జోక్యం కనపడదు. కేవలం కుటుంబ బాధ్యతలతో పాటు తాను నిర్వహిస్తున్న హెరిటేజ్ వంటి పరిశ్రమలకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే చూస్తున్నారు. నారా భువనేశ్వరి పక్కా బిజినెస్ ఉమెన్. అయితే ఎన్నికల సమయంలో మాత్రం కేవలం కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారు. అంతే తప్ప ఎటువంటి రాజకీయ వ్యవహారాలను నారా భువనేశ్వరి పట్టించుకోరు... నారా భువనేశ్వరిలో కోపం కనిపించదు. మృదుస్వభావి. అందరినీ నవ్వుతూ పలకరిస్తారు. అమ్మగా ఆమెను ఆప్యాయతను పంచుతారు. అలా చంద్రబాబుతో సమానంగా కుప్పం నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యారు. నారా భువనేశ్వరి మాత్రమే కాదు లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి కూడా రాజకీయాలను అస్సలు పట్టించుకోరు. వారు కుటుంబం, వ్యాపారాలకే పరిమితమై హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అలాంటి నారా భువనేశ్వరి కి కోపం వచ్చింది. ఒక్కసారిగా ఆవేదన ఉప్పొంగింది. కుప్పం నియోజకవర్గం పర్యటనలో ద్రౌపది చిత్రపటాన్ని చూసి నారా భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. కుప్పం పర్యటనలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నారా భువనేశ్వరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనను అసెంబ్లీలో అవమానించారని... అసెంబ్లీలో తనను నిండు సభలో అవమానించారని, ఆ సంఘటన మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణాన్ని తలపించిందని కంటతడి పెట్టుకున్నారు.

కౌరవులు సభలో ద్రౌపదిని అవమానించినట్టుగానే, గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం తన చరితను హేళన చేశారని మండిపడ్డారు. తన భర్తకు తానేంటో తెలుసునని, తన భర్త చంద్రబాబుకు బాగా తెలుసునని , ఏ మహిళపై వ్యక్తిగత విమర్శలు చేసే హక్కు ఎవరికీ లేదని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. రాజకీయాల్లో పోరాటాలు ఎవరిపై చేయాలన్నా చేసుకోవచ్చు కానీ, ఇళ్లలోని స్త్రీలను లాగి అవమానించడం అత్యంత హేయమని ఆవేదన వెలిబుచ్చారు. మగ అహంకారంతో గత ప్రభుత్వంలో వ్యవహరించి తనను హేళన చేయడాన్ని ఆమె గుర్తు చేసుకుని బాధపడ్డారు. ఇది రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.

వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

విజయవాడ : వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. కపిల్ సాహు టీం ఇప్పటికే ఏపీ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని అంటున్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా విపరీతమైన జనం రావడం, టూర్ ఆలస్యమవ్వడం వ్యూహకర్త వ్యూహంలో భాగమేనని అంటున్నారు. అయితే ఈ పేరు అధికారికంగా బయటకు రాకపోయినా అనధికారికంగా కపిల్ సాహు డ్యూటీలోకి దిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. టీవీకే అధినేత విజయ్ ఎన్నికల వ్యూహకర్త గా కపిల్ సాహు వ్యవహరించారు. ఆయన ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బృందంలో పనిచేసి, ఆ తర్వాత సొంతంగా 'పొలిటికల్ కన్సల్టింగ్ డొమైన్' అనే సంస్థను ఏర్పాటు చేసి విజయ్ పార్టీ టీవీకే విజయం కోసం పనిచేశారు. తొలిసారి విజయ్ ను ముఖ్యమంత్రి పీఠం పై కూర్చోబెట్టడంలో కపిల్ సాహు కీలకంగా వ్యవహరించారు. తక్కువ సీట్లు వచ్చినప్పటికీ కపిల్ సాహు టీం సోషల్ మీడియాలో డ్రైవ్ చేయడం, విజయ్ కు అనుకూలంగా మార్చడంలో సక్సెస్ అయ్యారు.

ఇదే విషయాన్ని వైసీపీ అధినేత జగన్ గుర్తించి ఆయనను తనకు 2029 ఎన్నికల వ్యూహకర్తగా ఉండాలని కోరినట్లు తెలిసింది. దీంతోకపిల్ సాహు ఇందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇప్పటికే కపిల్ సాహు టీం జగన్ వ్యవహారాలను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతతిన్నాయి. ప్రశాంత్ కిషోర్ సంస్థ ఐ ప్యాక్ లో పనిచేసిన అనుభవంతో,డాటా విశ్లేషణ, ప్రచార ప్రణాళికలు రూపొందించడంలో కపిల్ సాహు టీంకు మంచి పేరు ఉండటంతో జగన్ దృష్టిలో పడ్డారు. తనకు ప్రధాన మీడియా వ్యతిరేకం కావడం, డిజిటల్ ప్రచారంపై ఎక్కువగా ఆధారపడి రావాల్సి ఉండటంతో జగన్ కపిల్ సాహును ఎన్నికల వ్యూహకర్తగా ఎంచుకున్నారంటుననారు.

వీర మహిళలకు పెద్ద పీట

కాకినాడ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది.

దాదావు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమై న సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు.

బేబీ బంప్ తో కూల్ గా దర్శనమిచ్చిన సమంత

సినిమాలతోనే కాకుండా తన అదిరిపోయే ఫ్యాషన్ సెన్స్‌తో కూడా నిరంతరం వార్తల్లో నిలిచే కథానాయిక సమంత రూత్ ప్రభు. స్టైలిష్ లుక్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారిన సమంత, తాజాగా మస్టర్డ్ ఎల్లో కేప్ డ్రెస్‌లో బేబీ బంప్ తో దర్శనమిచ్చి అభిమానులను ఫిదా చేసింది. మినిమలిస్ట్ క్వీన్‌గా పిలువబడే ఈ భామ, తన కొత్త లుక్‌తో మోడ్రన్ అండ్ క్లాసీ స్టైలింగ్ ఎలా ఉండాలో మరోసారి నిరూపించింది. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలు చూద్దాం.. సమంత ధరించిన ఈ మస్టర్డ్ ఎల్లో డ్రెస్‌ను ప్రసిద్ధ బ్రాండ్ 'క్వా' డిజైన్ చేసింది. డిఫరెంట్ లుక్‌తో ఉన్న ఈ మిడీ-టు-మాక్సీ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది దాని 'కేప్' మోడల్. ఇక చాలా ఫ్రీగా, చూడగానే రాజసం ఉట్టిపడేలా ఉన్న ఈ డ్రెస్ డిజైన్ సమంతకు ఎంతో అందాన్ని ఇచ్చింది. సమంత వేసుకున్న డ్రెస్ ఎంత అందంగా ఉందో, దానికి మ్యాచ్ చేసిన జ్యువెలరీ కూడా అంతే ఆకట్టుకుంది.ఇక తమన్నా ఫైన్ జ్యువెలరీ నుంచి ఎంచుకున్న టర్కోయిస్ కమ్మలు ఈ మస్టర్డ్ రంగు డ్రెస్‌కు సరైన కాంట్రాస్ట్ కాంబినేషన్‌గా నిలిచాయి. ఇక ఇవి ఆమె లుక్‌కు ఒక ప్రత్యేకమైన మెరుపును అందించాయి. స్టైలిస్ట్ పల్లవి సింగ్ పర్యవేక్షణలో రూపొందిన ఈ స్టైలింగ్ నిజంగా అద్భుతం. సాఫ్ట్ మేకప్‌తో పాటు వేసుకున్న సింపుల్ అండ్ ఎలిగెంట్ హెయిర్ బన్ ఆమె అందాన్ని మరింత పెంచింది. ఇక ఎక్కడా అతి లేని చాలా సహజమైన, సింపుల్ మేకప్‌తో సమంత అందరినీ కట్టుపడేసింది. తాజాగా సమంత షేర్ చేసిన ఈ ఫోటోలలో ఆమె బేబీ బంప్ చాలా స్పష్టంగా కనిపిస్తోంది. బేబీ బంప్ లో సమంత మరింత అందంగా కట్టిపడేస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. కేవలం ఫ్యాషన్ లోనే కాకుండా సినిమాల్లోనూ సమంత తన మార్క్ చూపిస్తోంది. 'సిటాడెల్: హనీ బన్నీ' సిరీస్‌లో 'హనీ'గా యాక్షన్ ఓరియెంటెడ్ రోల్ చేసి అందరినీ మెప్పించిన సంగతి తెలిసిందే. ఇక ఆ తర్వాత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పై వచ్చిన 'మా ఇంటి బంగారం' చిత్రంలో శక్తివంతమైన పాత్రలో నటించి మెప్పించింది. మూవీ 100 కోట్ల క్లబ్ లో చేరి ..ఇప్పుడు హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతుంది .. ఒకవైపు నటనలో విభిన్నమైన పాత్రలు పోషిస్తూనే, మరోవైపు హై-ఫ్యాషన్ లుక్స్‌తో ట్రెండ్ సెట్ చేస్తోంది సమంత. ప్రయోగాలకు ఎప్పుడూ ముందుండే ఈ భామ, మస్టర్డ్ కేప్ లుక్‌తో మినిమల్ ఫ్యాషన్‌లో తనకు తానే సాటి అని మరోసారి నిరూపించుకుంది. ఈ పిక్స్ ఇప్పుడు ఫ్యాషన్ ప్రియులను తెగ ఆకట్టుకుంటున్నాయి.

రిలీజ్ డేట్ ను కాపాడేందుకు డ్రాగన్ మేకర్స్ తెలివైన అడుగు!

పాన్ ఇండియా సినిమాల విషయంలో రిలీజ్ డేట్ అనేది కేవలం ఒక డేట్ మాత్రమే కాదు. థియేట్రికల్ ప్లానింగ్, డిస్ట్రిబ్యూషన్ అగ్రిమెంట్స్, ఓటీటీ డీల్స్, ప్రమోషన్ షెడ్యూల్స్, ఇతర భాషల రిలీజ్‌లు వంటి అనేక అంశాలు దానిపై ఆధారపడి ఉంటాయి. అందుకే ఒక పెద్ద సినిమా షూటింగ్‌లో అనుకోని గ్యాప్ వచ్చినా, దాని ప్రభావం మొత్తం ప్రాజెక్ట్‌పై పడకుండా చూడటం మేకర్స్‌కు పెద్ద సవాల్‌గా మారుతుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ విషయంలో కూడా ప్రస్తుతం ఇదే డిస్కషన్ ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. ఎన్టీఆర్ భుజం గాయం కారణంగా కొద్ది వారాల విశ్రాంతి తీసుకుంటున్నప్పటికీ, షూటింగ్ షెడ్యూల్స్‌ను పూర్తిగా ఆపేయకుండా ముందుకు తీసుకెళ్లే వ్యూహాన్ని మేకర్స్ అమలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే ఇప్పుడు రిలీజ్ డేట్‌ను కాపాడేందుకు మేకర్స్ వేసిన కీలక అడుగుగా కనిపిస్తోంది. పెద్ద సినిమాల్లో హీరో అందుబాటులో లేని టైమ్ లో మొత్తం యూనిట్ వెయిట్ చేయడం వల్ల భారీ ఆర్థిక భారం ఏర్పడుతుంది. సెట్స్ నిర్వహణ, టెక్నికల్ టీమ్, ఇతర నటీనటుల డేట్స్, లాజిస్టిక్స్ వంటి అంశాలు ఆలస్యంతో మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే ముందుగా ప్లాన్ చేసిన షెడ్యూల్స్‌ను రీషెడ్యూల్ చేసి, హీరో అవసరం లేని కాంబినేషన్ సీన్స్, ఇతర క్యారెక్టర్లకు సంబంధించిన ఎపిసోడ్స్, ఇండిపెండెంట్ సీక్వెన్స్‌లను పూర్తి చేసే విధంగా షూటింగ్ ను కంటిన్యూ చేస్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి షెడ్యూలింగ్ పద్ధతి పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లలో చాలా కీలకంగా పరిగణిస్తారు. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల్లో ప్రతి షూటింగ్ రోజూ విలువైనదే. ఒక షెడ్యూల్ పోస్ట్‌పోన్ అయితే దాని ఎఫెక్ట్ తర్వాతి షెడ్యూల్స్, పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ వర్క్, ప్రమోషన్ క్యాలెండర్ వరకు వెళ్లే అవకాశం ఉంటుంది. అందుకే డైరెక్టర్లు, ప్రొడక్షన్ టీమ్స్ ప్రత్యామ్నాయ షెడ్యూల్స్‌ను రెడీగా ఉంచే ప్రయత్నం చేస్తుంటారు. డ్రాగన్ టీమ్ ప్రస్తుతం అదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ మొమెంటమ్‌ను కంటిన్యూ చేస్తూ, హీరో తిరిగి సెట్స్‌లో చేరే టైమ్ కు మెయిన్ సీన్స్ పై ఫోకస్ పెట్టేలా ప్లానింగ్ జరుగుతున్నట్లు సమాచారం. దీంతో ప్రాజెక్ట్ టైమ్‌లైన్‌పై పెద్దగా ప్రభావం పడకుండా చూసే అవకాశం ఉంది. ఇండస్ట్రీలో తరచుగా రూమర్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తున్న ఈ సమయంలో, ఒక భారీ సినిమా ప్రొడక్షన్‌ను ఎలా మేనేజ్ చేస్తారు? రిలీజ్ ప్లాన్‌ను ఎలా కాపాడుకుంటారు? అనే ప్రశ్నకు డ్రాగన్ ఎగ్జాంపుల్ గా నిలుస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఎన్టీఆర్ అందుబాటులో లేకపోయినా సినిమా షూటింగ్ ను ఆపకపోవడంతో రిలీజ్ డేట్ వెనక్కి వెళ్లదని తెలిసి ఫ్యాన్స్ కూడా సంతోషిస్తున్నారు.

రష్మిక, మృణాల్ , నభా నటేష్ లకు కలిసి రాని ప్రయత్నాలు!

పరిశ్రమలో హీరోయిన్లు గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన కథలను, వైవిధ్యభరిత పాత్రలను ఎంచుకుంటూ తమ పరిధులను విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇలాంటి ప్రయోగాలు ప్రతిసారీ ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. తాజాగా టాలీవుడ్‌తో పాటు ఇతర ఇండస్ట్రీలలోనూ కొందరు అగ్ర నాయికలు చేసిన విభిన్న ప్రయత్నాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఈ కోవలోనే రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, నభా నటేష్ వంటి క్రేజీ భామలు సరికొత్త జోనర్లు .. భిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రయత్నించారు. 'కాక్‌టెయిల్ 2', 'డెకాయిట్', 'నాగబంధం' వంటి చిత్రాలలో వీరు చేసిన ప్రయోగాలు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి. కానీ ఆయా చిత్రాల కథాకథనాలు, వీరు పోషించిన పాత్రలు ప్రేక్షకుల అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. నేషనల్ క్రష్ రష్మిక మందన్న గ్లామర్ ఇమేజ్‌ను పక్కన పెట్టి ఇంటెన్స్ డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలను ఎంచుకునే క్రమంలో కొన్ని ప్రయోగాత్మక చిత్రాలపై దృష్టి పెట్టారు. అయితే ఆమె చేసిన ఆ ప్రత్యేక ప్రయత్నాలు ప్రేక్షకులకు కనెక్ట్ కాలేకపోయాయి. పాత్రల ఎంపికలో కొత్తదనం ఉన్నా? కథనంలో లోపాలు రష్మిక కష్టాన్ని వెనక్కి నెట్టేలా చేశాయి. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో వరుస విజయాలు అందుకున్న మృణాల్ ఠాకూర్ కూడా సరికొత్త జోనర్లలోకి అడుగుపెట్టే ప్రయత్నం చేశారు. 'డెకాయిట్' లాంటి రా అండ్ రస్టిక్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్ సినిమాలలో ఆమె చేసిన సాహసం అందరి దృష్టిని ఆకర్షించింది. కానీ వెండితెరపై ఆ పాత్ర తాలూకు లోతు, ఎమోషన్ ప్రేక్షకులను తాకడంలో విఫలమవడంతో ఆ ప్రయత్నం కూడా అనుకున్నంతగా రీచ్ కాలేకపోయింది. గ్లామర్ బ్యూటీగా గుర్తింపు తెచ్చుకున్న నభా నటేష్ కూడా 'నాగబంధం' లాంటి మిథలాజికల్ అడ్వెంచర్ జోనర్ సినిమాలతో సరికొత్తగా ప్రయత్నించారు. కానీ ఈ సినిమాల నిర్మాణ శైలి, అనుకున్న విధంగా ఎన్విరాన్‌మెంట్‌ను తెరపై ఆవిష్కరించడంలో జరిగిన పొరపాట్లు ఆమె పాత్రకు పెద్దగా ప్లస్ కాలేదు. దీంతో ఈ భామలందరి కష్టానికి సరైన ఫలితం దక్కలేదనే చెప్పాలి. ఈ అనుభవాలన్నీ గమనిస్తే స్టార్ హీరోయిన్లు సాధారణ ఇమేజ్ నుండి బయటపడి సరికొత్తగా ప్రయత్నించడం అభినందనీయమే అయినా? కేవలం ప్రయోగాలు చేయడం మాత్రమే సరిపోదు. కథాబలం, బలమైన పాత్ర చిత్రణ ఉంటేనే ఏ నాయికనైనా ప్రేక్షకులు ఆదరిస్తారు. ఇకపై ఈ భామలు ఆచితూచి అడుగులు వేస్తూ తమలోని నటిని బయటపెట్టే కంటెంట్ ఉన్న బలమైన పాత్రలను ఎంచుకుంటేనే అనుకున్న ఫలితాలకు అవకాశం ఉంటుంది.

మహేష్ లైన్ లో సందీప్..బుచ్చిబాబు!

సూపర్ స్టార్ మహేష్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజమౌళి దర్శకత్వంలో 'వారణాసి' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గ్లోబల్ స్థాయిలో భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాపై పాన్ ఇండియాలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఇంకా 80 రోజుల షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉంది. అనంతరం మహేష్ 'వారణాసి'ని నుంచి రిలీవ్ అయిపోతారు. ఈ నేపథ్యంలో మహేష్ తదుపరి సినిమా ఏ డైరెక్టర్ తో చేస్తారు? అన్నది సర్వాత్రా ఆసక్తి నెలకొంది. రాజమౌళి ప్రాజెక్ట్ తర్వాత మహేష్ లైనప్ ఎలా ఉండబోతుందనే ఆసక్తి నటుడి అభిమానులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ నెలకొంది. ఈ రేసులో ప్రముఖ దర్శకులు సందీప్ రెడ్డి వంగా, బుచ్చిబాబు సానా పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇద్దరు టాప్ డైరెక్టర్లతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో క్రేజీ కాంబినేషన్లపై ఇండస్ట్రీలో రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ట్రెండ్ సెట్టింగ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందీప్ రెడ్డి వంగాతో మహేష్ తో సినిమా ఉండొచ్చనే వార్తలు సోషల్ మీడియాలో అవుతున్నాయి. యానిమల్ వంటి సంచలన చిత్రం తర్వాత సందీప్ ప్రస్తుతం ప్రభాస్‌తో స్పిరిట్ సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే మహేష్ తో సినిమా చేసేందుకు ఆయన కథా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇద్దరి కలయిక కుదిరితే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయం. మరోవైపు -ఉప్పెన- చిత్రంతోనే జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన బుచ్చిబాబు సానా పేరు కూడా బలంగా వినిపిస్తోంది. ఇటీవలే రామ్ చరణ్ కు పెద్దితో పాన్ ఇండియా విజయాన్ని అందించిన నేపథ్యంలో బుచ్చి పేరు పరిశ్రమలో మారు మ్రోగిపోతుంది. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు తదుపరి మహేష్ కోసం సీరియస్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మహేష్ కు సరిపోయే బలమైన కథను బుచ్చిబాబు సిద్ధం చేస్తున్నారని.. త్వరలోనే దీనికి సంబంధించి స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. బుచ్చిబాబు రెండవ సినిమాతోనే ఏకంగా రామ్ చరణ్ నే డైరెక్ట్ చేసి మెప్పించిన నేపథ్యంలో మహేష్ ని ఒప్పించడం పెద్ద కష్టం కాదు. పైగా బుచ్చి బాబు కథల్లో మట్టివాసన ఉంటుంది. స్టోరీల పరంగా నేల విడిచి సాము చేయడు. తీసిన రెండు సినిమాలు కూడా మంచి ఫలితాలు సాధించాయి. ఈ నేపథ్యంలో మహేష్ బుచ్చి కి నో చెప్పడం అంత సులభం కాదు. మొత్తానికి వారాణాసి విడుదల తర్వాత మహేష్ ఏ దర్శకుడితో సెట్స్ పైకి వెళ్తారు అనేది ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా -బుచ్చిబాబు సానా ఇద్దరూ రేసులో ఉండటంతో అభిమానులలో అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. త్వరలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం లేకపోలేదు.

భయం వేసినా పడే సమయం కూడా తమన్నాకివ్వలేదు

మిల్కీ బ్యూటీ తమన్నా కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. చిన్న క్యారెక్టర్ తో పరిచయమై తాను సైతం ఊహించని స్థాయికి అనూహ్యంగా చేరిపోయింది. టాలీవుడ్..కోలీవుడ్..బాలీవుడ్ అంటూ అన్ని పరిశ్రమల్లోనూ అమ్మడు సత్తా చాటింది. హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది. ప్రస్తుతం సెకెండ్ ఇన్నింగ్స్ కూడా దేదీప్యామనంగా సాగిపోతుంది. ఇక మంచి కుర్రాడిని చూసి పెళ్లి చేసుకోవడం ఒక్కటే మిగిలింది. ఆ కార్యక్రమం కూడా దగ్గర్లోనే ఉందని అంతా ఆశీస్తున్నారు. ఆ సంగతి పక్కన బెడితే అమ్మడు తాజాగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విష యాలను పంచుకున్నారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, డ్యాన్స్ నేర్చుకోవాల్సిన పరిస్థితి ఎలా ఏర్పడిందో తమన్నా వివరించారు. చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఎలాంటి శిక్షణ లేకుండానే డ్యాన్స్‌ను ఒక సర్వైవల్ స్కిల్ గా మార్చుకున్నానని తెలిపారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. భారీ సెట్లు .. వందలాది మంది టెక్నీషియన్ల మధ్య ఎలాంటి ముందస్తు రిహార్సల్స్ లేకుండానే పాటల్లో నటించాల్సి వచ్చేదని తమన్నా పేర్కొన్నారు. అప్పట్లో భయపడటానికి సమయం లేదని, కేవలం నేర్చుకోవడానికి మాత్రమే అవకాశం ఉండేదని వెల్లడించారు. ఆ నాటి కఠినమైన షెడ్యూల్స్ .. నిరంతర ఒత్తిడే తనను అద్భుతమైన పెర్ఫార్మర్‌గా తీర్చిదిద్దాయని అభి ప్రాయపడ్డారు. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్' లోని 'ఘఫూర్' పాట షూటింగ్ సమయంలోనూ ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు. రేంజర్ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని ఆరు గంటల నిద్రతోనే ఈ పాట కోసం ఎలాంటి రిహార్సల్స్ లేకుండా నేరుగా బరిలోకి దిగాల్సి వచ్చిందని తమన్నా గుర్తు చేసుకున్నారు. ఇలాంటి బిజీ షెడ్యూల్స్ మధ్య పని చేయడం నటీమణులకు పెద్ద సవాల్‌గా మారుతుందని పేర్కొన్నారు. అలాగే హిందీ చిత్ర పరిశ్రమలో నటీమణుల డ్యాన్స్ ప్రాధాన్యత గురించి మాట్లాడారు. నటనకు, డ్యాన్స్‌కు మధ్య అనవసరమైన వ్యత్యాసం చూపించడం సరికాదని తమన్నా అభిప్రాయపడ్డారు. మాధురి దీక్షిత్, శ్రీదేవి, రేఖ వంటి లెజెండరీ నటీమణులు అప్పట్లో అద్భుతమైన నటనతో పాటు డాన్స్ నంబర్లతోనూ ప్రేక్షకులను అలరించారని గుర్తు చేశారు. నటన , నృత్యం వేర్వేరు కాదని అవి ఒకదానికొకటి అనుసంధానంగా ఉండాలని స్పష్టం చేశారు. రెండు దశాబ్దాలకు పైగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్న తమన్నా కెరీర్ ప్రారంభంలో సంపాదించుకున్న వర్క్ ఎథిక్స్ వల్లే ఈ స్థాయికి చేరుకోగలి గానన్నారు. భాషలతో సంబంధం లేకుండా ప్రతి చిత్రంలోనూ తన వంతు ఉత్తమ నటనను అందించేందుకు ఎప్పుడూ శ్రమిస్తానన్నారు. కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒడిదుడుకులే తనలోని ప్రతిభను మరింత మెరుగుపరిచాయన్నారు. అందుకు దక్షిణాది చిత్ర పరిశ్రమ తనకు నటిగా బలమైన పునాదిని వేసిందన్నారు. అక్కడ నేర్చుకున్న పాఠాలే ఇండస్ట్రీలో నిలబెట్టాయని.. ఎలాంటి కష్టతరమైన పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యాన్ని ఆ అనుభవాలే అందించాయని తెలిపారు.



Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from 6-5-41/A, Arundelpet 5/1, Pasumalai Complex, 1st Floor, Guntur, Andhra Pradesh -522002 Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI. No. APTEL/26/A6182,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com